thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 230 కరీంనగర్ మంగళవారం, 28 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా సతీశ్‌రెడ్డి

న్యూఢిల్లీ: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్‌ఎస్‌ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్‌ఎస్‌ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్‌డీవో చైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.




## మొంథా తుపాను ఎఫెక్ట్.. తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు

హైదరాబాద్ : మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి మరో మూడు రోజులు అత్యంత భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మొంథా తుపానుగా మారిందని తెలిపారు. మొంథా తుపాను కాకినాడకి 570 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 600 కిలోమీటర్ల పరిధిలో కేంద్రీకృతం అయిందని చెప్పుకొచ్చారు. రేపు(మంగళవారం) ఈ తుపాను ఉత్తర వాయువ్య దిశలో కదిలి తీవ్ర తుపానుగా మారనుందని పేర్కొన్నారు. ఈ తీవ్ర తుపాను మంగళవారం రాత్రి, లేదా ఎల్లుండి(బుధవారం) ఉదయంలోగా మచిలీపట్నం, కళింగపట్నం ఇంచుమించు.. కోస్తా ఆంధ్రప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. తుపాను ప్రభావంతో ఈరోజు(సోమవారం) నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని వివరించారు. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. మంగళవారం, బుధవారం భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని వివరించారు.

మంగళవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు ప్రకటించారు. మంగళవారం 19 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని వెల్లడించారు. బుధవారం ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచన ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని ప్రకటించారు. అలాగే, ఎల్లుండి బుధవారం నిర్మల్, మంచిర్యాల, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.




## ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాలి..

కరీంనగర్ , అక్టోబరు27 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మహిళా అధికారులను కాంగ్రెస్ మంత్రులు వేధిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటికి పిలిచి వార్నింగ్‌లు ఇస్తున్నారని విమర్శించారు. అర్ధరాత్రి మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళల నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు బండి సంజయ్ కుమార్. ఇవాళ(సోమవారం) కరీనంగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో కేంద్రమంత్రి మాట్లాడారు. మహిళా అధికారులపై కాంగ్రెస్ మంత్రుల వేధింపులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులని వేధింపులకి గురిచేసిన ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు బండి సంజయ్ కుమార్. రౌడీషీటర్లు పోలీసులపై హత్యాయత్నం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదా..? అని ప్రశ్నించారు. పట్టపగలు గోరక్షకులపై కాల్పులు జరిపితే ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. తప్పు చేసిన రౌడీషీటర్లకు ఎంఐఎం అండగా ఉంటే వారికే వత్తాసు పలుకుతారా..? అని ఫైర్ అయ్యారు.




## రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి హరీశ్ రావుకు లేదు: పొన్నం

బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి హరీశ్ రావుకు లేదని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లను ఆదుకునే బాధ్యత తమదని చెప్పారు. కేబినెట్ పై హరీశ్ రావు చేసిన ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. డైవర్షన్ పాలిటిక్స్ ను హరీష్ రావు బంద్ చేయాలని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కంటోన్మెంట్ ఫలితాలు రిపీట్ కాబోతున్నాయని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ లో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుందని.. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తారని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 12000 ఇస్తామని మోసం చేసిందని దుయ్యబట్టారు. వెంటనే బాకీ పడ్డ రూ.24 వేలను ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం ఆటో కార్మికులకు రెండు సంవత్సరాల బాకీ చెల్లించినా రూ. 1500 కోట్లు అవుతుందని చెప్పారు. రూ. 3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై రూ. 3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయన్నారు. అందులో నుంచి రూ. 1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి ఆటో కార్మికులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 161 ఆటో కార్మికులు చనిపోయారని.. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ లోని ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ నుండి తెలంగాణ భవన్ వరకు హరీశ్ ఆటోలో ప్రయాణించి మాట్లాడారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి సీఎం రేవంత్

## నేడు యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సభ

## 30, 31న.. నవంబరు 4, 5 తేదీల్లో రోడ్‌షోలు!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న ఆయన.. స్వయంగా ప్రచారంలోకి దిగుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని యూసఫ్‌గూడ పోలీసగ్రౌండ్స్‌లో ఈ నెల 28న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, 24 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ జరగనుంది. ఆయనతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావునూ సన్మానించనున్నారు. ఆ సభలో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నట్లు సమాచారం. అలాగే ఈ నెల 30, 31 తేదీల్లోను మళ్లీ నవంబర్ 4, 5 తేదీల్లోనూ ఆయన రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీటికి మధ్యలో బిహార్ ఎన్నికల ప్రచారానికీ ఆయన వెళ్లనున్నట్లు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 22 నెలల పాలనకు ఈ ఉప ఎన్నిక కొలమానంగా మారడం, ఇక్కడ గెలిస్తే దాని ప్రభావం జీహెచ్‌ఎంసీ ఎన్నికలపైనా పడే అవకాశమున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

జూబ్లీహిల్స్ నియోజక వర్గ పరిధిలో భారీ బహిరంగ సభ, నాలుగు రోడ్డు షోలకు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నెల 28వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహ ణకు కాంగ్రెస్ హై కమాండ్ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 30, 31వ తేదీల్లో ముఖ్యమంత్రి రోడ్డు షో నిర్వహించనున్నారు. నవంబర్ 4, 5వ తేదీల్లో మరో విడత రోడ్డు షోలో పాల్గొననున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

**రెండు విడతల్లో సీఎం రేవంత్‌రెడ్డి ర్యాలీలు: మహేష్ గౌడ్...** జూబ్లీహిల్స్‌లో రెండు విడతల్లో సీఎం రేవంత్‌రెడ్డి ర్యాలీలు ఉంటాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తమ ప్రభుత్వంలో జూబ్లీహిల్స్‌లో 70 శాతం సంక్షేమ పథకాలు అందాయని ఉద్ఘాటించారు. బీజేపీ ఎంతసేపటికీ మతం పేరుతో ఓట్లు అడగటం తప్పా హైదరాబాద్ అభివృద్ధికి ఏం చేసిందని ప్రశ్నించారు.




## ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ డెవలప్‌మెంట్‌కి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు మహేష్ కుమార్ గౌడ్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ దృష్టిలో తనతో సహా ఇతర నేతలందరూ ఉన్నట్లేనని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ హై కమాండ్ అన్ని విషయాలను చూస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ లాగా వ్యక్తుల జీవితాల్లోకి తాము తొంగిచూడమని తెలిపారు. మాగంటి గోపీనాథ్ కుటుంబ విషయం.. వారి వ్యక్తిగత అంశమని.. వాటితో తమకు సంబంధం ఏముందని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.




న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక ప్రక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు.


గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ కాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు.

**జస్టిస్ సూర్యకాంత్ ఎవరు?...** హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్‌ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాను నవీకరించడం, ధృవీకరించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ ప్రక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవుతుంది.

**తొమ్మిది రాష్ట్రాలతో పాటు యూటీలు...** రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ , తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.




## ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ రేవంత్ అమలు చేయలేదు: హరీశ్‌రావు

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా తయారైందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఎర్రగడ్డలో ఆటో కార్మికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు ఆటోలో వెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 161 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఆటో కార్మికులను రాహుల్‌గాంధీ మోసం చేసి ఓట్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. వారికి సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. "అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ రేవంత్‌రెడ్డి అమలు చేయలేదు. వారిని రోడ్డున పడేశారు.

బాకీ పడిన రూ. 24 వేలు వెంటనే చెల్లించాలి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే.. హామీని నెరవేరుస్తారు. చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున చెల్లించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రైతులకు నష్టం జరగకుండా పంటలు కొనుగోలు చేయాలి: సీఎం రేవంత్



హైదరాబాద్: తెలంగాణకు వర్ష సూచన దృష్ట్యా రైతులకు నష్టం కలగకుండా పంటలు కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం ఆదేశాలతో సాయంత్రం కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల కొనుగోళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మంత్రులు వారికి వివరించారు.

**రైతులు తేమ శాతం దృష్టిలో పెట్టుకోవాలి: తుమ్మల...** పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పత్తిలో తేమ 12 శాతానికి మించకుండా చూసుకోవాలని సూచించారు. అంతకు మించితే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశామని.. పత్తి రైతులకు గరిష్ఠ మద్దతు ధర అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.




హైదరాబాద్: రాబోయే రోజుల్లో భాజపా విజయానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాంది కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఉప ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్–భాజపా మధ్యే పోటీ ఉంటుంది. ప్రజలు భాజపాకు ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి. ఆ పార్టీని ఆపాలంటే భాజపాను గెలిపించాలి. జూబ్లీహిల్స్‌కు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిందేమీ లేదు. భాజపాను గెలిపించాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

## బీఆర్ఎస్‌పై ఎన్నికల ఆర్వోకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలు



బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఎన్నికల ఆర్వోకు సోమవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కంప్లైంట్ చేశారు. కోడ్ ఉల్లంఘనలో భాగంగా చర్చిలకు వెళ్లి ప్రచారం చేస్తున్నట్లు ఆధారాలను ఆర్వోకి అందజేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభ్యర్థి పేరు, ఫోటోతో కూడిన ఓటర్ స్లిప్స్ పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై రిటర్నింగ్ ఆఫీసర్‌కి ఫిర్యాదు చేశామని మీడియా సెల్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. చర్చిలలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఓటరు పోల్ చిట్టిలను పంచుతూ అడ్డంగా దొరికారని మండిపడ్డారు. ఆధారాలతో సహా రిటర్నింగ్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అధికార దుర్వినియోగం చేసినట్టే.. ఇప్పుడు కూడా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు బరితెగిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడే కాదు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ పొంగనాలు కొడుతున్నారాని ఫైర్ అయ్యారు. కేటీఆర్, హరీష్ దొంగతనం చేసి మాగంటి సునీతకు అంటగడుతున్నారని విమర్శించారు. సునీత గెలవడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేనట్టుందని.. ఓడిపోతారని తెలిసే పిచ్చి నాటకాలు వేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిజాయితీగా ఎన్నికల్లో గెలిస్తే హర్షిస్తామని.. బీఆర్ఎస్ నేతలు సునీత మంచి కోసం పని చేయాలన్నారు. కేసీఆర్ గురించి మాట్లాడితే దుబాయ్ శేఖర్ అనే పిలవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాము ఏం చేసినా చెల్లుతుందని బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తన సొంత మీడియాలో ప్రకటనలు ఇస్తోందని.. వాటిని అభ్యర్థి లెక్కలో జమకట్టాలన్నారు. కాంగ్రెస్ క్యాండిడేట్ పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల రూల్స్ ఉల్లంఘిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. 'ఎన్నికలను ఆదర్శంగా నిర్వహించాలని మేం ప్రయత్నిస్తున్నాం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం సరికాదు. చర్చిలలో ప్రచారం చేయడం తప్పు. పోల్ స్లిప్స్ పంచితే చర్యలు తీసుకోవాల్సిందే. జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నారు. దొంగ దారిలో గెలిస్తే చర్యలు తప్పకుండా ఉంటాయి' అని హెచ్చరించారు.




హైదరాబాద్, అక్టోబర్ 27: రాష్ట్రంలో మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మైనారిటీ నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మైనార్టీల కోసం రూ. 4 వేల కోట్ల బడ్జెట్ పెడతామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాము కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదని కొనియాడారు. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు.. కానీ ఇక్కడ చెప్పరని విమర్శించారు. బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. హైడ్రా గురించి రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉంటారని విమర్శించారు. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగాలని.. వాళ్లు సమాధానం చెప్పలేరని విమర్శించారు. ఇదే విషయంపై కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. 'ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా' అని సమాధానం చెప్పారని.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ ఎద్దేవా చేశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు నింపే సంస్థలని రాహుల్ గాంధీ విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతలకు లాభం చేకూరుస్తారని ఆరోపించారు. మోదీ తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తొందరగా ఇక్కడ రేవంత్ అమలు చేస్తారని విమర్శించారు. ఇది బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. ఇది కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని దుయ్యబట్టారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారని ఫైర్ అయ్యారు. మహిళలకు ఫ్రీ బస్ అని చెప్పి.. పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని విమర్శించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు.. భారీగా రౌడీషీటర్లు బైండోవర్




హైదరాబాద్, అక్టోబర్ 27: జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక మరి కొద్ది రోజుల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో నగర పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన నవీన్ యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్‌తో సహా మరో 100 మంది రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. అయితే బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 74 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు.

ఇక మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న శ్రీశైలం యాదవ్‌తోపాటు అతడి సోదరుడు రమేశ్ యాదవ్‌తో సహా 19 మంది రౌడీ షీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. ఈ ఉప ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల జరుగుతున్న అసెంబ్లీ పరిధిలోని రౌడీ షీటర్లపై పోలీసులు నిఘాను పెంచారు. అయితే ఈ ఉప ఎన్నికల వేళ.. వీరిపై కేసులు నమోదు అయితే మాత్రం పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.

**బైండోవర్ అంటే.. ?...** సాధారణంగా ఎన్నికల సమయంలో బైండోవర్ పదం వినిపిస్తుంది. పాత నేరస్థులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తారు. అంటే.. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నా.. ఆ వ్యక్తిని తహసీల్దార్ లేదా ఆర్డీవో ఎదుట పోలీసులు హాజరుపరుస్తారు. బాండ్ పేపర్‌పై ఆ వ్యక్తితో చట్ట వ్యతిరేక పనులు చర్యలు చేపట్టబోమని లిఖిత పూర్వకంగా హామీ తీసుకొని సొంతపూచి కత్తుపై విడుదల చేస్తారు. బైండోవర్‌ను బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్ అంటారు. బైండోవర్ అయిన వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 24 గంటల్లో అరెస్ట్ చేస్తారు. అతడిపై ఐపీసీ 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. బైండోవర్ సమయంలో వ్యక్తులు రాసిచ్చిన పత్రాలు కొన్ని నెలల వరకు పోలీసుల వద్ద ఉంటాయి. ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను బరిలో దింపాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెలువడనున్నాయి.





హైదరాబాద్, అక్టోబర్ 27: బావ, బామ్మర్దుల నస భరించాల్సిన పరిస్థితి తెలంగాణ ప్రజలకు పట్టిందంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్న పదేళ్లు బందిపోట్ల లాగా దోచుకున్నారని ఆయన విమర్శించారు. 'బీఆర్ఎస్ నాయకులు ఇంత దిగజారి మాట్లాడతారా? బీఆర్ఎస్ మంత్రులకు సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుండే. బీఆర్ఎస్ మంత్రుల్లో వెన్నెముక ఎవరికీ లేకుండే. ముఖ్యమంత్రిపై ఎక్కువ మాట్లాడే దరిద్రులను హెచ్చరిస్తున్నా. ఆటో కార్మికులు చనిపోయిన రోజు బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఉన్నారు? మంత్రి వర్గాన్ని కించపరిచిన వారిపై కార్యాచరణ ప్రకటిస్తాం.' అంటూ అద్దంకి తిట్లదండకం అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో పారిపోయిన హరీశ్.. ఇప్పుడు అడ్లూరిని చూసి పారిపోయారని అద్దంకి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు అమ్మపాలు తాగి రొమ్ము గుద్దే రకం అంటూ ఆరోపించారు. సొంత మనిషి కవిత.. తనకి అన్యాయం జరిగిందని చెప్పినా పట్టించుకోవడం లేదని అద్దంకి అన్నారు. అప్పుడు బీఆర్ఎస్ ను ప్రజలు గెలిపించడం.. తెలంగాణను దోచుకోవడానికి బీఆర్ఎస్ పార్టీకి లైసెన్స్ ఇచ్చినట్టు అయింది అని అద్దంకి తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఇక, క్రియాశీల రాజకీయాలకు వస్తాడో లేదో తెలియదంటూ కూడా కామెంట్ చేశారు అద్దంకి.

ఊహించినట్టుగానే సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బంగారం ధరలు మరింతగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లల్లో పసిడి ధరల తగ్గుదల, అమెరికా–చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటం వెరసి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో నేడు ట్రేడింగ్ మొదట్లో పసిడి ధరలు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ. 1140 మేర తగ్గి రూ. 1,24,480కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1050 మేర తగ్గి రూ. 1,14,100 వద్ద తచ్చాడుతోంది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లల్లో కూడా పసిడి ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఔన్స్ బంగారం (24 క్యారెట్) స్పాట్ ధర రూ. 0.7 శాతం మేర క్షీణించి 4,082.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 1 శాతం మేర తగ్గి 4,095.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు మరింత తగ్గే ఛాన్సుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య సానుకూల వాతావరణంలో వాణిజ్య చర్చలు జరుగుతుండటంతో సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండికి డిమాండ్ తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రామాణిక వడ్డీ రేట్ల కోత విషయంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయం గురించి మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించంతో కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లల్లో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం ఉంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాత్రం వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.



# నిబద్ధతకు ప్రతిరూపం రాఘవాచారి - అక్టోబర్ 28... సంపాదక "చక్రవర్తుల" వర్ధంతి



నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, విలువలు, నిబద్ధతతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన పాత్రికేయులు, సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశారు. రాఘవాచారి స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం. 1939 సెప్టెంబరు 10న ఆయన జన్మించారు. నిబద్ధతత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. తెలుగు పబ్లిక్ రచయితల్లో నిరుప మానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి, తెలుగు, ఇంగ్లీష్ సంస్కృత భాషల్లో పండితులు. పాత్రికేయుడు, సీనియర్ జర్నలిస్ట్. 1972 నుండి 2005 వరకు విశాలాంధ్రలో సంపాదకుడిగా పనిచేశారు. ఆయన మూర్తీభవించిన నిజాయితీ పరుడు. ఆయన వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచి ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు రామాయణ మహా భారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియ మించారు. సంస్కృతం నేర్చు కోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతా పురం గ్రామంలో జన్మించిన రాఘవాచారి సికింద్రాబాద్ సమీపంలోని లాలాగూడ రైల్వే పాఠశాలలో 11వ ఏట అయిదో తరగతిలో చేరారు. 1953 నుంచి విశాలాంధ్ర చదవడం ప్రారంభించారు. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం 6వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు చదువు మీద ఆసక్తి తగ్గింది. వరంగల్ వెళ్లి బీఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు. పట్టభద్రుడైన తరువాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం చదివారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీష్ చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు. న్యాయ శాస్త్రంలో పట్ట భద్రుడైన తరువాత ఎల్.ఎల్.ఎం. చేశారు. 1969-71 మధ్య ఆయన ఢిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల ఇంగ్లీష్ పత్రిక విలేకరిగా పని చేశారు. 1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకుల య్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. 'తెలుగు పత్రిక పరిణామం - ప్రయోగాలు - ప్రయోజనం' అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాషా ప్రామాణీకరణ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. విజయ వాడ, ఇతర ప్రాంతాల.లోనూ ఉపన్యాసకుడిగా ఆయనను ఆహ్వానించే వారు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిస లాడేది. ఆయన గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండి నాకా, ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చట పడేవారు. నిబద్ధత కలిగి, విలువలకు జీవితాంతం కట్టుబడిన కమ్యూనిస్టుగా విజ్ఞానఖనిగా రాఘవాచారి పేరు గాంచారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. 30 ఏళ్ల పాటు విశాలాంధ్ర సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాఘవాచారి, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవాచారి 2005 వరకు కొనసాగారు. రాఘవాచారి, హైదరాబాదులోని ఒక హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ 2019, అక్టోబరు 28వ తేది తెల్లవారు జామున మరణించారు. తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవను తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తించుకునే, ఉదాత్తమైన వ్యక్తిత్వం ఉన్న రాఘవాచారి నిస్సందేహంగా మేధావి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# చందమామతో కొడవటిగంటి విడదీయరాని అనుబంధం

## - అక్టోబర్ 28...కొడవటిగంటి కుటుంబరావు జయంతి


దాదాపు ముప్పై సంవత్సరాలుగా "చందమామ" సంపాదకవర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ''చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభ వాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు. చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి. తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశితంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుంబాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు %-% వాటి ప్రభావాలు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర? త్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ %-% పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు. కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 - 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. "కొకు" గా చిరపరిచితు డైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు. కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మిం చారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రీ, 1920లో తల్లీ మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు. ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు. 1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో ఆయన పెళ్ళి జరిగింది. 1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927-29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేసరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు. 1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురిత మైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాస పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు. 1940 - 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహెూద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు. 1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950-51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు. జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదిం చారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో... నాకు ఒకటే ఆశయం %-% నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది. నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు. 1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# బాల సాహిత్యంలో ధృవతార అవసరాల

## - అక్టోబర్ 28... అవసరాల రామ కృష్ణారావు వర్ధంతి



అవసరాల రామకృష్ణారావు ప్రముఖ సాహితీ వేత్త, నవలా రచయిత. తెలుగు సాహిత్యం బతికి బట్టకట్టినంతకాలం గుర్తుంచుకునే కథా భీష్ముడు. ఆయన 1931, డిసెంబర్ 21న చెన్నైలో జన్మించి న రామ కృష్ణారావుకు బాల సాహిత్యంలో అజరా మరం గా నిలిచిన చందమామతో ఆయనకు గల బంధం, అనుబంధం విడదీయరానిది. ఏడు పదుల ఏళ్ళకిందట తన 15 సంవత్సరాల తొలి సంధ్య లో చందమామ 1947 జూలై సంచిక 'లో 'పొట్టిపిచిక కథ'తో ప్రారంభించింది మొదలు మలి సంధ్యలో 80ఏళ్ళ వయసు వరకు రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన విశిష్ట కథా రచయిత. పొట్టి పిచిక కథ ప్రారంభ, ముగింపులు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. 'పొట్టి పిచిక కథ' రచనే తన విజయ సూత్రం అవుతుందని ఆనాడు, ఏనాడూ అనుకోలే దని చెప్పేవారు. పదిహేనేళ్ల ప్రాయంలో రాసిన, ఈ కథ ఇచ్చే సందేశం నిజంగా అద్భుతం. వెయ్యికి పైగా రచనలు చేసి, తల వంచక, కలం దించక తెలుగు కథకుడిగా కొనసాగి సుదీర్ఘ సాహితీ వ్యాసంగంలో పక్షులతో జంతువులతో మనుషుల్ని కలిపి సామాజికాంశాల్ని అలవోకగా కథా వస్తువులుగా చేసు కోవడానికి చందమామ పత్రికనే భూమిక అని చెప్పేవారు. చందమామ కథ ఇచ్చిన ఊపుతో తాను రాసిన సుప్రసిద్ధ పిల్లల రచనల్లో 'కేటూ డూప్లికేటూ,' 'మేథ మేట్రిక్స్,' మూడు భాగాలూ, 'ఆంగ్రేజీ మేడీజీ,' 'ఆంగ్రేజీ యమ ఈజీ వంటి అరడజను రచనలు భాగమని కూడా ఆయన ఘనంగా చెప్పుకున్నారు. తెలుగులో నవలలు, కథలు వెయ్యికి పైగా రాసి వన్నెకెక్కి న కథా రచయితగా పేరు తెచ్చు కున్నారు. ఆయన తుని ఎస్సార్ ఉన్నత పాఠశాలలో లెక్కలు, సైన్సు బోధించారు. ఒరిస్సాలో ఇంగ్లీషు రీడర్ గా పని చేశారు. విశాఖ పట్నంలో ఇంగ్లీషు లెక్చరర్ గా పని చేశారు. వృత్తి జీవితమంతా ఆంగ్ల భాష బోధించినా, తెలుగు భాష పై ఉన్న వ్యామోహం తోనే దశాబ్దాల కాలంలో వెయ్యికి పైగా రచనలు మాతృ భాష లోనే చేశారు. ఆధునిక సమాజం తెస్తున్న మార్పుల్లో కొన్నింటికి దూరంగానే ఉన్నా నని అంగీకరించారు. మనం మనుష్యులం, సహ జీవన సౌభాగ్యం, ఇంకానా అంతరాలు? అడుగో మావయ్య, ఆ వెనకే మేరీ, సంపెంగలూ, సన్నజాజులూ, మేం చేసిన తప్పు మీరూ చేస్తారా?, అది ప్రశ్న, ఇది జవాబు, హెడ్మిస్ట్రెస్ హేమ లత, పేక ముక్కలు, కథా వాహిని, గణిత విశారద, కేటూ, డూప్లికేటూ, అర్థమున్న కథలు, రామ చిలుక, మోహన రాగం, మేథమే ట్రిక్స్ 1, మేథ మేట్రిక్స్2 మేథమే ట్రిక్స్3, అంగ్రేజీ మేడీజీ "తదితర రచనలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం (1969), తెలుగు విశ్వ విద్యాలయం హాస్య రచయిత పుర స్కారం (1994), జ్యేష్ఠ లిటరరీ అవార్డు (1998), కొలసాని చక్రపాణి అవార్డు (1999), ఢిల్లీ తెలుగు ఎకాడమీ ఉగాది పురస్కారం (2000). ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వైభవం పురస్కారం (2004) తదితర అవార్డులు, పుర స్కారాలు ఆయన కు లభించాయి. అవసరాల 2011, అక్టోబర్ 28న హైదరాబాదులో తుది శ్వాస విడిచి, ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# కవిత 'టచ్' పాలిటిక్స్: బీఆర్ఎస్ అలెర్ట్!

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ నాయకులకు పుండుపై కారంగా మారాయి. ఆమె పార్టీని వీడి వెళ్లడంపై ఎవరూ పెద్దగా చింతించడం లేదు. కానీ, ఆమె చేసిన, చేస్తున్న వ్యాఖ్యలతో మాత్రం కలవర పడుతున్నారు. పార్టీలో ఉన్నప్పుడు.. పార్టీని వదిలేసిన తర్వాత కూడా కవిత వ్యవహారం కేసీఆర్ సహా.. పార్టీ అగ్రనాయకుల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. పార్టీలో ఉన్నప్పుడు కాళేశ్వరం అవినీతిపై కవిత చేసిన వ్యాఖ్యలు మంటలు రేపాయి. అలానే తన తండ్రి కేసీఆర్‌ను దేవుడు అంటూనే ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల క్రమంలోనేకవితను పార్టీ నుంచి బయటకు(సస్పెండ్) పంపారు. అయితే.. ఈ పరాభవంతో కలత చెందిన కవిత ఏకంగా పార్టీకే రాజీనామా చేసి.. ఎమ్మెల్సీ పదవిని కూడా వదులుకున్నారు. కట్ చేస్తే.. ఇప్పుడు ఆమెకు, బీఆర్ ఎస్‌కు ఎలాం టి సంబంధం లేదు. అయినా.. కూడా కవిత వ్యవహారాలు బీఆర్ ఎస్‌ను కలవర పెడుతున్నాయి. తాజాగా మీడియాతో మాట్లా డిన కవిత.. దాదాపు సొంత పార్టీపై సంకేతాలు ఇచ్చారు. నేరుగా స్పందించకపోయినా.. వందల మందితో మాట్లాడుతున్నా. గతంలో కేసీఆర్ కూడా ఇలానే మాట్లాడారు. పార్టీలు కొత్తవి రావాల్సిన అవసరం ఉంది. ఎన్ని పార్టీలు వస్తే అంతగా తెలంగాణ సమాజానికి మేలు జరుగుతుంది. అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. బీఆర్ఎస్ నాయకులు తనకు %-%టచ్%-%లో ఉన్నారంటూ కవిత మరో బాంబు పేల్చారు. ఒకవైపు కొత్తపార్టీ పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతూనే.. మరోవైపు, కేసీఆర్ వందల మందితో మాట్లాడారని.. ఇప్పుడు తాను కూడా ఇదే చేస్తున్నా నని ఆమె చెప్పుకొచ్చారు. ఇక, బీఆర్ ఎస్ నాయకులే తనతో టచ్‌లో ఉన్నారని కూడా చెప్పుకొచ్చారు. చాలా మంది ఈ జాబితాలో ఉన్నారని చెప్పారు. అయితే.. వారి పేర్లను మాత్రం ఆమె వెల్లడించలేదు. దీంతో బీఆర్ ఎస్ అధిష్టానం ఈ వ్యవహారం పై అలెర్ట్ అయినట్టు తెలిసింది. కవితతో టచ్‌లో ఉన్నవారు ఎవరు? అనే విషయంపై కూపీ లాగుతున్నట్టు సమాచారం. ప్రస్తుత ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కొందరు అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మల్లారెడ్డి సహా ఆయన అల్లుడు కూడా అసంతృప్తితో ఉన్నారు. అలానే మరికొందరు కూడా పార్టీకి దూరంగా ఉంటున్నారు. వీరంతా కవితతో టచ్‌లో ఉన్నట్టు సంకేతాలు ఉన్నా.. నిర్ధారణ కావడం లేదు. దీంతో వారి వ్యవహారాలు, రాజకీయంగా వారు ఎలా ఉన్నారు? అనే విషయాలపై ఆయా జిల్లాల నాయకుల నుంచి పార్టీ సమాచారం సేకరించేందుకు రెడీ అయింది. ఇదిలావుంటే.. కవితకు తెలంగాణ సమాజంలో పెద్దగా ప్రాధాన్యం లేదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. కేసీఆర్ బిడ్డగానే ఆమె గుర్తింపు పొందారని.. ఒంటరి పోరాటం ఫలించడం కష్టమని మరికొందరు అంటున్నారు. ఏదేమైనా టచ్ పాలిటిక్స్ మాత్రం బీఆర్ ఎస్‌కు సెగ పెడుతున్నాయి.




# ఆ పదం పాక్‌కు ఎప్పటికీ వింతే : ఐరాసలో దుయ్యబట్టిన భారత్

ప్రజాస్వామ్యం అనే పదం పాకిస్థాన్‌కు ఎప్పటికీ వింతేనని భారత్ దుయ్యబట్టింది. ఆ దేశం చట్టవిరుద్ధంగా ఆక్రమించిన ప్రాంతాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై ఆందోళన వ్యక్తంచేసింది. వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆ దేశ సైన్యం ఆక్రమణ, అణచివేత, వనరులను చట్టవిరుద్ధంగా వినియోగించడం వంటి వాటిపై అక్కడి ప్రజలు తిరుగుబాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలను అంతం చేయాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగంగా ఉందని, ఎప్పటికీ ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ఆ ప్రాంత ప్రజలు భారత ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వారి ప్రాథమిక హక్కులను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇది పాక్‌కు ఎప్పటికీ మింగుడుపడని విషయమని ఎద్దేవా చేశారు. ఇక, భారత్ వసుదైవ కుటుంబకం అని అన్నారు. ప్రపంచం మొత్తాన్ని ఒకే కుటుంబంగా చూడటం, అందరికీ న్యాయం, గౌరవం కోసం తన గొంతుకను వినిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా రెండో ప్రపంచయుద్ధం తర్వాత అంతర్జాతీయ శాంతి, భద్రతకు ఆశాకిరణంగా యూఎన్ స్థాపించిన విషయాన్ని గుర్తుచేశారు. వలస రాజ్యాల నిర్మూలనకు సంస్థ ఎంతో కృషి చేసిందన్నారు.

# అఫ్గాన్-పాక్ బోర్డర్ మూసివేత ఎఫెక్ట్.. కిలో టమాటా ధర 600 పాకిస్థానీ రూపాయలు

పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొనడంతో అక్టోబర్ 11 నుంచి ఇరుదేశాల సరిహద్దులను మూసివేశారు. దీంతో పాక్- అఫ్గాన్ ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది. బోర్డర్ మూసివేత వల్ల ఇరుదేశాల్లో పండ్లు, కూరగాయలు, ఖనిజాలు, ఔషధాలు, గోధుమలు, బియ్యం, చక్కెర, మాంసం, పాల ఉత్పత్తులు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఘర్షణలకు ముందుతో పోలిస్తే పాక్‌లో టమాటా ధరలు ఐదు రెట్లు పెరిగినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కిలో టమాటాల ధర 600 పాకిస్థానీ రూపాయలు ఉన్నట్లు తెలుస్తోంది. అఫ్గాన్ నుంచి అధికంగా దిగుమతి చేసుకునే ఆపిల్ ధరలు కూడా భారీగా పెరిగినట్లు సమాచారం.

సాధారణంగా పాక్- అఫ్గాన్ సరిహద్దు నుంచి ఏటా ఇరుదేశాల మధ్య 2.3 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని.. ఇరుదేశాల మధ్య ఘర్షణలు చెలరేగడంతో బోర్డర్లలో వాణిజ్య, రవాణా సదుపాయాలు పూర్తిగా నిలిపివేశామని కాబుల్‌లోని పాక్-అఫ్గాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధిపతి ఖాన్ జాన్ అలోకోజాయ్ వెల్లడించారు. దీనివల్ల రోజుకు ఇరువైపులా దాదాపు 1 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8 కోట్లు) నష్టం వాటిల్లుతుందన్నారు. అఫ్గాన్ నుంచి పాక్‌కు సరఫరా చేసే దాదాపు 5 కంటైనర్ల కురగాయలు పాడైనట్లు తెలిపారు. సరిహద్దుకు ఇరువైపులా దాదాపు 5వేల కంటైనర్లు నిలిచిపోయాయని పాకిస్థాన్‌లోని ప్రధాన టోరా?మ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద ఉన్న ఓ అధికారి పేర్కొన్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. గత కొన్ని రోజులుగా రెండు దేశాల సరిహద్దుల్లో తీవ్ర ఘర్షణలు, దాడులు జరిగి పలువురు సైనికులు, పౌరులు, ఉగ్రవాదులు మరణించారు. ఈ నేపథ్యంలో గత వారం ఖతార్‌లోని దోహాలో పాక్, అఫ్గాన్ రక్షణ మంత్రులు ఖ్వాజా ఆసిఫ్, ముల్లా యాకుబ్‌ల మధ్య చర్చలు జరిగాయి. ఇందులోభాగంగా ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయి. అయితే సరిహద్దు వాణిజ్యం మాత్రం ఇంకా తెరుచుకోలేదు. ఇరుదేశాల మధ్య తదుపరి రౌండ్ చర్చలు అక్టోబర్ 25న ఇస్తాంబుల్‌లో జరగనున్నాయి.

చురకలు

## సంపాదకీయం

# ప్రవర్తనలో మనం ఎక్కడున్నాం..

# బిహార్ కంటే ఇంత దారుణమా..?

ఇండియా టుడే భారత్ లోని అన్ని రాష్ట్రాల సివిక్ బిహేవియర్ (పౌరుల ప్రవర్తన)పై ఒక సర్వే నిర్వహించింది. ఈ మీడియా దిగ్గడం రాష్ట్రాల్లోని పౌరులతో మాట్లాడుతూ ఈ సర్వే చేసినట్లు చెప్పింది. దీనికి సంబంధించి వివరాలను మ్యాప్ ద్వారా 'X'లో పోస్ట్ చేసింది. ఇటీవల విడుదల చేసిన ఇండియా సివిక్ సర్వే–2025 దేశ ప్రజల సాంఘిక ప్రవర్తనను ఒక అద్దంలా చూపించింది. ఈ సర్వేలో భారత్ లోని రాష్ట్రాలను 'సివిక్ బిహేవియర్' అంటే చెత్త వేయడం, టికెట్ లేకుండా ప్రయాణించడం, ఇతరులకు సహాయం చేయడం వంటి సామాజిక ప్రవర్తనల ఆధారంగా ర్యాంక్ చేసినట్లు సంస్థ పేర్కొంది. ఆశ్చర్యకరంగా, విద్య, సాంకేతికత, ఆర్థిక అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకంటే వెనుకబడిన రాష్ట్రాలు ఈ సర్వేలో మెరుగైన స్థానాలు సాధించాయి. అంటే, అభివృద్ధి పెరిగినా మనసు తగ్గిందా అన్న ప్రశ్నకు ఇది ఒక ప్రతిబింబం.

**బిహార్ లో ఆశ్చరకరమైన ఫలితాలు..** బిహార్ అంటే సాధారణంగా మనకు గుర్తుకు వచ్చేది. అల్లర్లు, రౌడీ గ్యాంగులు కానీ సివిక్ బిహేవియర్ లో రాష్ట్రం కర్ణాటక, తెలంగాణ కంటే ముందు నిలవడం ఆశ్చర్యం కలిగించే అంశం. ఈ సర్వేలో బిహార్ 10వ స్థానంలో నిలవగా.. కర్ణాటక 18, తెలంగాణ 19వ స్థానాల్లో ఉన్నాయి. ఇది ఆశ్చర్యం కలిగించే విషయమే. ఎందుకంటే బిహార్ అంటే మనకు గుర్తొచ్చేది రాజకీయ గందరగోళం, అభివృద్ధిలో వెనుకబాటు, సామాజిక అసమానతలు. కానీ అదే బిహార్ సివిక్ విలువల్లో ముందుంటే.. ఆధునిక ఐటీ హబ్‌లుగా నిలిచిన హైదరాబాద్, బెంగళూరులు వెనుకపడడం ఆలోచించాల్సిన విషయం. ఇది ఒక విషయం స్పష్టంగా చెబుతోంది. సౌకర్యాలు ఉంటే సంస్కారం ఉండదని, టెక్నాలజీలో ముందున్నా.. బిహేవియర్ లో మాత్రం వెనుక ఉన్నాయి. బిహార్ ప్రజలు ఇంకా సామాజిక బంధాలను, పరస్పర సహకారాన్ని ఎక్కువగా విలువైనవిగా చూస్తారు. మరోవైపు, నగర జీవనపు ఆత్మకేంద్రీకరణ మనిషిని ఒంటరిగా మార్చింది.

**దక్షిణ భారతంలో పాఠం..** సర్వేలో మొదటి స్థానంలో పుదుచ్చేరి, రెండో స్థానంలో ఒడిశా, మూడు పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు 5వ స్థానంలో ఉండగా.. కానీ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చివరి స్థానాల్లో ఉండడం గమనార్హం. ఇవే రాష్ట్రాలు విద్య, ఐటీ, ఉద్యోగాల్లో అగ్రగాములుగా ఉన్నాయి. కానీ సివిక్ బిహేవియర్‌లో అంటే ఇతరుల పట్ల గౌరవం, పబ్లిక్ ప్రదేశాల పట్ల బాధ్యత, సమాజం పట్ల శ్రద్ధలో వెనుకబడటం ఆలోచనీయమైంది. హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లో రోజు రోజుకు వ్యక్తిగత స్వార్థం పెరుగుతోంది. రోడ్లపై చెత్త వేయడం, ట్రాఫిక్ నియమాలు పట్టించుకోకపోవడం, పబ్లిక్ ప్రాపర్టీని ధ్వంసం చేయడం.. ఇవన్నీ 'సివిక్ ప్రవర్తన' లోపాలే. ఈ సర్వే కేవలం గణాంకం కాదు.. ఇది నగర మనస్తత్వానికి అద్దం పడుతోంది.

**బిహార్ ఎందుకు మెరుగ్గా..** బిహార్‌లో ఇంకా పట్టణీకరణ పూర్తిగా విస్తరించలేదు. అక్కడ సమాజం పాత విలువలను, కుటుంబ బంధాలను గౌరవిస్తోంది. చిన్న పట్టణాల్లో పరస్పర సహాయం, పొరుగువారిపై శ్రద్ధ కనిపిస్తుంది. ఆర్థికంగా వెనుకబడి ఉన్నా.. మనుషుల మధ్య సంబంధాలు మిగిలి ఉన్నాయి. ఇది బిహార్ ర్యాంక్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు.

**హైదరాబాదు, బెంగళూరు వెనుక ఎందుకు..?** ఒకప్పుడు 'అతిథి దేవోభవ' అని చెప్పుకునే మన సమాజం ఇప్పుడు 'మై టైమ్, మై స్పేస్'గా మారిపోయింది. మెట్రోపాలిటన్ జీవితం మనిషిని మరింత వ్యక్తిగతంగా, మరింత అనాసక్తంగా మార్చింది. ఫ్లాట్లలో వంద మంది ఉండి, ఒకరి పేరు మరొకరికి తెలియని పరిస్థితి ఏర్పడింది. సివిక్ విలువలు అంటే కేవలం చెత్త వేయకపోవడం కాదు.. అది మన చుట్టూ ఉన్న మనుషుల పట్ల కర్తవ్య భావం.

**సామాజిక మార్పుకు సమయం...** ఈ ర్యాంకింగ్స్ ఒక పాఠం చెబుతోంది. అభివృద్ధి భవనాల్లో కాదు.. ప్రవర్తనలో కొలవాలి. బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలు మనకు చెప్పే సందేశం ఇదే. వీరి వద్ద మాల్స్ ఉండకపోయినా.. మనసు ఉంది. నగరాల్లో టవర్స్ ఉన్నా.. సంబంధాలు లేవు. భారతదేశం 5G, AI, స్మార్ట్ సిటీస్ వైపు పరుగులు తీస్తోంది. కానీ మనం పక్కన ఉన్న మనిషికి సాయం చేయడం మర్చిపోతే.. ఆ అభివృద్ధి పాతాళానికి వెళ్లినట్లే.. సివిక్ బిహేవియర్ మ్యాప్ మనకు ఒక హెచ్చరిక 'మీరు ప్రపంచాన్ని గెలుచుకోగలరు, కానీ ఒక చిరునవ్వు పంచుకోవడంలో విఫలమవుతున్నారు' అన్నట్లు కనిపిస్తోంది. ఇక మనం 'స్మార్ట్ సిటీ'ల నుంచి 'సెన్సిబుల్ సిటీ'ల వైపునకు అడుగు వేయాలి. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు కాదు.. అది మన ప్రవర్తన, మనసు, మన సమాజ పట్ల శ్రద్ధ. బీహార్ మనకు నేర్పింది ఇదే: సంస్కారం ఉంటేనే సమాజం నిలుస్తుంది, లేకుంటే సాంకేతికత కేవలం యంత్రం మాత్రమే.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ సంక్షోభం...సమయ పాలనలో ప్రభుత్వ వైఫల్యం

- ఆందోళనలో విద్యార్థులు, ఆలస్యమవుతున్న ప్రభుత్వ చర్యలు - విద్యార్థుల కోసం పథకమా, రాజకీయాల కోసం వాగ్దానమా? - విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై నీలి నీడలు




విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెలుగు రాష్ట్రాల్లో విద్యా రంగంలో ఒక పెద్ద సంస్కరణగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో 2008లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి దీన్ని ప్రవేశపెట్టారు. ప్రారంభంలో రెండు వేల కోట్ల రూపాయల వ్యయం ఉండగా, కాలక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడం, కోర్సుల విస్తరణ జరగడం వల్ల ఇది ఏటా ఎనిమిది నుండి పది వేల కోట్ల వరకు చేరింది. ఈ పథకం ద్వారా ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చదివే సుమారు ఇరవై లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఇంజనీరింగ్ కళాశాలల్లోనే ఏడు నుండి ఎనిమిది లక్షల మంది విద్యార్థులు పూర్తిగా ఈ పథకం ఆధారంగానే చదువులు కొనసాగించారు. మొదట్లో ఇది సామాజిక సమానత్వానికి దారి తీసే గొప్ప ఆలోచనగా నిలిచింది కానీ చెల్లింపులు ఆలస్యమవడం, బడ్జెట్ కేటాయింపులు తగినంతగా లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వం నుంచి సమయానికి నిధులు రాక విద్యాసంస్థలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యమయ్యాయి, లైబ్రరీలు, లాబ్‌లు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ దెబ్బతింది. నాణ్యత తగ్గిపోవడంతో పాటు అనేక కళాశాలలు మూతపడ్డాయి. గత దశాబ్దంలో రెండు వందలకు పైగా ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలు తలదాచుకోలేక మూసివేయ బడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విడివిడిగా అమలు చేసినప్పటికీ రెండు రాష్ట్రాల్లోనూ బకాయిలు వేల కోట్లలో పేరుకు పోయాయి. ఈ నేపథ్యంతో విద్యార్థుల ఆందోళనలు తెలంగాణలో మరింత ఉధృతమయ్యాయి. బకాయిలు సకాలంలో చెల్లించాలని, కాలేజీల ఆర్థిక సంక్షోభం పేరుతో విద్యార్థులు నష్ట పోకూడదని విద్యార్థి సంఘాలు నిరసనలు వ్యక్తం చేశాయి. కళాశాల యాజమాన్యాలకు కాకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు జమచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. విద్యాసంస్థలకు కాకుండా నేరుగా విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లోనే నిధులు జమ చేసే విధానం పరిశీలనలో ఉంది. దీని వల్ల డబ్బుల దుర్వినియోగం తగ్గి విద్యార్థులకే ప్రయోజనం నేరుగా అందుతుంది. అయితే ఇలాంటి విధానం అమలు చేయాలంటే విద్యార్థులు నిజంగా కళాశాలల్లో చేరారన్నది, వారు తరగతులు హాజరవుతున్నారన్నది, కోర్సులు కొనసాగిస్తున్నారన్నది కచ్చితంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఈ సదుపాయం కూడా లోపాల పాలయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 900 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని యాజమాన్యాలు చెబుతుండగా, విద్యార్థులు విద్య కొనసాగించడానికి తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడు తున్నాయి. ఫలితంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు చెల్లింపులు ఆలస్యమవడం వల్ల ఉపాధ్యాయులు జీతాలు సమయానికి పొందలేక నిరాశలో ఉన్నారు. నవంబర్ 1 లోగా 900 కోట్లు ప్రభుత్వం ప్రకటించిన విధంగా చెల్లించక పోతే, 3వ తేదీ నుండి కళాశాలలు మూసి వేస్తామని, మార్చి ఏప్రిల్ నెలలలో న8ర్వాహించే పరీక్షలకు సహకరించేది లేదని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టడం అనివార్యం. ఈ పరిస్థితిలో పరిష్కార మార్గాలు అత్యవసరంగా అవసరం. ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తగిన బడ్జెట్ కేటాయింపులు చేసి త్రైమాసికాల వారీగా నిధులు విడుదల చేయాలి. అర్హులైన విద్యార్థుల వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా ధృవీకరించి చెల్లింపులు జరగాలి. ప్రైవేట్ కళాశాలలు పూర్తిగా ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వీయ నిధులతో కొంత శాతం నిర్వహణ చేపట్టాలి. అదేవిధంగా విద్యార్థుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసే విధానం అమలులోకి వస్తే వారు నేరుగా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థుల భవిష్యత్తుకు ఒక శక్తివంతమైన సాధనం. కానీ సమయపాలన, పారదర్శకత, బాధ్యత లేకుంటే ఇది విద్యార్థులకే కాకుండా విద్యాసంస్థలకు, ఉపాధ్యాయులకు, సమాజానికి నష్టాన్ని కలిగిస్తుంది. అందువల్ల దీన్ని రాజకీయ వాగ్దానాల పథకంగా కాకుండా విద్యారంగ అభివృద్ధి పునాదిగా పరిగణించి అమలు చేయాలి. అప్పుడే ప్రతి విద్యార్థి తన చదువును ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగించ గలుగుతాడు, ప్రతి విద్యాసంస్థ నిలదొక్కుకుంటుంది, సమాజం ముందుకు దూసుకుపోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# హిందూ మతాన్ని స్వీకరించిన తొలి విదేశీ మహిళ సిస్టర్ నివేదిత - అక్టోబర్ 28... సిస్టర్ నివేదిత జయంతి



వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత చరిత్రను సృష్టించింది. మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యావంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ఐర్లాండ్‌లోని కౌంటీ టైరాన్‌లో 1867 అక్టోబర్ 28న ఆమె జన్మించింది. తండ్రి శామ్యూల్ రిచ్‌మండ్ నోబుల్, తల్లి ఇసాబెల్. స్కాట్లాండ్‌కు చెందిన వాళ్లు ఐర్లాండ్‌లో స్థిరపడ్డారు. మత బోధకుడైన శామ్యూల్ కూతురికి తరచు మానవసేవ గురించి చెప్పేవారు. అయితే, ఆమెకు పదేళ్ల వయసులోనే శామ్యూల్ మరణించాడు. తల్లి ఇసాబెల్ పుట్టింటికి చేరడంతో, మార్గరెట్ అక్కడే పెరిగింది. లండన్‌లోని చర్చి బోర్డింగ్ స్కూల్‌లో, హాలిఫాక్స్ కాలేజీలో ఆమె చదువు సాగింది. ఒకవైపు చదువు కొనసాగిస్తుండ గానే, పదిహేడేళ్ల వయసులోనే చిన్నపిల్లలకు టీచర్‌గా పాఠాలు బోధించేది. తర్వాతి కాలంలో వింబుల్డన్‌లో స్వయంగా ఒక పాఠశాలను నెలకొల్పింది. కాలేజీ చదువు పూర్తయ్యాక వేల్స్‌కు చెందిన ఒక యువకుడితో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆకస్మికంగా మరణించాడు. మార్గరెట్‌కు ఆ షాక్ నుండి త్వరగా తేరుకో లేకపోయింది. మనశ్శాంతి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేది. ఆమె అలాంటి పరిస్థితుల్లో ఉన్న కాలంలోనే స్వామీ వివేకానంద అమెరికా నుంచి 1895లో లండన్ చేరుకున్నది. లండన్‌లోని ఒక సంపన్నుని ఇంట ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద వేదాంత ప్రసంగం కార్యక్రమానికి ఒక స్నేహితురాలి ద్వారా మార్గరెట్‌కు ఆహ్వానం అందింది. మార్గరెట్ ఆ కార్యక్రమానికి హాజరైంది. అక్కడక్కడ సంస్కృత శ్లోకాలను ఉటంకిస్తూ సాగిన వివేకానందుని వాక్ప్రవాహానికి ఆమె మంత్ర ముగ్ధురాలైంది. ఇక అప్పటి నుంచి లండన్‌లో వివేకానందుని కార్యక్రమాలన్నింటికీ క్రమం తప్పకుండా హాజరయ్యేది. సేవా దృక్పథమే ఆమెను లండన్ నుంచి కలకత్తాకు రప్పించింది. జీవితం అగమ్యంగా మారిన స్థితిలో తారసపడ్డ గురువు స్వామి వివేకా నంద బోధలకు బోధలే శాంతి మార్గమని నమ్మింది. అన్నీ వదులుకుని ఆయనతో కలసి భారత్‌కు వచ్చేసిందామె. అచిర కాలంలోనే సోదరి నివేదితగా భారతీ యులకు చిరపరిచితు రాలైంది. వివేకానందుడి పిలుపుతో ఆమె సముద్రమార్గంలో 1898 జనవరి 28న కలకత్తా చేరుకుంది. వివేకానందుడి గురువైన రామకృష్ణ పరమహంస సాధనలతో గడిపిన దక్షిణేశ్వర ఆలయాన్ని సందర్శించు కుంది. కలకత్తాలో 1898 మార్చి 11న ఏర్పాటైన బహిరంగ కార్యక్రమంలో స్వామి వివేకానంద తొలిసారిగా మార్గరెట్‌ను ప్రజా నీకానికి పరిచయం చేశారు. కొద్ది రోజులకే ఆమె రామకృష్ణ పరమహంస సతీమణి శారదా దేవిని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. జీవితాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబిస్తానని ప్రతిన బూనడంతో స్వామి వివేకానంద ఆమె పేరును 'సోదరి నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. నివేదితగా మారిన తర్వాత వివేకానందునితో కలసి ఆమె విస్తృతంగా భారత దేశమంతటా పర్యటించింది. నిధుల సేకరణ కోసం, ఆధ్యాత్మిక ప్రచారం కోసం అమెరికా కూడా వెళ్లింది. అల్మోరాలో ఉన్న సమయంలో ధ్యానం చేయడంలో శిక్షణ పొందింది. మనసు తన గరిమనాభిని మార్చుకునే ప్రక్రియగా ధ్యాన ప్రక్రియను ఆమె అభివర్ణించింది. భారతదేశం గొప్ప మహిమాన్విత దేశమని పొగుడుతూ పాశ్చాత్య దేశాల్లోని తన మిత్రులకు ఉత్తరాలు రాసేది. వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ది మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించింది. ఇతరులపై దయా గుణంతో మెలిగే ఆమె, మంచి అభిరుచిగల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా బాలికల విద్యకోసం ఆమె 1898 నవంబరులో కలకత్తా లోని బాగ్‌బజారులో పాఠశాలను ప్రారంభించింది. కనీస విద్యలేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేసింది. ప్రాథమిక విద్య అందించడానికి విశేష కృషి చేసింది. అన్నికులాల మహిళలకు చదువు తప్పనిసరిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. బెంగాల్ మహిళలతో, మేధావులతో పరిచయాలను ఏర్పాటు చేసుకుని బాలికల విద్యకోసం ఎంతో శ్రమించింది. విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, జగదీశ్ చంద్ర బోస్ తదితర ప్రముఖులతో స్నేహసంబంధాలను కొనసాగించింది. 1899 సంవత్సరం మార్చిలో కలకత్తావాసులకు ప్లేగ్ వ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించింది. భారత మహిళల ఔన్నత్యం గురించి, ఆచార వ్యవహారాల గురించి న్యూయార్క్, షికాగో మొదలైన నగరాల్లో ఆమె ప్రసంగించింది. వివేకానందుని బోధలను యువతరానికి చేరవేసేందుకు అహరహం కృషి చేసింది. కలకత్తాలో ప్లేగు మహమ్మారి వ్యాపించినప్పుడు రోగుల దగ్గరే ఉండి, వారికి సేవలందించింది. భారత జాతీయ, స్వాతంత్ర్యో ద్యమాలకు ఇతోధికంగా తోడ్పాటు నందించింది. విద్యా వ్యాప్తికి, సేవా కార్యక్రమాల అమలుకు విశేషంగా కృషి చేసింది. స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధ్యాత్మికవేత్త అరబిందొ ఆధ్వర్యంలో వెలువడే 'కర్మయోగి' పత్రికకు సంపాదకు రాలిగా సేవలందించింది. మేధా సంపత్తిలో భారతదేశం అద్వితీయమైనదని ప్రపంచానికి చాటింది. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించింది. భారతీయతను పూర్తిగా ఆకలింపు చేసుకున్న ఆమె మహిళావిద్య కోసం ఎంతగానో పాటు పడింది. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. విదేశీయురాలు అయినప్పటికీ భారతీ యతను పుణికిపుచ్చుకుని స్వామి వివేకానందతో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించిన ఆమె డార్జిలింగ్‌లో ఉండగా, అనారోగ్యానికి గురైన నివేదిత 1911 అక్టోబర్ 13న తన 43వ ఏట తుదిశ్వాస విడిచింది. భారత దేశంతో, భారత ప్రజలతో మమేకమై జీవించిన ఆమె స్ఫూర్తి నేటికీ కొనసాగుతూనే ఉంది. పలు చోట్ల ఆమె స్మారకచిహ్నాలు, ఆమె పేరిట ఏర్పాటైన పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు నేటికీ ఆమె సేవానిరతికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# సూర్యకాంతం పాత్రలు... సజీవ శిల్పాలు - అక్టోబర్ 28... సూర్య కాంతం జయంతి



గయ్యాళి పాత్రలు అనగానే తెలుగు ప్రేక్షకులకు ఠక్కున గుర్తుకువచ్చే పేరు సూర్యకాంతం. ఓర చూపులు చూస్తూ, ఎడంచెయ్యి విసుర్తూ కుడిచెయ్యి నడుం మీద నిలబెట్టి ఆమె చెప్పిన సంభాషణా చాతుర్యం, అంతలోనే వెక్కిరిస్తూ, అంతలోనే కల్లబొల్లి కబుర్లతో, వెక్కి వెక్కి వెక్కి ఏడుస్తూ వెండి తెరపై విభిన్న పాత్రల కు జీవం పోసింది ఎవరూ అంటే అది పాటతరం సహజ నటి సూర్యకాంతం అని వేరే చెప్పనక్కర లేదు. సూర్యకాంతాన్ని హాస్య నటీమణిగా ముద్ర వెయ్యడానికి లేదు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యక పోయినా ఆమె సంభాషణ చెప్పే తీరు, నవ్వు తెప్పిస్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. అలా అని ఆమె దుష్టపాత్రధారిణి అని కూడా అనలేం. సహాయ నటి అనే అనాలి. తెలుగు సినిమాల్లో గయ్యాళి పాత్రల్లో తన సహజ నటనతో ఆమె ప్రాచుర్యం పొందింది. గయ్యాళి అత్తకి మారుపేరు సూర్యకాంతం అనిపించుకుంది. ఆమె ధరించిన అత్త పాత్రలు సజీవ శిల్పాలు. సహజ నట కళా శిరోమణి, హాస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణా, రంగస్థల శిరోమణి సూర్యకాంతం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ దగ్గరున్న వెంకట కృష్ణరాయ పురంలో 1924 అక్టోబర్ 28న తన తల్లితండ్రులకు 14వ సంతానంగా జన్మించింది. ఆరేళ్ళ చిన్న వయసు లోనే పాడటం, నాట్యమాడటం నేర్చుకొంది. పెరిగే వయసులో హిందీ సినిమా పోస్టర్లు బాగా ఆకర్షించాయి. సినిమాల్లో నటించాలనే కోరిక ఆపుకోలేక చెన్నై చేరుకొంది. మొదట జెమిని స్టూడియో నిర్మించిన చంద్రలేఖ సినిమాలో డాన్సర్ గా అవకాశం వచ్చింది. అప్పట్లో నెలకు 65 రూ. జీతం ఇవ్వబోతే నిర్మాతతో తన అసంతృప్తిని తెలియ బరచిన మీదట 75 రూపాయలు చేశారు. తరువాత ధర్మాంగద (1949)లో ఆమెది మూగవేషం. ధర్మాంగద టైములో చిన్నా చితకా వేషాలు వేసినా తరువాత లీలా కుమారి సాయంతో మొదటిసారిగా నారద నారది సినిమాలో సహాయ నటిగా అవకాశం వచ్చింది. చిన్న చిన్న పాత్రలు నచ్చక జెమినీ స్టూడియో నుంచి బయటకు వచ్చేసింది. మనసులో బొంబాయికి వెళదామని ఉన్నా అందుకు ఆర్థిక స్తోమత సరిపోక ఆ ఆలోచనను విరమించుకొంది. ఆ పరిస్థితిలో సహాయ నటిగా గృహప్రవేశం సినిమాలో మంచి అవకాశం వచ్చింది. తరువాత తన కల అయిన హీరోయిన్ వేషం సౌదామిని చిత్రం ద్వారా వచ్చింది. కానీ ఆ సమయంలో కారు ప్రమాదం జరిగి ముఖానికి గాయం అవడంతో ఆ అవకాశం తప్పి పోయింది. బాగైన తరువాత సంసారం చిత్రంలో మొట్టమొదటి సారిగా గయ్యాళి అత్త పాత్ర వచ్చింది. తరువాత తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా తెలుగు సినీ అభిమానుల గుండెల్లో నిలిపోయేలా జీవితాంతం అవే పాత్రలలో నటించింది. అసలు సంసారం చిత్రం తరువాత బొంబాయికి చెందిన ఒక నిర్మాత ద్వారా హీరోయిన్ గా అవకాశం వచ్చింది. కానీ తనకు అవకాశం రాక ముందే ఇంకొక హీరోయిన్ ను పెట్టుకొని తీశేసారని తెలియడంతో, "ఒకరి బాధను నా సంతోషంగా తీసుకోలేను" అని ఆ సినిమాను నిరాకరించింది. కోడరికం సినిమా ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. బి.నాగిరెడ్డి, చక్రపాణిలు ఆమె లేకుండా సినిమాలు తీసేవారు కారు. హైకోర్టు జడ్జి పెద్దిబొట్ల చలపతిరావు ను 1950లో వివాహ మాడారు. ఆ రోజుల్లోని అనేక సాంఘిక చిత్రాల్లో రేలంగి - సూర్యకాంతం, రమణారెడ్డి - సూర్యకాంతం, ఎస్.వి.రంగారావు - సూర్యకాంతం- జంటలు, వాళ్ల దృశ్యాలు గుర్తుకు తెచ్చుకుని ఇవాళ కూడా హాయిగా నవ్వుకోవడం కద్దు. కొత్త సినిమా వస్తూంటే అందులో సూర్యకాంతం వుందా? అని ప్రేక్షకులూ, తారా గణంలో సూర్యకాంతం వున్నట్టేగదా? అని సినిమా డిస్ట్రిబ్యూటర్లూ - ఎదురు చూసేవారు. చక్రపాణి (1954), దొంగరాముడు (1955), చిరంజీవులు (1956), తోడికోడళ్లు (1957), అత్తా ఒకింటి కోడలే (1958), ఇల్లరికం (1959), భార్యాభర్తలు (1961), గుండమ్మ కథ (1962), కులగోత్రాలు (1962), దాగుడు మూతలు (1964), అత్తగారు–కొత్తకోడలు, మూహూర్తబలం (1969) లాంటి మరపురాని ఎన్నో సినిమాలలో నటించింది. నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకసారి టెలివిజన్ ఇంటర్వ్యూలో..."నువ్వు తెలుగు భాషకు చేసిన అన్యాయం ఒకటుంది. 'సూర్యకాంతం' అనే చక్కని పేరు ఇంకెవరూ పెట్టుకోకుండా చేశావు" అని ఆమెతో చమత్కారంగా అన్నానని చెప్పాడు. వ్యక్తిగా సూర్యకాంతం గయ్యాళి కానేకాదు - మామూలు మనిషే. ఏ సమావేశాలకో, సినిమా ఉత్సవాలకో ఆమె వెళ్లినప్పుడు ఆటోగ్రాఫుల కోసం వెళ్లే స్త్రీలు సూర్యకాంతం దగ్గరకి వెళ్లడానికి భయపడేవారు. ఐతే ఆమె నికార్సయిన మనిషి, కచ్చితమైన మనిషి, సహృదయం గల మనిషి, సహాయపడే మనిషి. ఆమె శుభ్రంగా కడుపునిండా తినేది, పదిమందికీ పెట్టేది. షూటింగ్‌కి వచ్చినప్పుడల్లా - తనతో ఏవో తినుబండారాలు తీసుకు రావడం, అందరికీ పెట్టడం అలవాటు. ఇలాంటి అలవాటు సావిత్రి, కృష్ణకుమారి, జానకి వంటి నటీ మణులకీ వుండేది. షూటింగుల్లో జోకులు చెప్పడం, సూర్యకాంతం సరదాల్లో ఒకటి. ఓ సినిమాలో నాగయ్యను నానా మాటలూ అని, నోటి కొచ్చిన తిట్లు తిట్టాలి. షాట్ అయిపోయాక ఆయన కాళ్లమీద పడి 'అపరాధం - క్షమించండి!' అని వేడుకుంది. 'పాత్ర తిట్టిందమ్మా, నువ్వెందుకు బాధపడతావూ? లే!-' అని నాగయ్య లేవనెత్తితే, కన్నీళ్లు తుడుచుకున్న భక్తీ, సెంటిమెంటూ ఆమెవి. దబాయింపూ, కచ్చితత్వమూ ఉన్న మనిషే అయినా, మనసు మాత్రం వెన్న, సున్నితం. అవసరమైన వాళ్లకి ఆర్థిక సహాయం చేసేదిగాని అనవసరం అనిపిస్తే మాత్రం 'పూచికపుల్ల' కూడా విదిలించేది కాదు. మొహమాట పడకుండా తనకి రావాల్సిన పారితోషకాన్ని అడగవలసిన నిర్మాతల్ని గట్టిగా అడిగేది. ఆమె అందర్నీ నమ్మేది కాదు. తన కారు రిపేరుకొస్తే ఎంత పెద్ద రిపేరైనా, మెకానిక్ ఇంటికొచ్చి తన కళ్లముందు చెయ్యవలసిందే - ఎంత 'ఎక్స్‌ట్రా మనీ' అయినా తీసుకోనీ గాక. చివరి దశలో వేషాలు తగ్గిపోయినా, చివరి దాకా నటిస్తూ ఉండాలనే కోరుకునేది. తన ఆరోగ్యం బాగులేకపోయినా, 'నటిస్తాను' అని ధైర్యంగా చెప్పేది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# శాఖల్లో 'లీకు వీరులు'!

కరీంనగర్ : గత నెల 16న కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ బృందంలో పని చేస్తున్న 12 మంది పోలీసు సిబ్బందిని కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ సీపీ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు, ఇతరత్రా పర్యవేక్షణ చేపట్టాల్సిన కీలక విభాగంలోని సిబ్బంది తనిఖీలకు వెళ్తున్న సమాచారం అక్రమార్కులకు ముందుగానే ఇస్తున్నారనే అనుమానంతో ఈ చర్య తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో కీలకమైన పోలీస్, విజిలెన్స్, ఎక్సైజ్, అనిశా, మైనింగ్, ఆర్టీఏ ఉన్నతాధికారుల అత్యవసర సోదాలు, తనిఖీల సమయంలో ముందుగానే సంబంధిత వ్యక్తులు సర్దుకుంటున్నారు. ఆ విభాగంలో పని చేసే కొందరు కింది స్థాయి సిబ్బంది వ్యాపారులకు, అక్రమార్కులకు సమాచారం చేరవేస్తుండటంతో అక్రమాలపై పక్కా సమాచారంతో వెళ్లిన అధికారులు అక్కడ పరిస్థితి వేరేగా ఉండటం చూసి విస్తుపోతున్నారు. నెలవారీగా ఆమ్యామ్యాలకు అలవాటు పడిన కొంతమంది ఉద్యోగులు ఇలా సమాచారం చేరవేస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. ఇసుక, మట్టి రవాణా ఎక్కువగా నడిచే మండలాల్లో



ఈ తరహా వ్యవహారం ఎక్కువగా ఉంటోంది.

పెద్దపల్లి జిల్లాలోని రైస్ మిల్లుల్లో రాష్ట్రస్థాయి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టేందుకు వచ్చిన సమయంలోనూ ఇలాంటి చేదు అనుభవమే వారికి ఎదురైంది. పక్కా సమాచారంతో వెళ్లి పరిశీలించగా అదనంగా ఉన్న బియ్యమంతా మాయమయ్యాయి. దీంతో తామొస్తున్నామనే సమాచారం జిల్లాకు చెందిన ఎవరో అందించి ఉంటారనే కోణంలో శాఖాపరమైన విచారణ చేపట్టారు.

**సహకరిస్తున్నారిలా..!**

గ్రానైట్ క్వారీల తనిఖీల సమయంలో నిర్వాహకులకు ముందస్తుగా సమాచారం వెళ్తోంది. గంజాయి, గుట్కా విక్రేతలు నెలవారీ మామూళ్లతో తనిఖీల గురించి ముందే తెలుసుకుంటున్నారు.

గొలుసు దుకాణాల తనిఖీలకు గ్రామాలకు వెళ్లే సరికి దుకాణాల్లో మద్యం మాయమవుతోంది. ఇసుక, మట్టి వ్యాపారులు ఠాణాల్లోని కొందరిని తమకు సమాచారమిచ్చే వేగులుగా మార్చుకున్నారు.

# తటాకాలూ గుటకాయ స్వాహా!

కరీంనగర్ : కోరుట్ల తాళ్ల చెరువు భూమిలో నుంచి దర్జాగా రోడ్డు వేశారు. అయిదెకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన తటాకం క్రమేణా కుంటలా మారిపోయింది. నలు వైపులా ఆక్రమణదారులు ఇష్టానుసారంగా మట్టి పోస్తూ కబ్జా చేస్తున్నారు. మద్దుల చెరువు, కుమ్మరికుంట, లస్మగౌడ్‌కుంట, బొల్లికుంట, తిమ్మాయిపల్లె, అయిలాపూర్ గొలుసుకట్టు చెరువుల్లోకి వరద వచ్చే కాలువలు ఆక్రమణ చెరల్లోనే ఉన్నాయి.

జగిత్యాల జిల్లావ్యాప్తంగా 1,226 చెరువుల్లో దాదాపు 60 శాతం కబ్జాకు గురయ్యాయి. ఆరేళ్ల కిందట నీటి నిల్వ సామర్థ్యాన్ని(ఎఫ్‌టీఎల్) గణించే క్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు వీటిని గుర్తించారు. హద్దులు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి రాతి కడీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిధులు కేటాయించకపోవడంతో ప్రక్రియ ముందుకుసాగలేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో రెండు దశాబ్దాల కిందటి చెరువుల వాస్తవ స్థితికి, ప్రస్తుత పరిస్థితికి చాలా వ్యత్యాసముందని సంబంధిత అధికారులే చెబుతున్నారు. మిషన్ కాకతీయ కింద జిల్లాలో నాలుగు దశల్లో రూ.204.90 కోట్లతో 720 చెరువుల్లో పనులు చేపట్టారు. అప్పుడే కంచెల ఏర్పాటుకు కొన్ని నిధులు వెచ్చిస్తే ఆక్రమణకు గురి కాకుండా ఉండేది.

**వ్యర్థాలు పోసి కబ్జా**

50 అడుగుల వరకుండాల్సిన చెరువు కట్టల వెడల్పు చాలా చోట్ల 20-30 అడుగులకు కుచించుకుపోయాయి.

కొన్ని పట్టణాల్లో చెరువు కట్టలు కబ్జాలతో పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయాయి. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాల్లో ముందుగా వ్యర్థాలను పోస్తూ తరువాత మెల్లిగా ఆక్రమించేస్తున్నారు.

నీటిపారుదల, మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో హద్దులు నిర్ణయించడం లేదు.

నాలాలకు ఆనుకొని ఉన్న భూముల యజమానులు కొంచెం కొంచెం తమ పరిధిలో కలుపుకొని అనుభవిస్తున్నారు. జగిత్యాల పట్టణానికి ఆనుకొని ఉన్న పలు చెరువులపై కబ్జాదారుల కన్ను పడింది. కొద్ది



నెలల కిందట లింగం చెరువు నుంచి చింతకుంట చెరువుకు వచ్చే కాలువ ఆక్రమణపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా మోతె చెరువు, కండ్లపల్లి చెరువు, ముప్పాల చెరువు, చింతకుంట చెరువుల కబ్జాతో రూపు కోల్పోతున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, సమీపంలో పొలాల యజమానులు దర్జాగా కబ్జా చేస్తున్నారు.

**స్వాధీనం చేసుకునేందుకు చర్యలు**

ఆక్రమిత చెరువు స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో పెట్టిన హద్దులను తొలగిస్తున్నారు. జియో మ్యాపింగ్ ఆధారంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తిస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నాం. ఎ. హెచ్. ఖాన్, నీటిపారుదల శాఖ ఈఈ, జగిత్యాల

# చెల్లింపులకు ఇక చిక్కులుండవ్..



బషీరాబాద్: మండలాలు: 20
మండల సమాఖ్యలు: 19
గ్రామ సమాఖ్యలు: 657
మహిళా సంఘాలు: 15,697
నమోదైన సభ్యులు: 1.63 లక్షలు

స్త్రీనిధి రుణాల వాయిదాలను ఇకపై తపాలాశాఖలో చెల్లించుకునే అవకాశం కల్పించారు. బ్యాంకుల్లో రద్దీ ఎక్కువగా ఉండడం.. దూరం వెళ్లి చెల్లించే సమస్యలను అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల్లో బీపీఎంల వద్ద రుణ వాయిదాలు కట్టి రశీదులు పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేశారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో అన్ని ప్రాంతాల్లోనూ అమలు పర్చనున్నారు.

**రూ.22 కోట్ల రుణాలు..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాలు రూ.22 కోట్లు ఇచ్చారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు రూ.50వేల నుంచి రూ.10 లక్షల వరకు తక్కువ వడ్డీకి పొందుతున్నారు. ఏటా జిల్లావ్యాప్తంగా మహిళలు రూ.100 కోట్లకుపైగా వివిధ రకాల రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారు. చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, గ్రామస్థాయిలో పిండి గిర్నీలు, అల్పాహార కేంద్రాలు, వస్త్ర దుకాణాలు, కుట్టు మిషన్లు వంటి వాటి కొనుగోలుకు స్త్రీనిధి రుణాలను వాడుకొంటున్నారు.

**తపాలాశాఖ ద్వారా ఇలా..**

జిల్లాలో 594 గ్రామ పంచాయతీలున్నాయి. తాండూరు డివిజన్ పరిధిలో 90, వికారాబాద్‌లో 91, కొడంగల్ ప్రాంతంలో సుమారు 40.. మొత్తంగా 221 బ్రాంచి పోస్టు మాస్టర్ కార్యాలయాలున్నాయి. ఉమ్మడి పంచాయతీల్లో ఒకటి చొప్పున ఉన్నాయి. సమీప గ్రామాల వారు బ్రాంచ్ పోస్టు మాస్టర్ కార్యాలయానికి వచ్చి స్త్రీనిధి రుణాల వాయిదాలు చెల్లించుకోవచ్చు. తీసుకున్న రుణం వివరాలు, తీర్మానపత్రం సమర్పిస్తే బీపీఎం రుణ వాయిదాను స్వీకరించి రశీదు ఇవ్వనున్నారు. ఇప్పటికే తపాలా, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బందికి చెల్లింపులపై అవగాహన కల్పించారు.

**రవాణా భారం తీరుతుంది..– లక్ష్మీనారాయణ, స్త్రీనిధి, మేనేజర్**

తీసుకున్న రుణం వాయిదా చెల్లించేందుకు పట్టణంలో ఉన్న బ్యాంకులకు వెళ్లాల్సి వస్తోంది. రవాణా ఇబ్బందులు, సమయం వృథా అవుతాయి. ఇక నుంచి గ్రామాల్లోనే ఉన్న తపాలాశాఖ బ్రాంచ్ పోస్టు మాస్టర్ కార్యాలయంలో స్త్రీనిధి రుణ వాయిదాలు చెల్లించొచ్చు. సంఘాల వివరాలను ఎప్పటికప్పుడు తపాలాశాఖ పోర్టర్‌లో నిక్షిప్తం చేస్తున్నాం.

# నిధులు లేక.. పనులు సాగక



హుజూరాబాద్: హుజూరాబాద్, జమ్మికుంట పురపాలికల్లో నిధుల లేమితో పలు అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సమీకృత మార్కెట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులతోపాటు పట్టణ ప్రగతి పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గతంలో పట్టణ ప్రగతి పేరిట వచ్చే ప్రత్యేక నిధులు రెండేళ్లుగా నిలిచిపోయాయి.

**హుజూరాబాద్‌లో..**

హుజూరాబాద్ పురపాలికలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో 2022లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండంతస్తుల వరకు నిర్మించి స్లాబ్ వేశారు. రూ.4 కోట్లు ఖర్చవగా 60 శాతం మేర పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులకు నిధులు సరిపోకపోవడంతో అదనంగా మరో రూ.4.75 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం అనుమతిచ్చినా నిధులు మాత్రం విడుదల కాలేదు.

రూ.2.18 కోట్ల వ్యయంతో డంపింగ్ యార్డు నిర్మాణ పనులు చేపట్టగా ఇప్పటివరకు రూ.1.60 కోట్లు ఖర్చు పనులు మాత్రమే పూర్తయ్యాయి. ధోబీఘాట్ల నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా ఆమోదం లభించింది. కానీ నిధులు విడుదల కాలేదు.

మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం నిర్మాణానికి రూ.2 కోట్లతో పనులు ప్రారంభమవగా ప్రహరీ మాత్రమే నిర్మించారు.

హుజూరాబాద్‌లోని క్రైస్తవుల కోసం రూ.25 లక్షలతో శ్మశానవాటిక నిర్మించాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.10 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి టెండర్ పూర్తయినా నిధులు విడుదల కాలేదు.

ఈ పనులన్నిటికీ నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదించామని, విడుదలవగానే పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

**జమ్మికుంటలో..**

జమ్మికుంటలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో 2021లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించి స్లాబ్ వరకు పనులు చేసి, మిగతావి ఆపేశారు.

పురపాలికలో పట్టణ ప్రగతి కింద ఒకటో వార్డులో డంపింగ్ యార్డు అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు, జమ్మికుంట పురపాలిక కార్యాలయం ఆవరణలో సుందరీకరణ పనులకు రూ.35 లక్షలు, మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో వైకుంఠధామం అభివృద్ధికి రూ.20 లక్షలు, డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.10 లక్షలు, రామన్నపల్లిలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు రూ.30 లక్షలు ప్రతిపాదించగా ఆమోదం లభించింది. కానీ నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి.

# ఒక్కరోజే పండగ.. తరవాత దండగ!

తాండూరు : పూల రైతు పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. పండగపూట జోరుగా సాగిన విక్రయాలు, ఆ తరవాత పూర్తిగా మందగించాయి. గిట్టుబాటు కాకున్నా అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. లాభాలు అటుంచి కనీసం పెట్టుబడులు వస్తే చాలంటున్నారు.

**దీపావళికి వినియోగం ఎక్కువ..**

దీపావళి పండగకు పూల వినియోగం ఎక్కువ. అందులోనూ బంతిపూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇళ్లు, దుకాణాలను పండగకు ముందే శుభ్రం చేయించి పూలతో అలంకరిస్తారు. వీలునుబట్టి కార్తిక పౌర్ణమి వరకు 15 రోజులపాటు పూజలు నిర్వహిస్తారు. గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా లక్ష్మీదేవి పూజలు చేస్తారు. దీపావళి పండుగ నాడు సోమవారం తాండూరులో బంతిపూలు కిలో రూ.100కు విక్రయించారు. మరుసటి రోజు నుంచి ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి. కిలో రూ.30కి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆటో ఛార్జీలైనా వస్తాయో.. రావోనని వాపోతున్నారు.

**సాగు పెరగడంతో..:** వర్షాలకు పెసర, మినుము పంటలు దెబ్బతినడంతో చాలా మంది అన్నదాతలు పూల సాగుకు మొగ్గు చూపారు. తాండూరు మండలం బెల్కటూరు, కరణ్‌కోట, పెద్దేముల్, మంబాపూర్, ధారూరు, కెరెల్లి, పరిగి, పూడూరు, కుల్కచర్ల, బంట్వారం, కోట్‌పల్లి, మర్పల్లి, మోమిన్‌పేటలో వందల ఎకరాల్లో పూల సాగు చేశారు. ఇటీవల దిగుబడులు చేతికొచ్చాయి. తాండూరులో ఆయా మండలాల రైతులతోపాటు పొరుగునున్న చేవెళ్ల నుంచి పూలు విక్రయించేందుకు వచ్చారు. దీంతో



పోటీ ఎక్కువై ధరలపై ప్రభావం పడింది. రెండ్రోజుల వ్యవధిలో ఏకంగా రెండింతల ధర తగ్గడంతో రైతులు కుదేలయ్యారు. కొందరు రైతులు విక్రయ ప్రదేశంలోనే వదిలేసి వెళ్లిపోయారు.

**ఎకరాకు రూ.30వేల ఖర్చు..–** విజయేందర్, ఆలూరు, చేవెళ్ల మండలం

ఎకరా పొలంలో బంతిపూలు సాగు చేశా. రెణ్నెల్లలో రూ.30వేలు పెట్టుబడి పెట్టాను. తాండూరులో మూడ్రోజులుగా పూలు విక్రయిస్తున్నా. మొదటిరోజు కిలో రూ.వందకు అమ్మేశా. తరవాత గిరాకీ లేదు. ఆటో ఛార్జీలకూ గిట్టుబాటు కావడం లేదు.

**రూ.3వేలు వచ్చింది..–** పద్మమ్మ, మిట్టబాస్పల్లి, తాండూరు మండలం

రూ.5కు ఒక మొలక తెచ్చి సాగు చేశా. ఎకరాకు రూ.20వేలు ఖర్చయ్యాయి. ఇప్పటివరకు రూ.3వేల ఆదాయం వచ్చింది. రూ.30కిలో అమ్మాల్సి రావడంతో గిట్టుబాటు కావడం లేదు. కిలో రూ.100కు విక్రయిస్తే మేలు. కొనుగోలుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

# హద్దులేని ఆక్రమణ'దారులు'

సిరిసిల్ల: జిల్లా కేంద్రం సిరిసిల్ల పురపాలిక చుట్టూ విస్తరిస్తోంది. పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయి. దీనికితోడు ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. పురపాలికగా మారక ముందు వేసిన లేఅవుట్లలో ఏర్పాటు చేసిన రహదారులను, నీటి వనరుల కింద ఆయకట్టుకు నీరందించే కాల్వలు చాలాచోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి. రెవెన్యూ దస్త్రాల్లోని స్థలాలపై పర్యవేక్షణ లేకపోవడం.. కనీసం ఇప్పటి అధికారులు వాటిపై అవగాహన లేక ఇంటి నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. ఈ ఆక్రమణలతో చిన్నపాటి వర్షాలకే రహదారులపై వరదనీరు ముంచెత్తుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

సిరిసిల్ల పురపాలికగా మారక ముందే పట్టణ శివారు విద్యానగర్‌లో 6.21 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. దీనిలో ప్రత్యేకంగా దారులు కూడా వదిలారు. అయితే ఈ లేఅవుట్ను ఆనుకొని సిరిసిల్ల నుంచి తాడురుకు మానేరువాగు నుంచి వెళ్లే పాత దారి ఉంది. ప్రస్తుతం ఈ దారిని పూర్తిగా మార్చేశారు. దీని పక్కనుంచే బైపాస్ రహదారి రావడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గుంట రూ.30 లక్షలపైనే పలుకుతుంది.



శాంతినగర్ ప్రధాన రహదారిలో 50 ఫీట్లు ఉన్న రహదారి ఆక్రమణలతో 30 ఫీట్లకు కుంచించుకుపోయింది. శ్రీనగర్ కాలనీలోనూ అదే పరిస్థితి. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన స్థలం పక్కన స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేయడంతో దేవాదాయశాఖ అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేయడంతో ఆక్రమణలు నిలిచిపోయాయి. కొత్త చెరువు నుంచి దిగువన దామెరకుంట, తుమ్మలకుంటలకు నీరు వెళ్లేందుకు కాల్వలు ఉన్నాయి. పట్టణం విస్తరణతో కొత్తచెరువు కింద ఆయకట్టు లేకుండా పోయింది. దీంతో వరదనీరు వచ్చే కాల్వలు ఆక్రమణలకు గురికాగా కొత్త చెరువు మత్తడి పారినప్పుడు శాంతినగర్‌ను వరదనీరు ముంచెత్తుతోంది. పురపాలకశాఖ ఈ కాల్వలను పునరుద్ధరించాల్సింది పోయి.. పక్కనే ఉన్న శ్రీనగర్ కాలనీ మీదుగా కొత్త కాల్వలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని భూసేకరణకు నిధులు మంజూరైనా సమీపంలో భూ యజమానులు ఒప్పుకోవడంలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి.

పట్టణ వ్యాప్తంగా పురపాలకశాఖకు చెందిన 152 లేఅవుట్ స్థలాలు ఉండాలి. వాటిలో చాలావరకు ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్నింటి హద్దులు ఏర్పాటు చేశారు. ఇంకా చాలాచోట్ల ఉన్న ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయనేది రెవెన్యూ, పురపాలకశాఖ అధికారులే గుర్తించలేని పరిస్థితి.

**రక్షణ చర్యలు ఏవీ?**

పురపాలికలకు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ స్థలాలు చాలాచోట్ల బోర్డులు కనిపించకుండా పోతున్నాయి. కొన్ని చోట్ల ఆక్రమణదారులు చొచ్చుకొస్తున్నారు. కోట్ల రూపాయల విలువచేసే ఖాళీ స్థలాల రక్షణకు కనీసం కంచె వేసే పరిస్థితి లేదు. వీటికోసం పురపాలికలో ప్రత్యేకంగా బడ్జెట్ను ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా వివిధ పథకాలతో వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేసి పంపిస్తున్నా.. నిధులు విడుదల కాక అవి కాగితాలకే పరిమితమయ్యాయి. రక్షణలేని స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి.

# సేకరించి.. మిల్లర్ల చేతికందించి!

సుల్తానాబాద్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పక్కదారి పడుతోంది. స్థానికంగా కొంత మంది దళారులు ఇంటింటా తిరుగుతూ సన్నబియ్యాన్ని సేకరించి సొమ్ము చేసుకుంటున్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైన కొద్ది రోజుల వ్యవధిలోనే సుల్తానాబాద్‌లో ఈ అక్రమ రవాణా బహిరంగంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

**మిల్లులు అధికంగా ఉండగా..**

సుల్తానాబాద్ ప్రాంతంలో బియ్యం మిల్లులు అధికంగా ఉన్నాయనే ఉద్దేశంతో స్థానికంగా ఉండే కొంత మంది దళారులు సన్నబియ్యం అక్రమ రవాణాకు తెర లేపారు. ఇందుకోసం ప్రత్యేకమైన ఆటోలను ఏర్పాటు చేసుకున్నారు. వాటికి మైక్‌సెట్లు బిగించి ప్రతీ రోజు ఉదయం ఇంటింటా తిరుగుతూ సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రజల నుంచి రూ.20 చొప్పున కొనుగోలు చేసి ఓ ప్రాంతంలో కొన్ని రోజులపాటు నిల్వ చేస్తున్నారు. ఇలా పెద్ద మొత్తంలో స్థానికంగా ఉండే బియ్యం మిల్లర్లకు కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం కొనుగోలు చేసిన దళారులే సన్నబియ్యం అక్రమ సేకరణ చేస్తున్నారని కొంత మంది చెబుతున్నారు.



**మిల్లర్లు వాటిని ఏం చేస్తున్నారంటే..**

గతంలో ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బకాయిపడ్డ మిల్లర్లు సన్నబియ్యాన్ని సేకరించి తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం కొంత మంది మిల్లర్లు బృందంగా ఏర్పడి ఇంటింటా సేకరించిన సన్నబియాన్ని బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సేకరణ గత వర్షాకాలంలో పెద్ద మొత్తంలో జరిగినట్లు సమాచారం.

**కేసులు తప్పవు**

ప్రభుత్వం చౌకధరల దుకాణాల నుంచి ప్రజలకు పంపిణీ చేసిన సన్నబియ్యాన్ని అమ్మినా.. ఎవరైనా కొనుగోలు చేసినా కేసులు తప్పవు. ప్రజలు సన్న బియ్యాన్ని అమ్మితే రేషన్‌కార్డులను రద్దు చేస్తాం. అలాగే దళారులు ఇంటింటా సన్నబియ్యాన్ని సేకరించడం నేరం. సన్నబియ్యం అక్రమ సేకరణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.
శ్రీనాథ్, డీసీఎస్‌వో, పెద్దపల్లి

# అరుస్తా.. అడ్డొస్తే కరుస్తా

సిరిసిల్ల : జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ మనుషులు కనపడితే చాలు దాడికి పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. వీధి కుక్కల బెడద నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వీటి సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది.

**ఒకేరోజు 50 మందికిపైగా బాధితులు**

సిరిసిల్ల పట్టణంలో గత నెల 18 ఓ వీధి కుక్క రోడ్లపై కనిపించిన వారందరిపై దాడి చేయడంతో 50 మందికిపైగా బాధితులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి వరుస కట్టారు. ఒకేరోజు ఇంతమందిపై దాడి జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై సిరిసిల్ల పురపాలిక కమిషనర్ ఖాదిర్ పాషాతో మాట్లాడగా పట్టణంలో కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి వాటి సంతతి నియంత్రణపై దృష్టి పెడతామని, ఏబీసీ కేంద్రం అందుబాటులోకి



తీసుకొస్తామని చెప్పారు.

**నిరుపయోగంగా ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్**

సిరిసిల్ల పట్టణ శివారులో వీధి కుక్కల నియంత్రణ కోసం రూ.20 లక్షలు వెచ్చించి ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలతో వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించి వాటి సంతతి పెరగకుండా శస్త్రచికిత్స చేసి మూడు రోజులు అక్కడే ఉంచుకొని తిరిగి తీసుకొచ్చిన చోట వదిలిపెట్టేవారు. సిబ్బంది లేకపోవడం, పట్టించుకునేవారు లేకపోవడంతో ఆ కేంద్రం నిరుపయోగంగా మారింది. మరోవైపు శునకాల సంతతి పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

# కలల కొలువు వరించె!

జగిత్యాల : వారంతా పేద, మధ్యతరగతికి చెందినవారు. వారి ఉద్యోగ కలలు జగిత్యాలలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా సాకారమయ్యాయి. శిక్షణ పొందినవారిలో 62 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికయ్యారు.

**ఈ శాఖలలో..**

ఇక్కడ శిక్షణ పొందినవారిలో ఇప్పటివరకు 62 మంది కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలు సాధించారు. విద్యాశాఖలో 27, పోలీసు 15.. న్యాయ, స్టాఫ్ సెలక్షన్ కమిటీలో 4 చొప్పున, పురపాలక 3, బీమా రంగంలో 2, రెవెన్యూ, అటవీ, నీటి పారుదల, జెన్‌కో, ఆరోగ్య, రైల్వే, పంచాయతీరాజ్‌శాఖలో ఒక్కొక్కరు కొలువు తెచ్చుకున్నారు.

**ఐదు నెలలపాటు ఉచితంగా..**

2022లో జగిత్యాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రారంభమైంది. ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 15, ఎస్టీలకు 10 శాతం సీట్లు కేటాయించారు. ప్రవేశపరీక్ష ద్వారా తొలి ఏడాది 90 మందికి ప్రవేశం కల్పించారు. అనంతరం మరో మూడు బ్యాచుల్లో వందమంది చొప్పున ఎంపికచేసి.. 5 నెలలపాటు ఉచిత భోజన, వసతితోపాటు విశేష అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తోపాటు నోటు పుస్తకాలు సహా యువతులకు రూ.150, యువకులకు రూ.100 చొప్పున కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించారు. వారాంతపు పరీక్షలు సహా సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు సిద్ధమయ్యేందుకు లైబ్రరీ వసతి కల్పించారు.

**అనుభవజ్ఞులైన వారితో..**

మాది జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట. నేను వరంగల్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి జగిత్యాల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందా. అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, వారాంతపు పరీక్షలు, గ్రంథాలయం, కంప్యూటర్ లైబ్రరీ ఉపయోగపడ్డాయి. ఈ కేంద్రంలో మరింత మందికి శిక్షణ ఇస్తే బాగుంటుంది.
రమ్య, ఏఈ, నీటిపారుదలశాఖ



**ఆధునికీకరిస్తాం**

జగిత్యాల ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా 62 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జిల్లాకు గర్వకారణం. దీన్ని ఆధునికీకరించి నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఏర్పాట్లుచేస్తాం. సొంత భవన నిర్మాణానికి కృషి చేస్తాం. మరింత మంది ఉద్యోగాలు పొందేలా చూస్తాం.
లక్ష్మణ్‌కుమార్, సంక్షేమశాఖ మంత్రి

**నాలుగు బృందాలకు శిక్షణ పూర్తి**

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటివరకు నాలుగు బృందాలకు శిక్షణ ఇచ్చాం. 62 మంది ఉద్యోగాలు సాధించారు. కొత్త బృంద శిక్షణకు ప్రభుత్వానికి నివేదించాం. పేదలు ఉద్యోగాలు సాధించేందుకు ఈ స్టడీ సర్కిల్ ఉపయుక్తంగా ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉంది. రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

# వేదికంటే భయం లేదిక



హైదరాబాద్ : వ్యక్తుల్లో దాగిన ప్రతిభను వెలికితీసి ప్రదర్శించేలా నగరంలోని కొన్ని వేదికలు ఉపయోగపడుతున్నాయి. ఓపెన్‌మైక్ సెషన్ల ద్వారా ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతున్నాయి. అవర్ సాక్రెడ్ స్పేస్, కళాకారుల స్పేస్, ఐరా స్పేస్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, హెచ్‌హెచ్ ఆర్ట్ స్పేస్, లామకాన్ వంటి వేదికల్లో స్టాండప్ కామెడీ, డైలాగ్ రైటింగ్, పాటలు పాడటం, నృత్యం వంటి నైపుణ్యాలను ప్రదర్శించొచ్చు. ఇలాంటి వేదికల నుంచే ప్రతిభను సానపెట్టుకున్నట్టు సందేశ్ జానీ, రాజశేఖర్ వంటి స్టాండప్ కామెడీ కళాకారులు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

**సరదాగా వెళ్లి..** ఇది ఒక ఓపెన్ కల్చరల్ సెంటర్. కళాకారులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు ఇక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటు న్నారు. కళల ప్రదర్శనతో పాటు, సాహిత్యం, నాటకాలు, సంగీతం, చర్చాగోష్ఠి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళలో రిహార్సల్స్ కూడా చేసుకునే వీలుంది. ఆర్ట్ ఎగ్జిబిషన్లు, పుస్తకావిష్కరణలు, ఫిల్మ్ స్క్రీనింగ్, కార్యశాలలకు వేదికగా ఉంది. సాయంత్రం వేళ సరదాగా వెళ్లి గడిపేలా ఆహ్లాదకర వాతావరణం, అందుబాటు ధరల్లో చిరుతిళ్లు ఏర్పాట్లు ఉంటాయి. కథా రచయితలు, కవులు ఉదయం, సాయంత్రం వేళల్లో కలుసుకొని చర్చలు జరుపుతుంటారు.

**కళాకారుల స్పేస్..**

ఇదొక ఓపెన్ మైక్ సెషన్. కవులు, కథకులు, గాయకులు, సంగీతకారులు, నృత్యకారుల ప్రదర్శనలతో పాటు స్టాండప్ కామెడీ వంటి ప్రదర్శనలు ఇక్కడ నిర్వహిస్తారు. ఒత్తిడికి తావు లేకుండా, పోటీ లేని ఆహ్లాదకర వాతావరణంలో ప్రోత్సహించే చప్పట్ల నడుమ ప్రదర్శనలు సాగుతాయి. భాషా బేధం లేకుండా అన్నీ భాషల్లో ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నారు. గత 6 నెలల్లో 20 ప్రదర్శనలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు షెడ్యూల్ ప్రకటిస్తారు.

**ఇవి కూడా..** జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని అనేక కేఫ్‌లలో వీక్లీ ఓపెన్‌మైక్, ఓపెన్ మైక్, ఓపెన్ మైక్ బై క్యా బోల్తే, అన్ ఫినిష్డ్ స్టోరీస్, ఎ కమ్యూన్ ఓపెన్ మైక్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోని ప్రత్యేక గ్రూప్‌లలో ఈ కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌లను ప్రతివారం ప్రకటిస్తున్నారు. ప్రతి ప్రదర్శనకు స్క్రిప్ట్ రాసుకోవడానికి ఎలాంటి అంశాలు ఎంచుకోవాలో చుట్టూ ఉండే కళాకారులు సలహాలు అందిస్తారు. తర్వాతి ప్రదర్శనలో వీటిని మెరుగుపరుచుకొని మరోసారి ప్రదర్శించొచ్చు.

# మాయగాళ్లకు.. మ్యాట్రి'మనీ'!




హైదరాబాద్ : ఇటీవలి కాలంలో మ్యాట్రిమోనీ మోసాల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాత నేరస్థులే ఈ మోసాలు చేస్తుండగా.. తాజాగా సైబర్ నేరగాళ్లు తోడయ్యారు.

**మాటలతో మభ్యపెట్టి..** పెళ్లి సంబంధాల కోసం ఎదురు చూసే తల్లిదండ్రులు.. వధువు/వరుడి గురించి ఏ చిన్న సమాచారం వచ్చినా ఆరా తీస్తుంటారు. మంచి సంబంధం చేజారిపోవద్దనే ఉద్దేశంతో తొందర పడుతుంటారు. ఫొటో, ప్రొఫైల్‌లో ప్రాథమిక వివరాలు చూసి మంచివారనే భావనతో సంప్రదిస్తున్నారు. విదేశాల్లో ఐటీ, వైద్య వృత్తిలో ఉన్నామని కొన్ని నెలల్లో భారత్‌కు వచ్చాక పెళ్లి చేసుకుందామని అమ్మాయిల్ని నమ్మించి ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారు. అచ్చం ఒకే వృత్తిలో ఉన్నామని.. ఆలోచనలు కలిశాయని నకిలీ ఫొటోలు పంపిస్తూ అనుమానం రాకుండా మభ్యపెడుతున్నారు. డబ్బు ఖర్చు పెడుతూ.. పుట్టినరోజున వివిధ సందర్భాల్లో బహుమతులు పంపిస్తూ నమ్మకం పొందుతున్నారు. యువతులు దగ్గరైనట్లు భావించాక అత్యవసరం ఇతర కారణాలతో డబ్బు వసూలు చేస్తున్నారు. ఇటీవల జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వైద్యురాలు మ్యాట్రిమోనీ మోసంలో రూ.10 లక్షలు పోగొట్టుకుంది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో 24 మంది మహిళలను మోసగించినట్లు తేలింది. సికింద్రాబాద్‌కు చెందిన ఇద్దరు మహిళలు 50 మందికిపైగా పురుషులను మోసగించారు.

**పాకిస్థాన్ మోడల్ ఫొటోతో..**

పాతబస్తీకి చెందిన యువకుడు పెళ్లి సంబంధం కోసం ఒక మ్యాట్రిమోనీ వేదికలో వెతికాడు. అందమైన యువతి ఫొటో ఉన్న ప్రొఫైల్‌ను చూసి సందేశం పంపాడు. అవతలి నుంచి బదులొచ్చింది. పెళ్లికి సిద్ధమని తల్లి అనారోగ్యంతో ఉందని వైద్యం కోసం డబ్బు అవసరమంటూ రూ.25 లక్షలు వసూలు చేసింది. పదే పదే ఏదో కారణంతో డబ్బు అడగడంతో యువకుడిని అనుమానమొచ్చి ఆరా తీయగా.. మోసమని తేలింది. పాకిస్థాన్ మోడల్ ఫొటోతో మహిళ మరొకరు కలిసి ఇలా చేసినట్లు తేలింది.

**జాగ్రత్తలివీ..**

మ్యాట్రిమోనీ వేదికల్లో పరిచయమైన వ్యక్తులతో సాన్నిహిత్యం పెరిగాక డబ్బు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదు. వ్యక్తిగత ఫొటోలు పంచుకోవద్దు.

ఏదైనా సంబంధం వచ్చినప్పుడు ముందు ఆరా తీయాలి. కుటుంబ సభ్యులతో వెళ్లి అవతలి వ్యక్తి ఇంటిల్లిపాదితో మాట్లాడుకున్నాకే ముందుకెళ్లాలి.

విదేశాల్లో ఉన్నానని చెబితే తొందరపడి ముందుకెళ్లొద్దు. అవసరమైతే ఇక్కడుండే వారి తల్లిదండ్రులతో మాట్లాడాలి.

అవసరమైతే సంబంధానికి ముందుకొచ్చిన వ్యక్తి నేపథ్యాన్ని తనిఖీ చేసేందుకు డిటెక్టిక్ ఏజెన్సీలను సంప్రదించాలి.

# మొక్కవోని దీక్ష



వికారాబాద్: జిల్లాలో పచ్చదనం పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోంది. గతంలో తలెత్తిన లోపాలను సవరించుకొంటూ ముందుకెళ్లాలని అధికారులు కార్యాచరణ రూపొందించారు. 2025లో అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్త భాగస్వామ్యంతో 48.38 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పటి వరకు 45.94 లక్షలు నాటి 92 శాతం లక్ష్యాన్ని సాధించాయి.

**కాపాడేందుకు చర్యలు..**

నాటిన మొక్కలను ఏపుగా ఎదిగేలా సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా నాటి సంరక్షిస్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. పంచాయతీలకు పంపిణీ చేసిన ట్యాంకరు ద్వారా నీరు పడుతున్నారు. వేసవిలో అవసరమైన చోట ఉపాధిహామీ కూలీలతో మొక్కలకు నీళ్లు పోయించడానికి చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలన్నింటికీ జియోట్యాగింగ్ విధానం ద్వారా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నుంచి అవసరమైన మొక్కలను రైతులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి తీసుకెళుతున్నారు. పొలం గట్లపై నాటి సంరక్షించుకుంటున్నారు. ఇలా జిల్లాలోని రైతులు పొలం గట్లపై ఇప్పటి వరకు 80 లక్షల టేకు మొక్కలను నాటి పెంచుకుంటున్నారు.

**ఈ శాఖలు దూరం..**

కొన్ని ప్రభుత్వ శాఖలు వన మహోత్సవానికి దూరంగా ఉన్నాయి. వ్యవసాయశాఖ లక్ష్యం 6,38,500, పంచాయతీరాజ్ 4 లక్షలు, గనులు, భూగర్భ వనరులశాఖ 58వేలు కాగా.. ఒక్క మొక్కైనా నాటలేదు. ఆర్‌అండ్‌బీ, మార్కెటింగ్ శాఖలు 500 చొప్పున మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా విస్మరించారు. నీటి పారుదలశాఖ 7,600, పశుసంవర్ధకశాఖ 5వేలు, పౌరసరఫరాలశాఖ 2 వేలు, డీడబ్ల్యూవో శాఖ వెయ్యి మొక్కలకుగాను ఒక్కటీ నాటలేదు.

**పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ..**

– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

అటవీ ప్రాంతాల్లోని 375 ఎకరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో 2.5 లక్షల మొక్కలు నాటాం. వీటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మొక్కలు ఎండలకు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీళ్లు పోసి ఏపుగా ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

# తేమ తగ్గితే బంగారమే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 78.31 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు 41 జిన్నింగు మిల్లులను ఎంపిక చేశారు. నుంచి తెల్ల బంగారం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులే సీసీఐకి విక్రయించాలి. యాప్ గురించి పత్తి రైతులకు రైతువేదికల్లో ఏఈవోలు అవగాహన కల్పిస్తున్నారు.

తేమను బట్టి ధర: 8శాతం కాకుండా 9, 10, 11, 12శాతం తేమ ఉంటే సీసీఐ నిర్ణయించిన పింజ రకాలు, పొడవునుబట్టి ధర తగ్గుతూ వస్తుంది.పింజపొడవు (గింజ నుంచి పత్తిని వేరు చేసినప్పుడు వచ్చే



దూది పొడవు)

మైక్రోనీర్ (గింజ నుంచి లాగినప్పుడు కనిపించే పత్తి సాంద్రత)

ప్రభుత్వం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను పొందడానికి టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. సందేహాలున్న రైతులు 1800 599 5779 నెంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

జిల్లాలో 9 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు. తిప్పర్తి మండలం రామలింగాలగూడెం సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీ, చండూరు బాలాజీ కాటన్ ఇండస్ట్రీ, చిట్యాల వరలక్ష్మి కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్–ఏ శ్రీలక్ష్మి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీ, మాల్–బి శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి–ఏ శివ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి–బి తిరుమల కాటన్ జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్, నకిరేకల్ శ్రీనాథ్ కాటన్ ఫైబర్, శాలిగౌరారం టీఆర్‌ఆర్ కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోలు జరుపుతారు.

**నాణ్యమైన సరకుకే 'మద్దతు'**

ఈ ఏడాది పత్తికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.8,110 ప్రకటించింది. ఈ ధరను దక్కించుకోవాలంటే రైతులు నిబంధనలకు లోబడి సరకు తీసుకురావాలి. తేమశాతం 8 నుంచి 12 మధ్య ఉంటేనే కొనుగోలు చేస్తారు. ఆపైన ఉంటే తిరస్కరిస్తారు. ఇప్పటికే వర్షాలతో నష్టాలు ఎదుర్కొని, అధిక పెట్టుబడి పెట్టిన పత్తి రైతులు దళారులను ఆశ్రయించకుండా నిబంధనల ప్రకారం తేమ ఉండేలా చూసుకుని స్లాట్ బుకింగ్ చేసుకుని విక్రయించాలి. అప్పుడే కోరుకున్న మద్దతు ధర దక్కుతుంది.

# పోషకాల డబ్బా.. అదిరిందబ్బా

మిర్యాలగూడ : నాలుగైదు రకాల పండ్ల ముక్కలు, గుప్పెడు ఉడికించిన శనగలు, నాలుగు జీడి పప్పులు, ఖర్జూర, బాదంపప్పు, వాల్‌నట్స్ వంటివి ఉదయం, సాయంత్రం వేళలో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నిత్యం వాటిని సమకూర్చుకోవడం అందరికీ కుదరకపోవచ్చు. అయితే ఇటీవల పలువురు యువత పండ్ల ముక్కల డబ్బాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఆరోగ్యం.. యువతకు ఉపాధి లభిస్తున్నాయి. గతంలో నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడిప్పుడే నల్గొండ, మిర్యాలగూడ వంటి పట్టణాలకు సైతం విస్తరిస్తుంది.

డబ్బాల్లో దానిమ్మ, జామ, యాపిల్, పైనాపిల్, బొప్పాయి, పుచ్చ వంటి పండ్ల ముక్కలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, కీర దోస ముక్కలు, రాజ్మా, శనగలు వంటి ఉడికించిన గింజలు, పెసర్లు, అలసందలు వంటి మొలకెత్తిన గింజలు, ఖర్జూర, జీడిపప్పు, బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ అందిస్తున్నారు.

**సామాజిక మాధ్యమాల్లో ప్రచారం**

పండ్ల ముక్కల డబ్బాల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రాలు, వాట్సప్ గ్రూపులతో పాటు.. ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ట్విటర్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగిస్తున్నారు. కొందరు పండ్లను కడగడం నుంచి కోయడం, ప్యాకింగ్ చేయడం వంటి అన్ని పనులను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు.

**బాక్సులు ఇలా..** ప్రస్తుతం జిల్లాలో లభిస్తున్న బాక్సుల్లో నాలుగు రకాల పండ్ల ముక్కలు, రెండు రకాల కూరగాయల ముక్కలు, ఒక రకం మొలకలు కలిపి రూ.2వేలకు విక్రయిస్తుండగా.. కపుల్ బాక్సును రూ.3,500కు విక్రయిస్తున్నారు. వీటితో పాటు మరో మూడు రకాల డ్రైఫ్రూట్స్ కూడా కలిపి గోల్డ్ బాక్స్ పేరుతో రూ.2,400, దీంట్లోనే కపుల్ బాక్స్‌ను రూ.4వేలకు విక్రయిస్తున్నారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం డిన్నర్ లాగా సరఫరా చేస్తుండగా..ఎక్కువ మంది ఉదయమే వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**20తో మొదలు...**

నేను తొలుత ఈ ఏడాది జనవరిలో ఫ్రెష్ బైట్స్ ఫ్రూట్ బాక్స్ పేరిట పండ్ల ముక్కల పంపిణీని ప్రారంభించాను. అంతకు ముందు నుంచే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వల్ల తొలి రోజు 20 బాక్సుల ఆర్డర్‌తో మొదలు పెట్టాను. మధ్యలో వందకు పైగా చేరినప్పటికీ..ప్రస్తుతం 85 వరకు అందిస్తున్నాం.పగిళ్ల కల్యాణ్, మిర్యాలగూడ

# ప్లాస్టిక్ ముప్పు.. ఎవరిదీ తప్పు..!

నల్గొండ : పురపాలికల్లో పాలిథిన్ నిషేధం ప్రచారానికే పరిమితం అయింది. అటవీ, పర్యావరణ పరిరక్షణ చట్టం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ఉత్తర్వుల ప్రకారం 50 మైక్రాన్లు మందం కంటే తక్కువ ఉన్న పాలిథిన్ సంచులను వాడకూడదు. తెలుపు రంగు తప్ప నలుపు, నీలం, ఇతర రంగులను వాడేందుకు వీలు లేదు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పురపాలికల్లో కమిషనర్లు పర్యవేక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే నిల్వలను సీజ్ చేయాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టిక్‌ను తగ్గించాలని చెబుతున్నా ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో పాలిథిన్ వస్తువుల వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికలు, మండల కేంద్రాల్లో నిర్దిష్ట ప్రమాణాలు లేని ప్లాస్టిక్ నిషేధం కథ మొదటికొచ్చింది. 19 పురపాలిక పరిధిలో నిత్యం 320 టన్నులకు పైగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 30 శాతానికి పైగా పాలిథిన్ సంచులు, గ్లాసులు, బాటిల్స్ పోగవుతున్నాయి. గత ఏడాది నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడ పట్టణాల్లో పాలిథిన్ సంచులు వాడే దుకాణాలను సీజ్ చేసి రూ.3 లక్షలకు పైగా జరిమానా విధించారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నియంత్రణ కరవైంది. తనిఖీలు, జరిమానా విధించే అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సూర్యాపేట, నల్గొండ పురపాలికల్లో నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. మిగతా 17 చోట్ల తనిఖీల జోలికి అధికారులు వెళ్లడం లేదు. హైదరాబాద్, విజయవాడ కేంద్రాల నుంచి ప్రధాన పట్టణాలకు దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు.అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం

పాలిథిన్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. వ్యాపారులుపై ఇటీవల రూ.50వేలకు పైగా జరిమానాలు విధించి వసూలు చేశాం. మరిన్ని దాడులు చేస్తూ పాలిథిన్ వాడకం, విక్రయాలపై నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

# పెరిగిన భారం.. మెరుగవని సామర్థ్యం..

కరీంనగర్ :ఈ చిత్రంలోని నియంత్రిక కరీంనగర్ సీతారాంపూర్‌లోనిది. ఈ నియంత్రికపై ఓవర్ లోడ్ ఉందంటూ అదనపు మీటర్ల కనెక్షన్ ఇవ్వకుండా విద్యుత్తు సిబ్బంది తిరస్కరిస్తున్నారు. ఈ ప్రాంతం నగరంలో విలీనమై ఆరేళ్లవుతోంది. పెరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా సామర్థ్యం ఎక్కువున్న త్రీఫేజ్ నియంత్రికలను ఏర్పాటు చేయడంలేదు.

గ్రామాల్లో వినియోగించే సింగిల్ ఫేజ్ నియంత్రికలనే ఇప్పటికీ నగరంలో విలీనమైన ప్రాంతాల్లోనూ కొనసాగిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేయడానికి ముందుకొస్తుంటే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఒప్పుకోవడంలేదు. వినియోగదారులు అదనపు అవసరాలకు విద్యుత్తు సరఫరా కోసం ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో విలీన గ్రామాల్లోనే ఈ పరిస్థితి నెలకొంది.

**విలీన గ్రామాల్లోనే...**

కరీంనగర్ నగరపాలక సంస్థ 2019లో రేకుర్తి, సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, అల్గునూర్, సదాశివపల్లి, పద్మనగర్, ఆరెపల్లి



గ్రామాలను విలీనం చేసుకుంది. తిరిగి 2025లో కొత్తపల్లి పురపాలక సంఘం, చింతకుంట, మల్కాపూర్–లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కలిపారు. అయితే వీటిలో పద్మనగర్ మినహా అన్ని ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్ నియంత్రికలనే వినియోగిస్తున్నారు.

**కొత్త కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి**

సింగిల్ ఫేజ్ నియంత్రికల సామర్థ్యం 15 కేవీఏ నుంచి 25 కేవీఏ ఉంటుంది. ఇందులో 15 కేవీఏపై లోడ్ ఎక్కువైతే 25 కేవీఏ ఏర్పాటు చేస్తారు. దీని సామర్థ్యం మించితే 66 కేవీఏ, 100 కేవీఏ నియంత్రికలు ఏర్పాటు చేయాలి. సాధారణంగా 2 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న మీటర్లు జారీ చేయాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్‌లో 3 కిలోవాట్ల సామర్థ్యం గల కొత్త మీటర్ కనెక్షన్ జారీ చేస్తున్నారు.

అధికారిక రికార్డుల ప్రకారం తక్కువ కనెక్షన్లున్న నియంత్రికపై లోడ్ ఎక్కువగా పడుతోంది. మరి కొన్ని చోట్ల లోడ్ తక్కువగా ఉన్నా వాడకం ఎక్కువగా ఉండి నియంత్రిక సామర్థ్యం మించిపోతోంది. ఏ రకంగానూ కొత్త కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీనికి పరిష్కారంగా అధిక సామర్థ్యం ఉన్న త్రీఫేజ్ నియంత్రికలు ఏర్పాటు చేస్తే వినియోగదారుల ఇబ్బందులు తొలగిపోతాయి.

**మా దృష్టికి రాలేదు** ఇప్పటివరకు నియంత్రిక సమస్య నా దృష్టికి రాలేదు. నేను వచ్చిన నాటి నుంచి ఎవరికీ ఓవర్‌లోడ్ ఉందంటూ మీటర్లు నిలిపివేయలేదు. నియంత్రికల ఏర్పాటును స్థానికులు అడ్డుకుంటున్న మాట వాస్తవమే. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. రఘు, ఏడీఈ కరీంనగర్ రూరల్

# చర్లపల్లిలో రైలెళ్లిపోతోంది

హైదరాబాద్ : చర్లపల్లి నుంచి సుమారు 130 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దాదాపు 55 వేల మందికిపైగా ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే అనేక రైళ్లను ఈ టెర్మినల్‌కు మళ్లించగా.. తాజాగా పండగ ప్రత్యేక రైళ్ల సంఖ్య పెరిగింది. సరైన ప్రజా రవాణా సదుపాయాలు కల్పించకుండా రైళ్లను పెంచుకుంటూ పోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరం నుంచి చర్లపల్లికి.. అక్కడి నుంచి గమ్యస్థానాలకు చేరేందుకు అయ్యే ఖర్చు ఒకేలా ఉంటోందని వాపోతున్నారు. ప్రస్తుతం నగరం మీదుగా విశాఖకు రెండు, తిరుపతి, బెంగళూరు, నాగ్‌పుర్‌కు ఒకటి చొప్పున మొత్తం 5 వందేభారత్ రైళ్లు నడుస్తుండగా.. కొత్తగా చర్లపల్లి - నాందేడ్, నాంపల్లి - పుణె త్వరలోనే ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.



**ఇదీ పరిస్థితి..**

పంజాగుట్ట నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు 24 కిలోమీటర్లు. రాత్రి 9.30 గంటలకు రైలు అందుకోవాల్సి ఉండగా.. స్థానిక ప్రయాణికుడు రాత్రి 8 గంటలకు ప్రైవేటు క్యాబ్ బుక్ చేసేందుకు ప్రయత్నించారు. పంజాగుట్ట నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు చేరుకునేందుకు ద్విచక్ర వాహనం రూ.350, ఆటోకు రూ.450, నాన్ ఏసీ కారుకు రూ.600, ఏసీ కారు రూ.650, పెద్ద పరిమాణంలో ఉండే వాహనం రూ.900 అని చూపించడంతో అవాక్కయ్యారు.

చర్లపల్లికి ఒకటే ఎంఎంటీఎస్ అందుబాటులో ఉండడం, రెండు లేదా మూడు బస్సులు మారి సమయానికి చేరుకునే అవకాశాలు తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది క్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.

చర్లపల్లి టెర్మినల్‌కు రెండు మార్గాల ద్వారా ప్రయాణికులు చేరుకుంటున్నారు. మల్లాపూర్ మార్గంలో ప్రతి 40 నిమిషాలకు, మహాలక్ష్మినగర్ వైపు నుంచి ప్రతి 10 నిమిషాలకో బస్సులున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మహాలక్ష్మినగర్ వైపు చేరుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణ సదుపాయాలు పెంచాలి.. లేదంటే అందుబాటులో ఉండే స్టేషన్లకు కొన్ని రైళ్లను మళ్లించాలని కోరుతున్నారు.

# పెద్ద చెరువు చిన్నబోతోంది..!.. రావిర్యాలలో 30 ఎకరాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెంచర్లు



హైదరాబాద్ : మహేశ్వరం మండలంలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణకు గురైనా రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇక్కడ 30 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఇటీవల వర్షం నీరు లే–అవుట్లలోకి రాకుండా స్థిరాస్తి వెంచర్ ప్రతినిధులు అడ్డుకట్ట వేస్తే పొలాలు నీట మునిగాయి. రైతుల ఆగ్రహంతో అధికారులు అడ్డుకట్ట తొలగించారు. తొలుత హెచ్‌ఎండీఏ అధికారులే అనుమతులిచ్చారని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. హెచ్‌ఎండీఏ అధికారులేమో.. 'ఇది ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదు. కలెక్టర్ నుంచి నిరభ్యంతర పత్రం వస్తే లే–అవుట్‌కు అనుమతి ఇస్తాం.' అంటున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఎఫ్‌టీఎల్‌పై సంయుక్త సర్వే చేస్తామంటున్నారు.

**పటాన్ని మార్చేసి..**

తుక్కుగూడ సమీపంలోని రావిర్యాల అవుటర్ రింగు రోడ్డు దగ్గరలోని పెద్ద చెరువు భూములు స్థిరాస్తి వెంచర్లకు అనువుగా ఉంటాయని కొందరు అక్రమార్కులు కన్నేశారు. పదేళ్ల క్రితం చెరువు విస్తీర్ణం 1224 ఎకరాల నుంచి 884.20 ఎకరాలకు అధికారులు తగ్గించారు. 2016లో చెరువు చిత్రపటాన్ని మార్చేసి 855 ఎకరాలేనని తేల్చారు. ఇదే అదనుగా స్థిరాస్తి వ్యాపారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను కలిపేసుకుని రహదారులు నిర్మించి, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించారు. వర్షం కురిసినప్పుడు చెరువు నీరు ఈ వెంచర్లలోకి రావడంతో కొనుగోలు చేసినవారు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావడం లేదు.

**హద్దులు చెరిపేసి..** సర్దార్‌నగర్–రావిర్యాల మధ్య లోని పెద్దచెరువు కింద కొంగర, ఆదిభట్ల, పటేల్‌గూడ గ్రామా ల్లో వందల ఎకరాలు సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం కొన్ని వెంచర్లకు ప్రయోజనం కల్పించేందుకు ఏకంగా చెరువు హద్దులను అధికారులు మార్చేశారు. బాహ్యవలయ రహదారి లోపల చెరువు ఉండగా, వెలుపల ఉన్నట్టు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో మార్చారు. తద్వారా 30 ఎకరాల మేరకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు అక్రమార్కుల ఖాతాలోకి వెళ్లాయి. ఈ భూముల ప్రస్తుత మార్కెట్ ధర రూ.450 కోట్లు ఉంటుంది. చెరువు సరిహద్దు విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈఈ గోవింద్ నాయక్‌ను వివరణ కోరగా.. అవుటర్ లోపలే చెరువుందని స్పష్టం చేశారు.

# ధర ఎక్కువ.. స్పందన తక్కువ.. స్థలాల వేలంపై మల్లగుల్లాలు



హైదరాబాద్: హెచ్‌ఎండీఏ లేఅవుట్లలోని ప్లాట్ల విక్రయాలకు సంబంధించి తాజాగా ఆన్‌లైన్‌లో వేలం వేయగా.. పెద్దగా స్పందన రాలేదు. పలు ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ధరల కంటే రెండు, మూడు రెట్లు అధికంగా అప్‌సెట్(హెచ్‌ఎండీఏ నిర్ణయించే కనీస ధర) ధరలు నిర్ణయించడం వల్లే ఆసక్తి చూపలేదని ఒక నిర్ణయానికి వచ్చారు.కోకాపేటలో కనీస ధర చదరపు గజానికి ఏకంగా రూ.1.75 లక్షలుగా నిర్ణయించారు. గతంలో రూ.65 వేలుగా అప్‌సెట్ ధర ఉంది. తాజాగా సర్వే నంబరు 144లో 8,591 చదరపు గజాలను వేలంలో పెట్టగా ధర ఎక్కువగా ఉండడంతో ఎవరూ ముందుకు రాలేదు. తుర్కయంజాల్‌లోనూ ఇదే పరిస్థితి.

**చదరపు గజానికి గతంలో నిర్ణయించిన ధర ఇలా...**

తర్కయాంజిల్ (12 ప్లాట్లు)- 60,000
బాచుపల్లి (70 ప్లాట్లు) - 70,000
బైరాగిగూడ- 75,000
కోకాపేట్- 1,75,000
చందానగర్- 1,05,000
పుప్పాలగూడ- 1,20,000

**బెడిసికొట్టిన హెచ్‌ఎండీఏ వ్యూహం..**

తాజాగా ఆన్‌లైన్ వేలానికి స్పందన లేకపోవడంతో అప్‌సెట్ ధరను తగ్గించి మరోసారి వేలం వేయాలని భావిస్తున్నారు. గతంలో మోకిలలో ప్లాట్లను వేలం వేయగా చాలామంది రూ.లక్ష కట్టి వేలంలో పాల్గొన్నారు. చదరపు గజం రూ.లక్ష వరకు పెంచేసి తర్వాత డబ్బులు కట్టడం మానేశారు. తాజాగా డిపాజిట్ మొత్తాలను భారీ ఎత్తున పెంచడం వల్ల అర్హులైన వారే ముందుకొస్తారని భావించినప్పటికీ ఆ వ్యూహం బెడిసికొట్టింది. స్థానికంగా ఉన్న ధరలను పరిశీలించి అప్‌సెట్ ధర నిర్ణయించే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

# నిబంధనలు గాలికి.. వ్యర్థాలు శివారుకి



హైదరాబాద్: పరిశ్రమల వ్యర్థాలతో జీడిమెట్ల, కాటేదాన్, పటాన్‌చెరు, నాచారం, మల్లాపూర్, పాశమైలారం ప్రాంతాల్లో భూగర్భజలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. గ్రేటర్ పరిధిలోని 185 చెరువులు, కుంటల్లో నీరు మురుగుమయమైంది.జీడిమెట్ల సమీపంలోని ఫాక్స్‌సాగర్, కాటేదాన్ చెంత నూర్‌మహ్మద్‌కుంటతోపాటు అనేక చెరువులు నీరు ఉపయోగించలేని విధంగా మారాయి. పారిశ్రామికవాడల్లోని ఇళ్లలో ట్యాప్ తిప్పితే నురగతో నీరు ఉబుకుతోంది.నిత్యం పరిశ్రమల్లో వెలువడే వ్యర్థాలను జీడిమెట్ల, పటాన్‌చెరు ఈటీపీలతో పాటు నాచారంలోని మన ఈటీపీకి తరలించాన్న నిబంధనలు నిర్వాహకులు విస్మరిస్తున్నారు.

**ట్యాంకర్ మాఫియా..** గతంలో పరిశ్రమల నిర్వాహకులు సమీపంలోని డ్రైనేజీ, నాలాల్లోనే వ్యర్థ జలాలను వదిలేవారు. స్థానికుల్లో అవగాహన పెరగడంతో వాటిని ఇప్పుడు శివార్లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జీడిమెట్ల సుభాష్‌నగర్‌లో వ్యర్థాలను తరలించేందుకు సిద్ధం చేస్తున్న డ్రమ్ములు నిబంధనలను కాలరాస్తున్నాయి. ఇందుకు ఓ ట్యాంకర్ల మాఫియానే నడుస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కాలుష్యకారక వ్యర్థాలు, జలాలను శుద్ధి చేశాకే బయటకు వదలాలి. ఇది భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో యజమానులు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ వ్యవహారం అక్రమం కావడంతో వాహనదారులు తక్కువ దూరమైనా ట్రిప్పునకు రూ.60వేల వరకూ డిమాండ్ చేస్తున్నారు. ఒక్కోసారి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

**పీసీబీ ఏం చేస్తోంది?..** వ్యర్థ జలాలను ఇష్టారీతిన తరలించకుండా పీసీబీ నిబంధనలున్నాయి. సంబంధిత ట్యాంకరు ముందస్తుగానే అనుమతి తీసుకోవాలి. అందులో ఏముందో పెద్ద అక్షరాలతో రాయాలి. ఉ.6 నుంచి సా.6 గంటల్లోపే రవాణా చేయాలి. పీసీబీ పర్యవేక్షణ లోపం కారణంగా ఇవేవీ అమలుకావడం లేదు.

**శుద్ధి కేంద్రాలకు తరలించడంలో నిర్లక్ష్యం..**

మల్లాపూర్ పారిశ్రామికవాడలో 700 పరిశ్రమలుండగా..స్థానిక వ్యర్థాలను బోడుప్పల్ పరిధిలోని ఈటీపీకి తరలించాలి.ఇక్కడ 200 పరిశ్రమలు నమోదవ్వగా..రోజూ 45 కారా?నాల నుంచి వ్యర్థాల ట్యాంకర్లను పంపుతున్నారు.జీడిమెట్ల ఈటీపీను సేకరణ, శుద్ధి, పారబోత పద్ధతిలో నిర్వహిస్తుండగా..1200 పరిశ్రమల్లో 300 మాత్రమే శుద్ధికి పంపుతున్నాయి.

# ముందు ఒక ముఠా.. వెనకాలే అసలు ఆట!

సత్తుపల్లి : సత్తుపల్లి నియోజకవర్గంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇసుకను సత్తుపల్లికి తరలిస్తున్నారు. వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల పోలీసుల దాడుల్లో లారీలు పట్టుబడుతున్నా ఏమాత్రం లెక్కచేయకుండా నిరంతరం ఇసుక దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తరలిస్తున్న ఇసుకనూ ఇతర గుత్తేదార్లు, బిల్డర్లకు రవాణా చేస్తూ భారీగా సొమ్ము దండుకుంటున్నారు.

**అధిక లోడుతో ఇసుక తరలిస్తూ..**

30 టన్నుల సామర్థ్యం ఉన్న టిప్పర్లలో, లారీల్లో 50 టన్నుల వరకూ ఇసుక తరలిస్తున్న వాహనాలను ఇటీవల సత్తుపల్లి, వేంసూరులలో ఎంవీఐ దాడులుచేసి కేసులు నమోదు చేశారు. సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో 8 లారీలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అధిక లోడుతో రోడ్లు సైతం శిథిలమవుతున్నాయి.

**అక్కడ 150.. ఇక్కడ 1300**

ఏపీలో ఇసుక టన్ను రూ.150కి కొనుగోలు చేస్తూ సత్తుపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.1100 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారంలో లారీల యజమానులకు వినియోగదారులకు మధ్య దళారీలు పుట్టుకురావడంతో దందా మరింత పెరిగిపోయింది. దళారులు ఇసుక లారీలకు ఒక్కో ట్రిప్పునకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు కమీషన్లు దండుకొంటున్నారు.



**వేంసూరు మీదుగా పలు దారుల్లో..**

ఏపీలోని విజయవాడ నుంచి ఇసుకను పలు మార్గాల ద్వారా వేంసూరు మీదుగా తరలిస్తున్నారు. అడపాదడపా వేంసూరు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. రవాణా ఆగడంలేదు. ఎక్కువగా రాత్రుళ్లు తరలుతున్న లారీలకు ఎస్కార్ట్‌గా కొందరు వ్యక్తులు ముందుగా ప్రయాణిస్తూ పోలీసులు లేరని నిర్ధారించాక రవాణా సాగుతోంది. కేసులు నమోదు చేస్తే పలుకుబడితో కొందరు తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కేవలం లారీలపైనే కాకుండా దళారీ వ్యవస్థనూ నిరోధించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

సత్తుపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచామని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, టిప్పర్లపై పలుమార్లు కేసులు నమోదు చేశామని ఏసీపీ ఎ.రఘు తెలిపారు. ప్రస్తుతం పలు మార్గాల్లో గస్తీని పెంచి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు.

# రెండు దశాబ్దాల ఎదురుచూపులు

ఖమ్మం: పూర్తి మెట్ట ప్రాంతమైన కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో చెరువులు నింపి సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిచేందుకు ఉద్దేశించిన బుగ్గవాగు ప్రాజెక్టు 20 ఏళ్లుగా కాగితాల్లోనే మగ్గుతోంది. ఉన్నత స్థాయిలో హైడ్రాలిక్ క్లియరెన్స్‌లు వచ్చినా ప్రాజెక్టు నిర్మాణం కొలిక్కిరావటం లేదు.

బుగ్గవాగు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రావిటీ ద్వారా నీరు మళ్లించేందుకు కాలువలు తవ్వాలని, ఇందుకు భూసేకరణ చేయాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదించారు. రూ.40 కోట్ల అంచనాతో టెండర్లు నిర్వహించారు. 25 కి.మీ. పొడవున కాలువలు తవ్వేందుకు సుమారు 100 ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా రైతులు అంగీకరించలేదు. భూములివ్వమని ఏజెన్సీలో గిరిజనులు ససేమిరా మొండికేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూసేకరణకు ప్రత్యామ్నాయంగా పైపులైన్లు నిర్మించి నీటిని తరలించే అవకాశాలు పరిశీలించాలని ఇటీవల ఆదేశించారు. భూమిలో పైపులైన్ నిర్మించి నీటిని మళ్లించేందుకు తాజాగా రూ.97 కోట్ల అంచనాతో ప్రతిపాదన రూపొందించి పంపించారు. **గత ప్రతిపాదనలు రద్దు..** గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న ఖమ్మంకు చెందిన గుత్తేదారు ఇటీవల ఒప్పందం రద్దు చేయాలని అధికారులకు లేఖ అందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక పంపారు. ఇదే సమయంలో ప్రాజెక్టు నూతన ప్రతిపాదనలూ ప్రభుత్వానికి అందించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన రూ.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి.



**ప్రాజెక్టు స్వరూపం**

సింగరేణి మండలం గేట్ కారేపల్లి సమీపంలో బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి. అక్కడి నుంచి నీటిని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 31 చెరువులకు మళ్లించటం ద్వారా సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది. కామేపల్లి మండలంలో పింజరమడుగు, నెమలిపురి, గోవింద్రాల, కొమ్మినేపల్లి, రఘునాథపాలెం మండలం కోటపాడు, పాపటపల్లి, కోయచెలక, శివాయిగూడెం, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీటిని మళ్లిస్తారు. ఇందుకు 38 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించనున్నారు.

**ప్రధానంగా కామేపల్లికి..**

సాగునీటి వసతి లేని రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల రూపంలో 30పైచిలుకు చెరువులకు సాగర్ నీరు అందించే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఈ ఎత్తిపోతలలో లబ్ధి పొందే కొన్ని చెరువులు పూర్వ బుగ్గపాడు ప్రాజెక్టు పరిధిలో ఉన్నా రెండు పథకాల రూపంలో కరవు నేలకు రెండు పంటలా నీరందే అవకాశం ఉంది. అంతకంటే ముఖ్యంగా ఎలాంటి నీటి వనరులేని కామేపల్లి రైతులకు బుగ్గపాడు ప్రాజెక్టు ఎంతో అవసరం.

# ఇంటిపై టోల్‌బండ

నందికొట్కూరు : నాపరాయి గనుల్లో నుంచి వాహనాల్లో తరలించే గోడ రాయి, ఫ్లోరింగ్ రాయి, గ్రావెల్‌కు టోల్ వసూలు చేస్తున్నారు. టోల్ గేట్ల వద్ద బిల్లుల రూపంలో కాకుండా గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్న నిబంధన పెట్టారు. ఫలితంగా వాహనదారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని నాగలూటి, పీరుసాహెబ్‌పేట,



దామగట్ల, నాగటూరు గ్రామాల పరిధిలో పెద్దఎత్తున నాపరాయి గనులున్నాయి. వీటిల్లో ప్రతిరోజూ తవ్వకాలు సాగుతుంటాయి. కాగా తవ్వకాలు జరిగిన తర్వాత వ్యర్థాలు ఉత్పత్తవుతుంటాయి. ఆయా ప్రాంతాల నుంచి నందికొట్కూరుకు గ్రావెల్ తరలించాలంటే ట్రాక్టరు రూ. 1,200 (దూరాన్ని బట్టి పెరుగుతుంది), గోడరాయి రూ. 2,200, ఫ్లోరింగ్ రాయికి రూ. 1,200 నుంచి రూ. 1,800 వరకు ధర ఉంటుంది.

# తప్పని మోత

కర్నూలు : ప్రస్తుతం గ్రావెల్‌కు టన్నుకు రూ. 90, గోడరాయి రూ. 190, ఫ్లోరింగ్ రాయికి రూ. 240 కేటాయించారు. వినియోగదారుడికి సంబంధించి రెండు, మూడు వాహనాలకు మాత్రమే స్థానికంగా అనుమతులిస్తున్నారు. ఎక్కువ వాహనాల్లో తరలించాలంటే గనుల శాఖలో ముందస్తుగా డబ్బులు చెల్లించి రసీదు తీసుకోవాల్సి వస్తోంది. టోల్‌గేట్ వసూలు నేపథ్యంలో గ్రావెల్‌పై (టన్నులను బట్టి) రూ. 700, గోడరాయి రూ. 1,200, ఫ్లోరింగ్ రాయి రూ. 1,500 వరకు వినియోగదారుడిపై అదనపు భారం పడుతుంది.

**గతంలో ఉచితంగా..**

గతంలో గనుల నుంచి గోడరాయి, గ్రావెల్‌ను ఉచితంగా తరలించేవారు. ఫ్లోరింగ్ రాయి ట్రాక్టర్‌కు రూ. 90, లారీలకు సంబంధించి రూ. 500ను గ్రామ పంచాయతీ తరఫున వసూలు చేసేవారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి సుమారు 20 ట్రిప్పుల గోడ రాయి పడుతుంది. వీటికి మొదట నంద్యాల మైనింగ్ కార్యాలయానికి వెళ్లి అనుమతులు తెచ్చుకోవాలి. ప్రస్తుతం టోల్ గేట్ల ద్వారా వసూలు చేస్తుండడంతో వ్యాపారాలు తగ్గడమేకాక వినియోగదారుడిపై అదనపు భారం పడుతుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

ట్రాక్టర్, నాపరాయి గనుల యజమానులు, కార్మికులు టోల్‌గేట్ వసూలును వ్యతిరేకిస్తున్నారు. టన్నుల ప్రకారంకాక ట్రాక్టరు, లారీల ప్రకారం వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బేతంచెర్ల రాయి కంటే స్థానిక గనుల్లో వచ్చే నాపరాయి గట్టితనం కావడంతో ఇక్కడి నుంచి రాజస్థాన్, తెలంగాణ ప్రాంతాలకు అధికంగా పాలిష్ చేసిన ఫ్లోరింగ్ రాయిని ఎగుమతి చేస్తుంటారు. వీటికి డిమాండ్ పెరగడంతో పాలిష్ కటింగ్ యంత్రాలు సైతం పెరిగిపోయాయి.

అదనపు భారం – తమిదెల ఉషారాణి, నాగలూటి సర్పంచి

టోల్ వసూలుతో వినియోగదారుడిపై అదనపు భారం పడుతుంది. వ్యాపారాలు తగ్గుతాయి. కార్మికులకు జీవనం కష్టంగా మారింది. గనుల నుంచి గోడరాయికి వినియోగదారుడు చెల్లించే డబ్బులతో యజమానికి సంబంధం ఉండదు. కార్మికులు తీసుకుంటారు. గనుల్లో బండ పరుపులో మొదట గోడరాయిని తొలగిస్తేనే ఫ్లోరింగ్‌కు సంబంధించిన రాయి వస్తుంది. గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టోల్ వసూలు చేసేవారు. 20 ఏళ్లుగా వసూలు నిలిపేశారు. ప్రస్తుతం టోల్‌గేట్ ఛార్జీలు అదనపు భారంగా మారాయి.

# దత్తత.. చట్టబద్ధత

చిత్తూరు : పుట్టగానే తల్లిదండ్రులను కోల్పోయిన వారు.. ఉన్నా ఆదరణ నోచకోక.. పొదల్లో పడేసిన వారు.. ఇలా ఎంతో మంది చిన్నారులు అనాథలుగా మిగులుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం శిశు విహార్ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఇక్కడ వసతి పొందుతున్న చిన్నారులను దత్తత ఇస్తున్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు ఇదో వరం. దీనిపై అవగాహన లేమితో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో అతి తక్కువ మందే ఇప్పటివరకు దత్తత వెళ్లడం ఈ విషయాన్ని స్పష్టంచేస్తోంది.

**రెండు చోట్ల..** తిరుపతి, చిత్తూరు జిల్లా కేంద్రాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశువిహార్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. చిత్తూరు జిల్లా సచివాలయం సమీపంలో ఉన్న కేంద్రంలో ఆరేళ్లలోపు చిన్నారులు 10 మంది ఉన్నారు. వీరిలో ఏడుగురు బాలికలు, ముగ్గురు బాలురు ఉన్నారు.

**అర్హతలు ఇవే..** దత్తత తీసుకునే వారు శారీరక దృఢత్వంతో, మానసిక జాగరూకతతో బిడ్డను తీర్చిదిద్దే ప్రేరణ ఉన్న వారై ఉండాలి. దంపతులిద్దరి అంగీకారం తప్పనిసరి. నిబంధనల ప్రకారం, ప్రమాణాలు అన్ని నెరవేర్చిన తర్వాత ఒంటరి లేదా విడాకుల పొందిన వ్యక్తి కూడా తీసుకోవచ్చు. ఒంటరిగా నివసించే మగ వ్యక్తి బాలికను దత్తత తీసుకునేందుకు అనర్హుడు.

**ఆసక్తి ఉంటే..**

పిల్లలను దత్తత తీసుకో వడంపై ఆసక్తి ఉంటే అంగన్‌వాడీ కేంద్రం, ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణ అధికారి కార్యాలయంలో సంప్రదించాలి. వెబ్‌సైట్: %www.cara.nic.in

రెండు రకాలుగా..ప్రభుత్వం దత్తత ప్రక్రియలో మార్పులు తీసుకొచ్చింది. తాజాగా పోస్టర్ కేర్, పోస్టర్ అడాప్షన్ విధానాల అమలుకు శ్రీకారం చుట్టింది. పోస్టర్‌కేర్‌లో భాగంగా చిన్నారులను రెండేళ్ల పాటు దత్తత ఇస్తారు. ఈ కాలంలో సంరక్షకులకు ప్రతి నెలా రూ. 4 వేలు ప్రభుత్వం అందిస్తుంది. హొమ్ స్టడీ కమిటీ సభ్యులు 30 రోజుల అనంతరం సంరక్షణ తీరును పరిశీలిస్తారు. రెండేళ్ల పాటు చిన్నారుల బాగోగులు చూసుకునే తల్లిదండ్రులకు వారిపై ప్రేమ పెరిగితే శాశ్వతంగా పోస్టర్ అడాప్షన్ కింద దత్తత తీసుకోవచ్చు.

**ఊయల ఏర్పాటు** పిల్లలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా జిల్లాల్లో పలు చోట్ల ఊయలలు ఏర్పాటుచేశారు. శిశుగృహ కేంద్రం (ఎం.ఆర్.పల్లి, తిరుపతి), చంద్రగిరి (పంచముఖ ఆంజనేయస్వామి గుడి), తిరుపతిలోని ఆర్టీసీ, అలిపిరి బస్టాండ్లు, పిచ్చాటూరు బస్టాండు, పీహెచ్‌సీలు – చెన్నూరు, వరగలి, చిల్లకూరు, చింతవరం.

శిశువిహార్‌లో అప్పగించండి : వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ, తిరుపతి

పిల్లలను వద్దనుకుంటే శిశువిహార్ కేంద్రాల్లో అప్పగించవచ్చు.

# దుకాణం.. పెట్టుబడిలేని వ్యాపారం



అమలాపురం : అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని వ్యాపార సముదాయాలు, దుకాణాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కొంత మంది కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. దీంతో పురపాలికకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. దుకాణాలను బహిరంగ వేలం ద్వారా ఎక్కువ మొత్తంలో పాడిన వారికి కేటాయిస్తారు. కొందరు రంగప్రవేశం చేసి పోటీ లేకుండా చేస్తున్నారు. అధికారులు సూచించిన మొత్తంపై కేవలం రూ. 500 నుంచి రూ.వెయ్యి వరకు పెంచి దక్కించుకుంటున్నారు. ఒక్కోసారి ఎవరూ వేలంలో పాల్గొనకుండా చేస్తున్నారు. తర్వాత సీల్డ్ టెండర్ విధానంలో అంతా ఒక్కటై తక్కువకు దక్కించుకుంటున్నారు. అనధికారిక వేలం నిర్వహించి బయటి వ్యక్తులకు ఎక్కువ మొత్తానికి అప్పగిస్తున్నారు.

**కళ్లెదుటే కనిపిస్తున్నా..**

పురపాలక సంఘం పరిధిలో నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌లలో 104 దుకాణాలు ఉన్నాయి. అద్దె రూపంలో ఏడాదికి రూ.కోటి ఆదాయం వస్తోంది. సబ్‌లీజుకు తీసుకుంటున్న వ్యక్తులు రూ. 1.50 కోట్లు చెల్లిస్తున్నట్లు అంచనా. ఏడాదికి రూ. 50 లక్షలు పక్కదారి పడుతున్నాయి. పురపాలక కమిషన్ నిర్మల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. దుకాణాలను నిబంధనల ప్రకారమే కేటాయిస్తున్నామన్నారు. సబ్‌లీజు గురించి తెలిసినా నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నామని పేర్కొన్నారు.

అమలాపురం పురపాలక సంఘానికి చెందిన పెద్ద దుకాణాన్ని నెలకు రూ. 78వేలకు ఓ గుత్తేదారులు టెండర్ ద్వారా దక్కించుకున్నాడు. తర్వాత అతను దానిని ఓ కార్పొరేట్ సంస్థకు నెలకు రూ.లక్ష చొప్పున సబ్‌లీజుకు అప్పగించాడు.

సర్క్యులర్ బజారులోని కాప్లెంక్స్‌లో పురపాలక సంఘం నిర్వహించిన వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారు అధిక అద్దెలకు సబ్‌లీజ్‌కు ఇచ్చారు. మార్కెట్ పరిధిలోని కాంప్లెక్స్‌లోనూ ఇదే తంతు. అమలాపురం మున్సిపాల్టీకి చెందిన పలు దుకాణాలు కొందరు నేతల చేతుల్లో ఉన్నాయి. వారు ఇతరులకు అధిక ధరకు అద్దెకు ఇచ్చి లాభం పొందుతున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లు: 4
దుకాణాలు: 104
ఏడాదికి అద్దె: రూ.కోటి(సుమారు)
సబ్‌లీజుకు ఇచ్చేవారు చెల్లించేది: రూ. 1.59 కోట్లు(అంచనా)
రిజర్వేషన్ వారీగా దుకాణాల కేటాయింపు(శాతంలో..)
ఎస్సీ: 15
ఎస్టీ: 8
దివ్యాంగులు: 3

# తినగ.. తినగ.. తేడాగా ఉండు!



కాకినాడ: తెల్లనివన్ని పాలు కావు.. నల్లనివన్ని నీళ్లు కావు.. కాదేదీ కల్తీలకు అనర్హమంటూ ఉప్పు, పప్పు నుంచి పండ్లు, మిఠాయిల వరకు అన్నింటా ఇదే దుస్థితి. కృత్రిమ రంగులతో పోషకాహారాన్ని కల్తీమయం చేసి వినియోగదారుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. కాకినాడ జిల్లాలో గత ఏడాది కాలంలో పరీక్షించిన నమూనాల్లో 30 శాతం పైగా కల్తీలేనని తేలడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో వేల సంఖ్యలో చిన్న, పెద్ద వ్యాపార, వాణిజ్య సంస్థలు, హొటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు ఉన్నాయి. ఏటా కొన్నింటే ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేపట్టి నమూనాలు పరీక్షిస్తున్నారు. ప్రమాణాలను పాటించనివారు కొందరైతే.. హానికలిగించే స్థాయిలో కల్తీకి పాల్పడుతున్నవారు ఇంకొందరు. ఆహార భద్రతా విభాగంలో సిబ్బంది కొరత కొందరికి కలిసివస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చాలావరకు సింథటిక్ కలర్లు, అనుమతించని రంగులు వినియోగిస్తున్నారు. వీటిని అదేపనిగా తింటే మూత్రపిండాలు, కిడ్నీలు త్వరగా పాడవతాయని వైద్యులు చెబుతున్నారు.

**ఇవిగో కొన్ని ఉదంతాలు..**

కాకినాడలోని ప్రతాప్‌నగర్‌లో పది నెలల క్రితం పాలను కల్తీ చేసి వాటితో పెరుగు తయారుచేసి హొటళ్లకు కుండలతో సరఫరా చేయడాన్ని గుర్తించి పట్టుకున్నారు. ఆ కుండలు సైతం బూజు పట్టేశాయి. ఇటీవల తునిలో పశువుల కొవ్వు నుంచి నూనె తయారీ కోసం డబ్బాల్లో కొవ్వును నింపి ఉంచగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వాటిని సబ్బుల తయారీకి పంపిస్తున్నామని చెబుతున్నా నకిలీ నూనె తయారీలోనే వాడుతారని స్థానికులు ఆరోపించారు.

నగరంలోని పెదమార్కెట్‌లో చిలగడ దుంపలకు ఎర్రటి రంగులు వేసి అమ్మకాలు చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. హొల్‌సేల్ వర్తకులే ఇలా పంపించారని చెప్పి ఆ వ్యాపారులు తప్పించుకున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

ఆహార కల్తీ తీవ్రతను బట్టి గరిష్ఠంగా రూ.లక్ష జరిమానా, ఆరు నెలల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే కేసులు నమోదు చేస్తాం. ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఏడాది కాలంలో 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం.

నందాజీ, సహాయ నియంత్రణాధికారి, ఆహార భద్రతా, ప్రమాణాలశాఖ

గత ఏడాది కాలంలో పరిశీలించిన నమూనాలు: 216
ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులు: 23
కల్తీ నిర్ధారణ జరిగినవి : 34
నమోదైన క్రిమినల్ కేసులు: 11

# ఆందోళన వీడు.. సఖి నీ తోడు

కాకినాడ : తల్లిదండ్రులు తిట్టారని క్షణికావేశంలో ఇంటి నుంచి కొంతమంది బాలికలు ఎవరికీ చెప్పకుండా వచ్చేస్తున్నారు. మహిళలు సైతం కొన్ని పరిస్థితుల్లో బయటకు వస్తున్నారు. తప్పిపోయిన, మతిస్థిమితం లేని, కిడ్నాప్ అయిన వారు ఉంటున్నారు. వీరు అసాంఘిక శక్తుల బారిన పడుతున్న సందర్భాలున్నాయి. అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బాధితులకు అండగా నిలుస్తోంది కాకినాడలోని సఖి వన్‌స్టాప్ సెంటర్. ఇక్కడ వారికి తాత్కాలిక వసతి అందిస్తున్నారు. అనారోగ్య, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స చేయిస్తున్నారు. తర్వాత కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు. ఎవరూ లేని వారైతే స్థానికంగా ఉన్న వసతిగృహాలకు పంపిస్తారు. కాకినాడ జీజీహెచ్‌లో 2017 ఆగస్టులో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ సెంటర్‌లో మొత్తం 14 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు.

బాలికలు, స్త్రీలపై జరిగే హింసను ఆపుదాం, వారికి అండగా ఉందాం అంటూ ఉద్యోగులు అవగాహన కల్పిస్తున్నారు.

**ఇవీ సేవలు...** ఇక్కడ బాధితులకు వీడియో కాన్ఫరెన్సు సౌకర్యం, పోలీసు రక్షణ, ప్రాసిక్యూషన్, వైద్య, న్యాయ సహాయం, ఎఫ్ఐఆర్ నమోదుకు సహకారం, ఆహారం, కౌన్సెలింగ్ చికిత్స, తాత్కాలిక వసతి, పునరావాసం, పిల్లల స్నేహ పూర్వక కోర్టు, అత్యవసర స్పందన వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.

**వారికి మద్దతుగా..** కుటుంబం, సమాజం, పనిస్థలాల్లో ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో హింసకు గురైన మహిళలు, బాలికలకు సమగ్ర మద్దతు ఇస్తాం. బాధితులకు 10 రోజుల పాటు తాత్కాలిక వసతి కల్పిస్తాం. మానసిక, సామాజిక సహాయం, కౌన్సెలింగ్, చట్టపరమైన సలహాలు,




తాత్కాలిక ఆశ్రయం, ఆహారం కల్పిస్తాం. తర్వాత కుటుంబసభ్యుల వద్దకు లేదా వసతిగృహాలకు పంపిస్తాం. శైలజ, అడ్మిన్, సఖి వన్‌స్టాప్ సెంటర్ సహాయానికి సంప్రదించాల్సిన నంబర్లు

టోల్ ఫ్రీ - 181
చైల్డ్ హెల్ప్‌లైన్ - 1098
అత్యవసరం - 100, 112
సఖి సెంటర్ - 08842380181

2017 నుంచి ఇప్పటివరకు సేవలు పొందిన బాధితులు
గృహహింస: 551 అత్యాచారం: 389 లైంగిక వేధింపులు: 66
యాసిడ్ దాడి–2 మహిళల అక్రమ రవాణా– 39
పిల్లలపై లైంగిక వేధింపులు–17 బాల్య వివాహాలు– 60 తప్పిపోయిన వారు– 163 కట్నవేధింపులు–3 ఇతర కేసులు 633

# గురుకులం.. అవస్థలమయం

డోన్ : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోంది. కానీ అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. డోన్‌లో రెండేళ్ల క్రితం డా.బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సొంత భవనం లేకపోవడంతో పట్టణ శివారులోని క్రీడా వికాస కేంద్రంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి స్థలాల పరిశీలనతోనే అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్ప విద్యార్థులు ఇక్కట్లను పట్టించుకోవడం లేదు.

**వైకాపా హయాంలో నిర్లక్ష్యం**

డోన్ పట్టణంలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 280 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గురుకులం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేవు. దీంతో గురుకుల పాఠశాల నిర్వహణను డోన్ పట్టణాని



కి 3 కి.మీ. దూరంలోని క్రీడా ప్రాంగణ భవనాల్లో సాగిస్తున్నారు. ఇక్కడ 15 ఏళ్ల క్రితమే పదెకరాల స్థలంలో స్టేడియం ఏర్పాటుకు అవసరమైన పెవిలియన్ భవనం, ఇండోర్ స్టేడియం, దుకాణ సముదాయాలతో పాటు పలు భవనాలు నిర్మించారు.

ఐదేళ్ల క్రితం వరకు ఇక్కడ క్రీడా సౌకర్యాలు ఉండటంతో పలు మండలాల క్రీడాకారులు వసతితో పాటు శిక్షణ పొందేవారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా క్రీడా ప్రాంగణ నిర్వహణ లోపించింది. క్రీడా పరికరాలు మంజూరు కాకపోవడం, శిక్షణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.

# స్మార్ట్ పేరుతో స్వాహా

రాజమహేంద్రవరం : దిల్లీ జనపథ్ తరహాలో నగరపాలికలు, పురపాలికల్లో రహదారులు నిర్మించేందుకు కేంద్రం గతంలో నిధులు కేటాయించింది. అందులో భాగంగా రాజమహేంద్రవరానికి రూ. 6కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో గత ప్రభుత్వ పాలనలో రాజమహేంద్రవరంలోని వై–జంక్షన్ నుంచి లాలాచెరువు వరకు స్మార్ట్‌రోడ్డు నిర్మించారు. గ్రాండ్ ట్రంక్ రోడ్డు అని పేరు పెట్టి గొప్పగా ప్రచారం చేశారు. తీరా ఆ రోడ్డు అత్యంత దయనీయంగా మారింది. స్మార్ట్ రోడ్డు పేరుతో నిధుల విషయంలో గోల్‌మాల్ జరిగిందనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలు గాలికి వదిలేసి గత ప్రభుత్వ నేతలు, గుత్తేదారులు జేబులు నింపుకొన్నారనే వాదన ఉంది.

**నిబంధనలకు నీళ్లు..**

నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలకు, సైకిళ్లకు ప్రత్యేకంగా రోడ్డు కేటాయించాలి. మధ్యలో పచ్చదనం పెంచేలా ఏర్పాటు చేయాలి. ఉదయం, సాయంత్రం నడకకు అనుకూలంగా సదుపాయాలు కల్పించాలి. ఇక్కడ మాత్రం అవేమీ జరగలేదు. తూతూమంత్రంగా వేసిన బ్రిక్స్ దిగబడ్డాయి. రోడ్డును ఆనుకుని అటానమస్ కళాశాల వరకూ అక్కడక్కడ మొక్కలు నాటి వదిలేశారు. కేంద్రం నిధులతో పాటు అదనంగా సాధారణ, ఆర్థిక సంఘం నుంచి రూ. 4 కోట్లు కేటాయించారు. వీటితో అలంకరణ, లైటింగ్ వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ వర్షం పడితే నీరు రహదారిపైనే నిలిచిపోతుంది. వాటర్ ఫౌంటేన్ కూడా పనిచేయట్లేదు. రూ. 10 కోట్లు కుమ్మరించి కనీస ప్రణాళిక లేకుండా నిర్మించారనే విమర్శలు ఉన్నాయి.

**విచారణకు డిమాండ్..**



గత పాలనలో నగరంలో ఎండ్ టు ఎండ్ రహదారుల పేరుతో రూ. 7 కోట్లతో పలు మార్గాల్లో 28 కి.మీ. మేర బ్రిక్స్ వేశారు. వాస్తవానికి రహదారి చివర 5 అడుగులు కేటాయించి అందులో గడ్డి, మొక్కలు పెంచాలి. దీంతో వాహనాల ఒత్తిడిని మొక్కలు తట్టుకుంటాయి. అవేమీ పట్టించుకోకుండా సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా కానిచ్చేశారు. ఇసుక, కంకర వేసి టైల్స్ వేయాల్సి ఉండగా ఇసుకే ఉపయోగించారు. వర్షాలకు ఇవన్నీ ఊడిపోయాయి. నామమాత్రపు పనులతో రూ.కోట్ల ధనం వృథా అయ్యింది. దీనిపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వాటిని చక్కదిద్ది, సుందరంగా తీర్చిదిద్దాలని నగరవాసులు కోరుతున్నారు.

# చూసేవారులేరని.. మేసేస్తున్నారు..!

పి.గన్నవరం : జిల్లాలో ఇసుక, మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోనే అధికారిక ఇసుక ర్యాంపులు ఉన్నాయి. ఇతర ప్రాంతాల్లో ఇసుక తవ్వేందుకు అనుమతులు లేవు. రాజకీయ బలంతో అక్రమార్కులు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి వరద కనిష్ఠస్థాయికి చేరడంతో అధికారిక ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్రమార్కులు సైతం తవ్వకాలకు సిద్ధమవుతున్నారు. పి.గన్నవరం మండలం ఊడుమూడిలంకలో వశిష్ఠ గోదావరి నదీతీరంలో వందల టిప్పర్లతో బాహాటంగా ఇసుక తరలించి జి.పెదపూడి, చాకలిపాలెంవద్ద అనధికారికంగా స్టాకు పాయింట్లు పెట్టారు. దీనిపై అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

విజయవాడ కేంద్రంగా..నెలరోజుల క్రితం నుంచే విజయవాడను కేంద్రంగా చేసుకుని పావులు కదుపుతున్నారు. లంకమట్టిని తరలించేందుకు తాత్కాలిక పర్మిట్లు ఇవ్వాలని కీలకశాఖ అధికారులను ఇప్పటికే సంప్రదించారు. దీనిపై ఆ శాఖ అధికారులు ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

తక్కువ సిబ్బంది..గనులశాఖలో సిబ్బంది కొరత ఉంది. సహాయ సంచాలకుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, కార్యాలయ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, క్షేత్రస్థాయిలో ఎ.డి, ఆర్.ఐ, సర్వేయర్ మాత్రమే ఉన్నారు.

నోటీసులు ఇచ్చినా...వరదల సీజన్‌కు ముందు జిల్లాలో 65,670 క్యూబిక్ మీటర్లమేర వనరులు అక్రమంగా తరలించారు. రూ. 3.35 కోట్లు అపరాధరుసుం చెల్లించాలని 18 కేసుల్లో పలువురికి నోటీసులు పంపించినా స్పందన లేదు.

ప్రత్యేక బృందానికి ప్రతిపాదనఅక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు అసిస్టెంట్ జియాలజిస్ట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్‌తో కూడిన అదనపు బృందాన్ని నియమించాలని ప్రతిపాదించనున్నట్లు జిల్లా గనులశాఖ ఏడీ ఎల్.వంశీధరరెడ్డి తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు.

చురకలు



## లెక్కల్లో తేడాలు.. పౌష్టికాహారం అందక చిక్కులు

అనంతపురం : జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారంలో మతలబు నెలకొంది. వారం రోజుల్లో అక్టోబరు నెల ముగియనున్నా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారింది. నిర్దేశిత ఇండెంట్ను దాదాపు సరఫరా చేసినట్లు 'ఆన్‌లైన్' లెక్కలు చెబుతున్నా.. అంగన్‌వాడీ కేంద్రాలకు అదే సంఖ్యలో చేరకపోవడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సదరు శాఖలో ప్రతి నెలా కోడిగుడ్లు, పాలు, బాల సంజీవని కిట్లు, బాలామృతం, బియ్యం, కందిపప్పు, వంటనూనె.. తదితర పౌష్టికాహారం పంపిణీ ప్రక్రియ అత్యంత కీలకం. మూడు వారాలు గడిచినా అత్యధిక శాతం లబ్ధిదారులకు సదరు పౌష్టికాహారం అందకపోవడం గమనార్హం.

**పంపిణీ తీరు..**

**మూడు సరుకులు:** జిల్లాలో గర్భిణి, బాలింతలు 23,275 మంది ఉన్నట్లు చూపిస్తున్నారు. బియ్యం 3 కిలోలు, కిలో కందిపప్పు, వంట నూనె ప్యాకెట్లను అదే సంఖ్యలో పంపాలి. ఇప్పటికీ జిల్లా అంతటా 72 శాతమే పంపిణీ నమోదైంది.

**బాలామృతం:** 3ఏళ్లలోపు పిల్లలకు బాలామృతం ఇవ్వాలి. 64,475 ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటికీ కంబదూరు, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలకు పూర్తిగా చేరలేదు. కొన్ని చోట్ల చేరినా పిల్లలకు ఇవ్వలేదు.

**బాలసంజీవని కిట్లు:** గర్భిణి, బాలింతలకు 23,175 కిట్లు పంపిణీ



జరగాలి. 68 శాతం సరఫరా చేసినట్లు ఆన్‌లైన్ లెక్క చెబుతోంది. ఉరవకొండలో 28 శాతం, అనంత అర్బన్‌లో 37, తాడిపత్రి, అనంత గ్రామీణం, రాయదుర్గం, గుత్తి ప్రాజెక్టుల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**పాలు:** జిల్లాంతటా 3.98 లక్షల లీటర్లు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటి దాకా 74 శాతమే అయింది. తాడిపత్రి, కణేకల్లు, గుతఇత, ఉరవకొండ, అనంత అర్బన్, గ్రామీణం, నార్పల, శింగనమల ప్రాజెక్టుల్లో నిర్దేశించిన మేర పాలు అందలేదు.

**కోడిగుడ్లు:** ప్రతి నెలా నాలుగు విడతల్లో గుడ్లను కేంద్రాలకు చేర్చాలి. ప్రస్తుతం నాల్గో విడత సరఫరా జరగాలి. తొలి విడతలో 14.12లక్షల గుడ్లను సరఫరా చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ తాడిపత్రి, అనంత అర్బన్, నార్పలకు ఇవ్వలేదు. రెండు, మూడో విడతలోనూ అంతే. మూడో విడత కింద 12.75లక్షల గుడ్లకు 73 శాతమే ఇచ్చారు. నాలుగో విడత కింద 22 శాతమే సరఫరా జరిగింది.

**కిట్లు ఏవీ?**

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణి, బాలింత, 3 ఏళ్లలోపు చిన్నారులకు ప్రతి నెలా మొదటి వారంలోనే ఇంటింటా సరకుల పంపిణీ చేయాలి. 3 నుంచి 6ఏళ్లలోపు పిల్లలకు కేంద్రాల్లోనే మధ్యాహ్నం వంట చేసి వడ్డించాలి. పౌర సరఫరాల శాఖలో తలెత్తిన సాంకేతిక సమస్య మూలంగా అంగన్‌వాడీల వేలిముద్రలు నమోదు కాలేదు. దీంతో బియ్యం, కందిపప్పు, నూనె పంపిణీలో జాప్యమైంది. మిగతా పాలు, గుడ్లు, కిట్లు, బాలామృతం.. పౌష్టికాహారం సైతం చాలా కేంద్రాలకు అందలేదు.

## ఉపాధికి ఊతం.. స్వచ్ఛతకు మార్గం

ఉరవకొండ: వ్యర్థాలు వృథాగా పడేయకుండా ఇంటివద్దే వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసుకుని ఆదాయం పొందే మార్గానికి కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. తద్వారా గ్రామాల్లో స్వచ్ఛత నెలకొనడంతోపాటు ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరనుంది. ఇళ్ల ముందు, పశువుల పాకల వద్ద ఉపాధి హామీ పథకంలో గుంతలు తవ్వుకునేలా జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే తగు చర్యలకు శ్రీకారం చుట్టింది.

**రెండు విధాలా ఆదాయం..**

జిల్లాలోని 31 మండలాల్లో 1,04,040 కంపోస్టు గుంతలు తవ్వించాలనేది ప్రభుత్వ లక్ష్యం. డ్వామా అధికారులు మొదటి విడతలో జిల్లాలో 2,911 గుంతలు మంజూరు చేయగా.. 982 మంది గుంతల తవ్వకాలు పూర్తిచేసుకున్నారు. ఉపాధి కార్డు కలిగిన కుటుంబ సభ్యులు స్వయంగా తవ్వకాలు చేసుకుని రూ.1600, పశువుల పాక వద్ద తవ్వుకున్న వారు రూ.800 వేతనం తీసుకోవడం గమనార్హం. దీనివల్ల ఉపాధి హామీ పథకంలో 'కూలి'తోపాటు కంపోస్టు ఎరువును



అమ్ముకోవడం వల్ల కూడా లబ్ధి పొందవచ్చు.

**మూడు నెలల్లో ఎరువు తయారీ**

ఇళ్ల వద్ద రింగ్ రూపంలో ఒక మీటరు లోతు, వెడల్పుతో రెండు గుంతలు, పశువుల పాకల వద్ద అయితే 1.5 మీటరు పొడవు, 1.5 మీటరు వెడల్పు, ఒక మీటరు లోతుతో గుంతను తవ్వుకోవాలి. వీటిల్లో క్రమం తప్పకుండా తడి, పొడి చెత్తలను వేస్తే మూడు నెలల్లో ఎరువు తయారవుతోంది. ఈ ఎరువును అవసరం మేరకు పొలాలు, కిచెన్ గార్డెన్‌కు తరలించుకోవచ్చు. మిగిలితే ఇతరులకు అమ్ముకుంటే ఆదాయం పొందే వీలుంది.

**చైతన్యం తీసుకొస్తాం**

కంపోస్టు గుంతల తవ్వకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా తవ్వకాల్లో ముమ్మరంగా చేయిస్తున్నాం. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామాల్లో వివరించాలని ఉపాధి యంత్రాంగాన్ని ఆదేశించాం. ప్రజలు ముందుకొచ్చి గుంతలు తవ్వుకుని తద్వారా స్వచ్ఛతతోపాటు ఉపాధిని పొందాలి. సలీంబాషా, డ్వామా పీడీ

# రేషన్ మాఫియా బరితెగింపు



అనంతపురం : కూడేరు, విడపనకల్లు మండలాల పరిధిలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. గతంలో ఆగిపోయిన అక్రమ రవాణా రెండు నెలలుగా జోరుగా సాగుతోంది.

తాడిపత్రి పరిధిలో స్థానిక నాయకుల కనుసన్నల్లో పేదల బియ్యం తమిళనాడుకు తరలిపోతోంది. ఇంకొందరు బనగానపల్లిలోని మిల్లులకు తరలించి.. పాలిష్ చేసి వివిధ బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు. యల్లనూరు, పుట్లూరు, పామిడి మండలాల్లో కొందరు రాత్రి వేళల్లో రహస్యంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. జాతీయ రహదారి మీదుగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

జిల్లాలో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ మాఫియా జాతీయ రహదారుల మీదుగానే బియ్యాన్ని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆయా మార్గాల్లో పోలీసులు.. అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నెలవారీగా మామూళ్లు తీసుకుంటూ కొందరు మాఫియాతో చేతులు కలిపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడపాదడపా విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. అధికారులు, పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే రేషన్ మాఫియా రెచ్చిపోతోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

**స్టాక్ పాయింట్ల నుంచే..**

గతంలో కార్డుదారుల నుంచి కిలోకు కొంతమొత్తం చెల్లించి బియ్యాన్ని సేకరించేవారు. ఇప్పుడు మరో అక్రమార్గాన్ని ఎంచుకున్నారు. కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయిన స్థానిక నాయకులు నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే బియ్యాన్ని తరలిస్తున్నారు. ఆయా పాయింట్లలో డీలర్లకు బియ్యం సరఫరా చేసే సమయంలో బస్తాకు 2, 3 కిలోలు తగ్గించి ఇస్తున్నారు. దీంతోపాటు కొందరు డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ ఒక్కో కార్డుదారుడి నుంచి సగటున 2 కిలోలు దోచుకుంటున్నారు. ఇలా మిగిలిన బియ్యాన్ని ప్రతి నెలా మొదటివారంలో రేషన్ మాఫియాకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు.

**తాడిపత్రిలో ఇష్టారాజ్యం**

యాడికి కేంద్రంగా మాఫియా రెచ్చిపోతోంది. తాడిపత్రి, యల్లనూరు, పుట్లూరు, పామిడి, గుత్తి ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని యాడికిలో డంప్ చేస్తున్నారు. ఇటీవల ఓ మిల్లులో భారీ మొత్తంలో రేషన్‌బియాన్ని అధికారులు పట్టుకున్నారు. తాడిపత్రి పట్టణానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అక్రమ రవాణా సాగుతోంది. కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు ఇచ్చి బియ్యం సేకరిస్తున్నారు. అధికార పార్టీ కావడంతో పోలీసులు సైతం అడ్డుకునేందుకు ప్రయత్నించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నిఘా పెట్టాం..**

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టాం. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. మాఫియాకు స్థానికంగా పోలీసులు సహకరిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు.

జగదీశ్, ఎస్పీ, అనంతపురం

## వందేళ్ల వేడుక.. చేయాలి ఏర్పాట్లు చకచకా..



పుట్టపర్తి : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు వచ్చే నెలలో జరగనున్నాయి. ప్రముఖులు, దేశ, విదేశాలకు చెందిన భక్తులు పుట్టపర్తికి రానున్నారు. నవంబరు 15 నుంచి 25 వరకు జరగనున్న ఉత్సవాలకు 21 రోజులు మాత్రమే గడువు ఉంది. ఆ దిశగా పాలకులు, అధికారులు దృష్టి సారించి పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

**క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి..**

పుట్టపర్తి పురపాలిక పరిధిలో ప్రశాంతి నిలయం పడమర రహదారి పనులు ప్రారంభించారు. నవంబరు మొదటి వారానికి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. జాయ్ అలూకాస్ సంస్థ సహకారంతో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టిన చిత్రావతి నది సుందరీకరణ పనులు సాగుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే సంస్థ గుత్తేదారుల సహకారంతో నగర సుందరీకరణ పనులు మరింత వేగం పెంచాల్సి ఉంది. భక్తుల భద్రతకు సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

**చేపట్టాల్సినవి..**

భక్తులు, పర్యాటకులకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్లు, స్నానపు ఘట్టాలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి.

మూతబడిన సామూహిక మురుగుదొడ్లకు వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారులకు గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేయాలి.

శుద్ధిప్లాంట్ల మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడంతో మురుగు చిత్రావతి నదిలోకి కలుస్తోంది. వెంటనే చర్యలు చేపట్టాలి.

**ట్రాఫిక్ క్రమబద్ధీకరణ..**

పుట్టపర్తిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు.. పార్కింగ్ ప్రాంతాల నుంచి భక్తులు ప్రశాంతినిలయం చేరుకునేలా రవాణా వ్యవస్థకు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది. వేడుకల వివరాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలి.

## గాడితప్పుతోన్న క్రమశిక్షణ

పుట్టపర్తి : ఈనెల 12న పుట్టపర్తి మండలం కంబాలపర్తి ప్రాథమిక పాఠశాలలో కొందరు విద్యార్థులు కిటికీ తలుపులు ధ్వంసం చేసి.. కోడిగుడ్లను పగులగొట్టారు. అంతటితో ఆగక.. దస్త్రాలు, పరీక్ష సామగ్రిని కోడిగుడ్లతో కొట్టి తడిపేశారు. చిక్కీలను మరుగుదొడ్లలో పడేశారు ఒకప్పుడు గురువు మాటంటే శాసనం. నేడు.. ఆ గౌరవం గాలిలో కలిసిపోతోందన్నది వాస్తవం. ఉపాధ్యాయులు పిల్లలకు అక్షర జ్ఞానం నేర్పుతారు. కానీ, ఆ జ్ఞానానికి విలువ నేర్పాల్సింది తల్లిదండ్రులే. పాఠశాలలో నేర్పే పాఠాలకు బలమైన నీతి పునాది పడాల్సింది ఇంట్లోనే. లేదంటే.. విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగలేడు. బడిలో పిల్లలు ఏ చిన్న తప్పుచేసినా ఉపాధ్యాయుడు సరిదిద్దేందుకు ప్రయత్నిస్తే చాలు.. కొందరు తల్లిదండ్రులు ప్రత్యక్షమై ఎందుకిలా శిక్షించావని ప్రశ్నిస్తున్నారు. దీంతో విద్యార్థులు మరింత రెచ్చిపోతున్నారు. నల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థి చొక్కా గుండీ సరిగ్గా పెట్టుకోమన్నందుకు ఉపాధ్యాయుడిపైనే దాడి చేసి గాయపరిచాడు. ఇవి మచ్చుకు కొన్నే.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

**తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి**

పిల్లలు క్రమశిక్షణారాహిత్యంగా ప్రవర్తించడాన్ని కాండక్ట్ డిజార్డర్ అంటారు. ఇది 8 నుంచి 12 ఏళ్ల వయసువారిలో ఉంటుంది. ఎదురుతిరిగే స్వభావం, గొడవలు పెట్టుకోవడం, డిమాండ్ చేసే వ్యక్తిత్వం, అబద్ధాలు చెప్పడం చేస్తుంటారు. దీనికి ప్రధానంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే కారణం. ఈ పరిస్థితుల్లో వారిని సమర్థిస్తే అది మరింత ప్రమాదకరం. ఈ దశలోనే తల్లిదండ్రులు గమనించి మానసిక వైద్య నిపుణులకు చూపిస్తే మార్పు ఉ



ంటుంది. తల్లిదండ్రులు పట్టించుకోకపోతే 16 ఏళ్ల తర్వాత పర్సనాలిటీ డిజార్డర్‌గా మారుతుంది. వివాహమయ్యాక కూడా వారు సమస్యల్లో చిక్కుకుని భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. శిక్షకంటే ప్రేమతో అర్థం చేసుకోవడం ద్వారా పిల్లల మనసు మారుతుంది. డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు

**విలువల పాఠాలు చెబుతాం**

ప్రతి పాఠశాలలో విలువల పాఠాలు తప్పనిసరి చేస్తాం. పిల్లల్లో సంస్కారం, బాధ్యత, సహనం పెంపొందించేందుకు కృషి చేస్తాం. తల్లిదండ్రులు, గురువులు కలిసి విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటాం. కిష్టప్ప, జిల్లా విద్యాశాఖాధికారి

జిల్లా: శ్రీసత్యసాయి

ప్రభుత్వ పాఠశాలలు: 2,094

ప్రైవేటువి: 484

మొత్తం విద్యార్థులు: 2,44,797

## పాపం.. మర్మం తెలియని మగ్గం

నగరి : నాడు నగరిలో చేనేత కార్మికునిగా జీవించే నేతన్న ఒక అడుగు ముందుకేసి మరమగ్గం వైపు నడిచారు. వస్త్ర ఉత్పత్తిలో రాష్ట్రాన్ని ఒక స్థానంలో నిలబెట్టారు. విదేశీ మారకద్రవ్యం ఆర్జించి ఆర్థికంగానూ గుర్తింపు తెచ్చారు. నగరిలో మర మగ్గ పరిశ్రమ అంటే దక్షిణ భారతదేశంలోనే ఒక మణిహారం. మారుతున్న కాలంతో పాటు ఆధునికతను అందిపుచ్చుకోవడంలో నగరి వెనుకబడింది. కుటుంబమంతా శ్రమించినా కష్టమే మిగులుతోంది.

**ప్రధాన సమస్య..**

వస్త్ర ఉత్పత్తిలో ప్రధాన క్రతువు రంగులు వేయడం. ఇందుకు వాడే రసాయనాల వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అవుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈటీపీ ప్లాంట్‌లో



పరికరాలు, మోటార్లు తుప్పు పట్టడంతో నామమాత్రంగా రసాయనాలను శుద్ధి చేస్తోంది.

**పరిశ్రమ నిలబడాలంటే..**

సుమారు 40 వేల మంది కార్మికులకు జీవనోపాధి కల్పించే పరిశ్రమ బతకాలంటే ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలి. కాలుష్య సమస్య పరిష్కారానికి తమిళనాడులో అమలు చేస్తున్నట్టుగా సీఈటీపీ ప్లాంట్, జడ్ఎల్‌డీ విధానంతో నడిపించే యూనిట్‌ను నెలకొల్పాలి. దీనికి వీకేఆర్‌పురం వద్ద ఏపీఐఐసీకి చెందిన 150 ఎకరాల భూమి అందుబాటులో ఉంది.

తయారయ్యే వస్త్రాలు : షర్టింగ్, చీరలు,చుడీదార్, పంచెలు, లుంగీలు

ఎగుమతులు: జపాన్, అమెరికా, యూరప్

స్వదేశీ మార్కెట్: చెన్నై, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్

ప్రభుత్వ ప్రోత్సాహం: 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు జీఓలో పేర్కొన్నారు.

వస్త్ర ఉత్పత్తి కేంద్రాలు: నగరి, పుత్తూరు, చింతలపట్టడ, ఏకాంబరకుప్పం, పుదుపేట, సత్రవాడ, కేవీపీఆర్‌పేట

మర మగ్గాల సంఖ్య: 9 వేలు

ఆధునిక మరమగ్గాలు : 120

కుటుంబాల సంఖ్య: 16 వేలు

ఏడాదిలో లావాదేవీలు: రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లు

## కొయ్య బొమ్మలకు కొత్త ఆశలు

తిరుపతి : తిరుపతి జిల్లా పరిధిలో కొయ్య బొమ్మల తయారీ (కార్వింగ్) కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. బొమ్మల తయారీకి అవసరమైన చెక్కలు, కొయ్యలు సరఫరా చేసి, వాటితో వివిధ కళారూపాలను తయారు చేసేలా కళాకారులకు చేయూత ఇస్తారు. తద్వారా వాటి ఆకృతులకు డిమాండ్ కల్పించి మార్కెటింగ్ చేసేలా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఉడ్ బ్యాంక్ ఏర్పాటు విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది.

**ఉడ్ బ్యాంకు ఏర్పాటు ఇలా..** శ్రీకాళహస్తి, శెట్టిగుంట, మాధవమాలలో సుమారు వెయ్యి కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కొయ్య బొమ్మల తయారీపై ఆధారపడ్డాయి. వీరికి ముడిసరకు (ఉడ్) సమకూర్చుకోవడం సమస్యాత్మకంగా ఉంది. కళాకారులు బొమ్మల తయారీకి ప్రధానంగా మోగి, వేప, పనస, ఎర్ర చందనం, టేకు, మహోగని పలపను ఉపయోగిస్తారు. కలప కోసం అడవులపై ఆధారపడాలి. అందుకు అటవీ శాఖ అనుమతులు రావడం అంత సులువు కాదు. ఈ ఇబ్బందులను దూరం చేసి, ప్రభుత్వమే అటవీ శాఖ ద్వారా కలపను సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ, అటవీ శాఖ సలహాదారు, మాజీ పీసీసీఎఫ్ పి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీ



ఏర్పాటైంది. జాతీయ రహదారుల నిర్మాణాల కోసం కేటాయించే అటవీ భూముల్లో తొలగించే చెట్లు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూలిపోయే వృక్షాలను సమీకరించి, వాటితో తిరుపతి పరిధిలో ఉడ్ బ్యాంకును ఏర్పాటు చేస్తారు.

**ఎర్రచందనం కేటాయింపుపైనా..**

ఇటీవల అమరావతి కేంద్రంగా సీఎం నేతృత్వంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఇదే అంశాన్ని జిల్లా కలెక్టర్ ప్రస్తావించారు. ఒక్కో కళాకారుడికి 20 కిలోల ఎర్రచందనం కలపను అందించి శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమలు తయారు చేయించాలన్నది లక్ష్యం. విధివిధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీ అధ్యయనం చేస్తోంది. తిరుపతి ఎర్రచందనం గోదాముల పరిధిలోనే కళాకారులకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, బొమ్మల తయారీకి అవకాశం కల్పించాలని కళాకారులు ప్రభుత్వాన్ని కోరారు.

## నిల్వకు వీల్లేక.. నీరంతా సముద్రంలోకే..

గూడూరు : వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీకి గురువారం మధ్యాహ్నం వరకు వరద మరింత పోటెత్తింది. దీంతో 7 గేట్లు ఎత్తివేసి దిగువకు 8 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. మరో వైపు బ్యారేజీ పరిధిలోని చెరువులకు కాలువ ద్వారా 500 క్యూసెక్కులను వదిలారు. నాలుగు రోజులుగా బ్యారేజీకి వరద వస్తుండటంతో తొలుత రెండు, ఆ తర్వాత మరో ఐదు గేట్లు తెరిచారు. నాలుగు రోజులుగా 25 వేల క్యూసెక్కుల వరదనీరు సముద్రం పాలైంది. బ్యారేజీ వద్ద గేట్ల ఎత్తు పెంచక నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేక ఏటా వేలాది క్యూసెక్కులు సముద్రం పాలవుతున్నాయి. 17 ఏళ్లుగా..: 17 ఏళ్ల కిందట అప్పటి పాలకులు బ్యారేజీ గేట్లు ఒకటిన్నర అడుగు ఎత్తు పెంచాలని ప్రతిపాదించారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఏటా వేలాది క్యూసెక్కుల వరద నీరు వృథా అవుతోంది. కూటమి ప్రభుత్వమైనా ఈ దిశగా ఆలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు. తద్వారా మరో 10వేల ఎకరాలకు సాగు నీటిని అందించవచ్చని ఇంజినీర్లు చెబుతున్నారు.

## మాయ చేస్తారు.. లాగేస్తారు

భీమవరం : భీమవరం ఒకటో పట్టణ పోలీసులు వలపన్ని పట్టుకున్న చరవాణుల అపహరణ ముఠా గుట్టురట్టుతో ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఒక్క ప్రాంతానికే ముఠాలు పరిమితం కావని, రాష్ట్రంలోని పలుచోట్ల బృందాలుగా ఉంటూ చోరీలు చేయిస్తూ.. అపహరించిన చరవాణులను సేకరించుకుంటాయని విచారణలో వెల్లడైంది. ఇలాంటి ముఠాల ఆటకట్టించేందుకు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు బృందాలను నియమించారు. తెర వెనుక ఉంటూ చరవాణుల్లోనే కథ నడిపిస్తున్న ముఠా నాయకులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. చరవాణులు పోతే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులను ఆదేశించారు.

ఒడిశా ముఠాలు చిన్నారులను పావులుగా వాడుకుంటాయి. వాళ్లతో దొంగతనం చేయించాక వస్తువును ముఠా సభ్యులు తీసుకెళ్లిపోతారు. ఒక్కోసారి పిల్లలు దొరికిపోతే కొందరు దెబ్బలు కొట్టి వదిలేస్తారు. ఒకవేళ పోలీసులకు అప్పగించినా.. సముదాయించే వ్యక్తి ఒకరు వచ్చి.. నచ్చజెప్పి తీసుకెళ్లిపోతారు. పట్టుబడిన పిల్లలెవరూ ముఠా నిజాలు బహిర్గతం చేయకపోవడం విశేషం. భీమవరం, తణుకు ప్రాంతాల్లో ఇటీవల ఇద్దరిని పోలీసులు విడిచిపెట్టకుండా జువెనైల్




హోంకు పంపించారు.

**క్షణాల్లో పని కానిచ్చి..**

ఆకివీడు, గోకవరం, తాడేపల్లిగూడెం యాగర్లపల్లి, విజయనగరం జిల్లా చింతలవలస, తూర్పుగోదావరిలోని బిక్కవోలు తదితర ప్రాంతాలకు చెందిన ఒకే తెగకు చెందిన ముఠాలు ఇలాంటి చోరీల్లో ఎక్కువగా పాల్గొంటాయి. పురుషులు, మహిళలు పిల్లల్ని వెంటబెట్టుకుని వస్తారు. క్షణాల్లో పని కానిచ్చేసి తప్పించుకుంటారు.

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

దొంగిలించిన చరవాణులతో వేర్వేరు చోట్ల ఉన్నవాళ్లంతా ఓ చోటకు చేరతారు. వాటిని ప్రధాన సూత్రధారి అనుచరులు సేకరించి దొంగలకు నగదు ఇస్తారు. వాటిని కేరళ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, దిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.

**మోసాల్లో అనేక రకాలు** జనం ఎక్కువగా ఉన్నచోట ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోతున్నట్టు నటిస్తాడు. ఆ సమయంలో సాయం చేసేందుకు వచ్చినవారికి తెలియ కుండా చరవాణి కొట్టేస్తాడు. ఒక్కోచోట రూ.50, రూ.100 పడేస్తాడు.. నడిచి వెళ్తున్న వారిని పిలిచి మీ జేబులో డబ్బులు పడిపోయాయి అనగానే అతడు వంగి తీసుకునేంతలో చరవాణి లాగేస్తారు. రద్దీగా ఉండే మార్కెట్‌లో దృష్టి అంతా సరకులపై ఉన్నవారిని, బస్సు ఎక్కే సమయంలో హడావుడిగా ఉన్నవారిని గుర్తించి అపహరిస్తారు. బాధితు డికి ఏమాత్రం అనుమానం రాకుండా అపహరించేందుకు, తీస్తున్నది కనిపించకుండా కాగితం, తువ్వాలు, పాలిథిన్ సంచో అడ్డం పెట్టుకుంటారు.

## నిధులు రాక.. సమస్యలు తీరక

గజపతినగరం : గత ప్రభుత్వ నిర్వాకం నేటికీ శాపంలా వెంటాడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, రన్నింగ్ వాటర్, పైకప్పు మరమ్మతులు, అవసరాల మేరకు చిన్న నిర్మాణాలు చేసుకునేందుకు నాడు– నేడు పథకంలో పనులు మంజూరు చేశారు. జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 16 పీహెచ్‌సీలకు రూ.5.62 కోట్లు విడుదలయ్యాయి. కొంతమేర పనులు చేసిన అనంతరం నిధులు రాకపోవడంతో గుత్తేదార్లు మధ్యలో వదిలేశారు.

భవనాలు కారిపోతున్నాయ్..

మూడు నుంచి ఆరు వరకు పనులను ఒక ప్యాకేజీగా పనులు అప్పగించారు. ముందుగా ప్రారంభించిన గుత్తేదారులు రంగులు వేశారు. అనంతరం విద్యుత్తు, రన్నింగ్ వాటర్, పైకప్పు శ్లాబు పనులు చేయించారు. మరుపల్లి, దత్తిరాజేరు, కె.కొత్తవలస, బొండపల్లి పీహెచ్‌సీల పైకప్పులు బాగులేవు. దీంతో పై పొర పనులు చేయించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించడంతో వర్షం కురిస్తే కారిపోతున్నాయి. దేవుపల్లి, మెంటాడలో సామగ్రి భద్రపర్చేందుకు, అత్యవసర సమయాల్లో



రోగులను వేరుగా ఉంచి వైద్యం చేయించేందుకు షెడ్లు నిర్మించారు. వీటికి విద్యుత్తు సౌకర్యం లేదు. తలుపులు వేయలేదు. కేంద్రాల్లోని మరుగుదొడ్లకు నీరు రాని పరిస్థితి.

సౌకర్యాలు ఊసేలేదు..

నాడు– నేడులో పీహెచ్‌సీల్లో అదనపు గదుల ఏర్పాటును ఎక్కడా ప్రారంభించలేదు. ముందుగా మరమ్మతులు మాత్రమే చేశారు. మంచాలు, పరుపులు, ఇతర సౌకర్యాల విషయం పట్టించుకోలేదు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. పేరుకే నిధులు వెచ్చించారని, వసతులు ఏమాత్రం పెరగలేదని సిబ్బంది, వైద్యులు అంటున్నారు. నిధులు రాకపోవడంతోనే పనులు నిలిపివేసినట్లు గుత్తేదారులు చెబుతున్నారు.

కొత్తగా మంజూరు కావాల్సిఉంది..నాడు– నేడు పథకంలో పీహెచ్‌సీలకు మంజూరు చేసిన నిధుల్లో మరమ్మతుల పనులు చేయించాం. మిగలినవి రద్దయ్యాయి. గుత్తేదారులకు నిధులు చెల్లింపులు చేశాం. కొత్త మంజూరులు వస్తే తప్ప మిగిలిన పనులు చేసే అవకాశం లేదు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## వేగ నిరోధకం.. వెన్నుపోటు



నంద్యాల : సాఫీగా సాగిపోయే ప్రయాణం.. ఒక్కసారిగా ఊహించని కుదుపులు.. ఇంకేముంది.. గాల్లో తేలినట్లుందే.. గుండె జారినట్లుందే అన్న రీతిన వాహనచోదకులు అడుగు ఎత్తులేచి రోడ్డుపై పడుతున్నారు.. ఆ వెంటనే అదుపుతప్పి బోల్తా కొడుతున్నారు. వెన్నుపూస దెబ్బతిని ఆసుపత్రి పాలవుతున్నారు.. ప్రమాణాలు పాటించకుండా.. సూచికలు ఏర్పాటు చేయకుండా వేస్తున్న వేగనిరోధకాలతో బళ్లూ, వాహనదారుల దేహాలు.. రెండూ గుల్లవుతున్నాయి.

**కట్టల్లా కట్టేస్తున్నారు**

వేగ నిరోధకాల నిర్మాణం ఇష్టారాజ్యంగా, నిబంధనలు పాటించకుండా ఎత్తుగా నిర్మిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 60 శాతం వరకు ఇలానే ఉన్నాయని ఇటీవల అధికారులు నిర్వహించిన సర్వేలో తేలింది. పట్టణ వీధుల్లో సీసీ రహదారులపై ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఎవరి ఇళ్లముందు వాళ్లు అనధికారికంగా ఏర్పాటు చేసుకొంటున్నారు. జాతీయ రహదారులపై ఎక్కడా వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకూడదు. కానీ కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం, బొగ్గులైన్, కలెక్టరేట్ వద్ద వీటిని నిర్మించారు.

ఎక్కడ నిర్మించాలంటే..

ప్రధాన రహదారిలో చిన్న మార్గాలు కలిసే చోట, జంక్షన్ల వద్ద

విద్యా సంస్థలు, వైద్యశాలలు, వంతెనలు, మలుపులున్న ప్రాంతంలో నివాసాలెక్కువగా ఉండి పాదచారులు తిరిగే చోట

బళ్లూ.. ఒళ్లూ హూనం

ఎత్తుగా నిర్మించిన వేగ నిరోధకాలపై వెళ్తే కుదుపులకు శరీరభాగాలు దెబ్బతింటున్నాయి. లావుగా ఉన్నవారికి మరింత ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

అతివేగంగా వెళ్తూ ఒక్కసారిగా వేగ నిరోధకం ఎక్కించి బ్రేక్ వేయడంతో మెడ, వెన్నెముకపై ప్రభావం పడుతుంది. వెన్నుపూసలో కాట్‌జల్, డిస్కులు దెబ్బతింటాయి. సయాటికాకు గురవుతున్నారు. ఇలాంటి బాధలతో నెలకు వంద మంది రోగులు కర్నూలు వైద్యాశాలకు వస్తుంటారని న్యూరో ఫిజీషియన్ విభాగం వైద్యులు చెబుతున్నారు.

వాహనాల ఇంజిన్లు వేగ నిరోధకాలకు తగిలి పగులుతున్నాయి. షాక్ అబ్జార్స్ విపరీతంగా దెబ్బతింటున్నాయి. టైర్లు అరిగిపోతున్నాయి.. బ్రేకుల సమస్య తలెత్తుతోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి

ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ)) విధానం కచ్చితంగా పాటించాలి.

వాహనాల బంపర్లకు తగలకుండా ఉండాలి.

10 సెం.మీ. ఎత్తు, 3.7 మీటర్ల పొడవు, 1.7 మీటర్ల రేడియస్ (వ్యాసార్ధం)తో నిర్మించాలి. ఫలితంగా గంటకు 25 కి.మీ. వేగాన్ని నిరోధకాలు అదుపు చేసేందుకు వీలుంటుంది.

వేగ నిరోధకానికి 40 మీటర్ల ముందే సూచికలు పెట్టాలి.

ఒకే రహదారిలో రెండు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాల్సి వస్తే వాటి మధ్య దూరం 100–150 మీటర్లు కచ్చితంగా ఉండాలి.

## పండగ వంట.. కల్తీల తంట



కర్నూలు: దసరా పండగ వచ్చిందంటే.. ప్రతి ఇంటా సందడి నెలకొంటుంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కుమార్తెలు, అల్లుళ్లు.. బంధువులు వస్తారు. దీంతో ప్రతి కుటుంబంలో తమ స్థాయికి తగ్గట్టు పిండివంటలు చేసుకుని సంతోషంగా ఆరగిస్తారు. పండగ సమీపించడంతో చాలామంది మార్కెట్‌కు వెళ్లి అవసరమైన సరకులు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు కల్తీ వస్తువులతో మార్కెట్‌ను నింపేశారు. నూనెలు, బెల్లం, మసాలా దినుసులు, నెయ్యి.. ప్రతీది కల్తీ చేసి విక్రయిస్తున్నారు. వీటితో తయారు చేసిన వంటలను తింటే అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. కల్తీలను కనిపెట్టొచ్చని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

**రంగు మారుతోంది**

మార్కెట్‌లో కల్తీ చేసే వాటిలో నూనెలు మొదటి వరుసలో ఉంటాయి. హోల్‌సేల్ వ్యాపారులు నూనె ట్యాంకర్లను తెప్పించుకొంటున్నారు. వాటితో పాటు పత్తిగింజల నూనె, పామాయిల్, ఇతర నాసిరకం నూనెలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతినెలా సుమారు 8 వేల టన్నుల నూనెల విక్రయాలు జరుగుతున్నాయి. ఇందులో కల్తీ నూనెలే సుమారు 2 వేల టన్నుల వరకు ఉంటాయని అంచనా. 70 శాతానికి పైగా హోటళ్లలో నాణ్యమైన నూనె వాడటం లేదు.కల్తీని కనిపెట్టాలంటే.. కొద్దిగా నూనెను తీసుకుని 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం, కాస్త చక్కెర కలిపితే అడుగున గులాబీ లేదా ఎరుపు రంగు ఏర్పడుతుంది. అలా జరిగితే అది నాసిరకమని గుర్తించాలి.

**బెల్లం.. అంతా మోసం**

పండగ వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో బెల్లం ఉండాల్సిందే. నాణ్యమైన బెల్లం కిలో రూ.80– 120 ధర పలుకుతోంది. చక్కెరను కిలో రూ.40–45తో విక్రయిస్తున్నారు. దీంతో కొందరు చక్కెరతో అచ్చులను తయారుచేసి బెల్లం రంగు పూత పూస్తున్నారు. పంచదారతో చేసిన ఈ బెల్లం అచ్చులను కిలో రూ.50– 60తో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుందని చాలామంది దీన్నే కొనుగోలు చేస్తున్నారు.

ఈ నాసిరకం బెల్లాన్ని గ్లాసు నీటిలో వేస్తే రంగుపోయి పంచదార అచ్చు ముద్దగా మారుతుంది. చక్కెర, కృత్రిమ రంగులతో తయారు చేసిన దీన్ని తినడం వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**తింటే వికారం**

రోజువారీ వంటల్లో తప్పనిసరిగా వాడే పదార్థాల్లో కారంపొడి ముఖ్యమైంది. రకరకాల పదార్థాలు, రసాయనాలు కలిపి నకిలీ కారం పొడులు తయారు చేస్తున్నారు. ఇందుకోసం మిరపకాయల తొడిమలు, చెక్క పిండి, రెడ్ ఆక్సైడ్, ఇతర ప్రమాదకరమైన రంగులు వినియోగిస్తున్నారు. వీటిని రకరకాల బ్రాండ్లతో విక్రయిస్తున్నారు. నాణ్యమైన కారం కిలో రూ.250 నుంచి రూ.300 ధర పలుకుతోంది. నాసిరకం కారం మాత్రం కిలో రూ.150– 200లోపే విక్రయిస్తున్నారు. దీంతో హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో దీన్నే ఎక్కువ వినియోగిస్తున్నారు. కిరాణా దుకాణాల్లో సైతం ఈ నాసిరకం కారం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

**ఫిర్యాదు చేయండి**

నాణ్యత లేని ఆహార పదార్థాలు, నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిస్తే.. 9441439787 నంబరుకు ఫోన్‌చేసి అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఆహార భద్రతాధికారి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు చేయించి బాధ్యులైన వారిపై చర్యలు చేపడతారు.

**మెరుపు ముంచేస్తుంది**

కొందరు వ్యాపారులు కంది, పెసర, మినుము వంటి పప్పు దినుసులకు మెరుపు వచ్చేలా నూనె పూస్తుంటారు. కేసరి పప్పునకు మెటానిల్ ఎల్లో రంగు కలుపుతారు. భూతద్దం సాయంతో దీనిని గుర్తించవచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా పప్పును తీసుకొని అందులో నీరు కలపాలి. వాటికి 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరిక్ ఆమ్లం కలపాలి. పది నిమిషాల తర్వాత గులాబీ రంగులోకి మారితే అది కల్తీ అయినట్లు లెక్క. శనగపిండిలో బఠానీల పిండి కలిపేస్తున్నారు.

**నూనెలతో నెయ్యి**

నెయ్యిలో కొన్ని రకాల నూనెలు కలుపుతున్నారు. మంచి వాసన వచ్చేందుకు రసాయనాలు, సెంటు కలిపి తక్కువ ధరలకు అంటగడుతున్నారు. **అరటి బోదెల గుజ్జుతో అల్లం వెల్లుల్లి పేస్ట్**

ప్రస్తుతం మార్కెట్‌లో అల్లం, వెల్లుల్లి మిశ్రమం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అక్రమార్కులు అల్లం, వెల్లుల్లితో పాలు అరటి కాండంతో చేసిన గుజ్జును కలిపి నాసిరకం మిశ్రమం తయారు చేస్తున్నారు.

## లస్కర్ల కొరత.. సాగునీటికి అవస్థ

రేగిడి : మడ్డువలస జలాశయం పరిధిలో లస్కర్ల వ్యవస్థ పటిష్ఠంగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల ద్వారా ఆయకట్టు శివారు భూములకు నీరు చేరేందుకు కీలకపాత్ర వహించే లస్కర్ల కొరతతో సాగునీరు చౌర్యానికి గురవుతోంది. ఎగువన ఉండే కర్షకులు నీటిని నిలిపివేస్తే.. కింద ఉండేవారికి అవస్థలు తప్పడంలేదు. లస్కర్లు ఉంటే వారబందీ ప్రకారం నీటిని మళ్లించేలా చూడటం, ఎక్కడ సమస్య ఉన్నా ఉన్నతాధికారులకు చేరవేసేందుకు వీలుంటుంది.

40 వేల ఎకరాల ఆయకట్టు..

జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన తర్వాత ప్రధాన కాలువ నుంచి ఉప కాలువలకు అక్కడి నుంచి చిన్న కాలువలకు నీరుచేరేలా చూడాలి. మడ్డువలస కుడి ప్రధాన కాలువ 52.7 కిలోమీటర్ల పొడవున ఉండేది. దీనిపై ఆధారపడి 40 వేల ఎకరాలపైనే ఆయకట్టు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి 2 లేదా 3 మీటర్లకు ఒక లస్కర్ ఉండాలి. ఈ లెక్కన జలాశయం వద్ద, కాలువల పరిధిలో మొత్తం 32 మంది అవసరం. ప్రస్తుతం 8 మంది మాత్రమే ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతిపాదనలతో సరి

ఏటా లస్కర్ల విషయమై ప్రతిపాదనలు పంపుతున్నట్లు సమాచారం. కాలువల లైనింగ్, గట్లు పటిష్ఠ పర్చడం, ఉప కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికలు తొలగించడం వంటి పనులకు వీరు అవసరం. లస్కర్లు కొరత వాస్తవమేనని మడ్డువలస డీఈ నాగేశ్వరరావు తెలిపారు. వారబందీ సమయంలో ఇబ్బందులు ఉంటున్నాయన్నారు. ప్రతిపాదనలు పంపుతున్నట్లు చెప్పారు.

## పరికరాలున్నాయ్.. సిబ్బందే లేరు

భీమవరం : పేద, మధ్య తరగతి వర్గాలకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం ఖరీదైన అధునాతన వైద్య పరికరాలను సమకూర్చింది. వాటిని వినియోగించేవారు లేకపోవడంతో రోగులు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు రాసిచ్చిన చీటీ తీసుకుని ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ల్యాబ్ పరీక్షలన్నా, ఎక్స్‌రే తీయించాలన్నా.. స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నా.. ప్రైవేటుగా రూ.1,200 నుంచి రూ.3,500కు పైగా ఖర్చవుతోంది. జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల వినియోగంపై ‘న్యూస్‌టుడే’ పరిశీలించగా.. పలు విషయాలు బహిర్గతమయ్యాయి. వీరంతా భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో ఎక్స్‌రే కోసం వేచి ఉన్నవారు. ఇక్కడకు గాయపడినవారు, ఇతరత్రా కారణాలతో ఎముకలు చిట్లినవారు ఎక్స్‌రే పరీక్షలకు రోజూ 15 నుంచి 23 మంది వస్తున్నారు. ఎక్స్‌రే తీసే రేడియోగ్రాఫర్ పోస్టు ఖాళీగా ఉండటంతో పరీక్షలు నిలిచిపోయాయి. ఎక్స్‌రే తీసేవారు వస్తారనుకుంటూ నొప్పి భరిస్తూనే ఆశతో రోగులు ఎక్స్‌రే గది దగ్గర ఇలా ఎదురుచూస్తున్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. రేడియాల



జిస్ట్ లేకపోవడంతో గర్భిణులు, ఇతరత్రా సమస్యలతో వచ్చిన రోగులు స్కానింగ్‌కు ప్రైవేటు పరీక్ష కేంద్రాల వైపు వెళ్తున్నారు.

నరసాపురంప్రాంతీయ ఆసుపత్రిలోని వెంటిలేటర్ కొన్నేళ్లుగా ఉపయోగించడంలేదు. సాంకేతికంగా ఉపయోగించే సిబ్బంది లేరంటూ మూలకు చేర్చారు.

**అయిదేళ్లుగా గాలికొదిలేశారు**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఆయా ఆసుపత్రులకు అధునాతన వైద్య పరికరాలు సమకూర్చారు. వాటి నిర్వహణను వైకాపా హయాంలో విస్మరించారు. పరికరాలు ఉపయోగించాల్సిన వైద్య, సిబ్బంది పోస్టులు ఖాళీ అయితే పట్టించుకోలేదు. సాంకేతిక సమస్యలు వస్తే వాటికి కనీసం మరమ్మతులు చేయించకుండా వినియోగం మరిచారు.

జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రులు– భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు

రోజూ ఆయా ఆసుపత్రులకు వైద్య పరీక్షలకు వచ్చే రోగుల సంఖ్య– 1250కుపైగాల్యాబ్, ఎక్స్‌రే ఇతరత్రా పరీక్షలు అవసరం ఉన్నవారు– 1050 మందికి పైగా**వినియోగంలోకి తీసుకొస్తాం..: డాక్టర్ పి.సూర్యనారాయణ, డీసీహెచ్‌ఎస్**

ప్రాంతీయ ఆసుపత్రుల్లో సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. పరికరాలు వినియోగంపై అనుభవం ఉన్న వైద్యులకు పరికరాల బాధ్యత అప్పగించాలని సూచించాం. మరమ్మతులు వస్తే వెంటనే బాగు చేయించి వినియోగంలో ఉంచాలని ఆసుపత్రుల పర్యవేక్షకులకు చెప్పాం. సిబ్బంది కొరత ఉన్నచోట సమీపంలోని ఆసుపత్రుల నుంచి సర్దుబాటు చేస్తాం.

## అదిగో రబీ.. విత్తన రాయితీ ఏదీ!

కడప : రబీ పంట కాలం అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానుంది. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీలో విత్తనాలను పంపిణీ చేయాలని అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అయితే ధరలు ఇంకా ఖరారు చేయలేదు. సేకరణ ప్రక్రియ కూడా ప్రారంభించలేదు. దీంతో అదునులో నాణ్యమైన విత్తనం అందుతుందా అనే అనుమానాలు అన్నదాతల్లో రేకెత్తుతున్నాయి.

**ప్రతిపాదనలతో సరిపుచ్చారు**

ఈ ఏడాది రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ ద్వారా అయిదు రకాల విత్తనాలను కర్షకులకు 45,758 క్వింటాళ్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సేకరణ, సరఫరా బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించారు. క్వింటా పూర్తి ధర, రాయితీ శాతం, రైతు ఎంత చెల్లించాలని ఇంకా ఖరారు చేయలేదు. ఇంతవరకు వంగడాలే ఆర్‌ఎస్‌కేలకు చేరలేదు. ముందస్తుగా ఇస్తే సాగుదారులకు



ఉపయుక్తంగా ఉంటుంది.

**అన్నదాతల ఎదురుచూపు**

కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ముద్దనూరు, పులివెందుల, పోరుమామిళ్ల డివిజన్ల పరిధిలో నల్లరేగడి, మెట్ట భూములు అధికం. శనగ పంటను ఏటా 75 వేల హెక్టార్లకు పైగా సాగు చేస్తుంటారు. ఆ మేరకు ఇప్పటికే సేద్యపు పనులు ముమ్మరం చేశారు. మినుము, పెసర, వేరుసెనగ, నువ్వు పంటను కూడా ఎక్కువగానే పండిస్తుంటారు. రాయితీ వంగడాల కోసం ఎదురుచూస్తున్నారు.

**విత్తన పంపిణీకి ఇబ్బందులు రానీయం**

రబీలో రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. సేకరణ, సరఫరా బాధ్యతలను ఏపీ సీడ్స్‌కు అప్పగించాం. ధరలు ఖరారవ్వగానే తెప్పిస్తాం. రైతులు ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. ఇబ్బందులు రాకుండా ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం. – చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి

చురకలు



## టోకెన్లు దొరక్క.. ఇక్కట్లు తప్పక!

తిరుపతి : తిరుమల శ్రీవారి భక్తులకు జారీ చేసే సర్వదర్శన టోకెన్ల విషయంలో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. టోకెన్లు లేని వారంతా నేరుగా తిరుమల వైకుంఠం-2 కాంప్లెక్స్ వద్దకు చేరుకుని సాధారణ క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షిస్తూ.. స్వామిని దర్శించుకుని వస్తున్నారు.

గతంలో ఉదయం నుంచి వేచి ఉన్న వారికి అర్ధరాత్రి 12 గంటలకు టోకెన్లు ఇచ్చేవారు. ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు ఇవ్వడం ప్రారంభించారు. అయితే ఒకరోజు ముందుగానే టోకెన్లు జారీ చేయడంతో వృద్ధులు, పిల్లాపాపలతో వచ్చిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఇలా చేస్తే మేలు..!**

టోకెన్ల సంఖ్యను బట్టి భక్తులను అనుమతించాలని, లేదా ముందుగా వచ్చిన వారికి జారీ చేసినా బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.టోకెన్లు పొంది, మరుసటి రోజు ఉదయం దర్శనానికి



వేచి ఉండే భక్తుల వసతిపైనా తితిదే దృష్టి సారించాల్సి ఉంది. శ్రీవారి మెట్టు మార్గంలో రోజూ 2 వేల నుంచి 3 వేల టోకెన్లు జారీ చేస్తున్నారు. పరిమితికి మించి భక్తులు క్యూలైన్‌లో వేచి ఉంటూ, ఆ తర్వాత టోకెన్లు దక్కకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలా కాకుండా టోకెన్ల సంఖ్యకు తగ్గట్టుగానే భక్తుల్ని క్యూలైన్‌లోకి అనుమతిస్తే ఇబ్బంది ఉండదు.

తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గంలో తెల్లవారుజాము నుంచి ధర్మ రథాలతో పాటు ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంచాలని, సర్వీసులు పెంచాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పారిశ్రామిక ప్రగతి.. యువతకు ఉపాధి

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో ప్రగతి ఊపందుకుంటోంది. తెదేపా హయాంలో పెనుకొండ మండలంలోని ఎర్రమంచి గ్రామ పరిధిలో కియా కార్ల పరిశ్రమ ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది ఉపాధి పొందుతున్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా 2019 నుంచి 2024 వరకు పరిశ్రమల ఏర్పాటును విస్మరించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో మళ్లీ పారిశ్రామిక కళ ఉట్టిపడుతోంది. పలు పరిశ్రమలు వస్తున్నాయి. రూ.21,168 కోట్లతో 30 భారీ పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా 35,126 మందికి ఉపాధి కల్పించేలా జిల్లా ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల, పెనుకొండ మండలం అమ్మవరిపల్లి, గుడిపల్లి వద్ద పరిశ్రమలు త్వరలో ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.



**అప్పుడు బెదిరింపు.. ఇప్పుడు పెద్దపీట**

నాడు వైకాపా ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు వచ్చేవారికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదు. భూముల కేటాయింపు, అనుమతుల మంజూరు గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. ఎవరూ ఇటువైపు రాలేదు. కొన్నిటికి అనుమతులు వచ్చినా.. యజమానులను బెదిరింపులకు గురిచేయడంతో వారు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంపద సృష్టికి పెద్దపీట వేయడంతో పారిశ్రామికవేత్తలను ఉత్తమ విధానాల ద్వారా ఆకట్టుకుంటోంది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి సింగిల్ డెస్క్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. పెండిగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తోంది. దీంతో పరిశ్రమలు వరుసకడుతున్నాయి.

## వైకాపా విస్మరించింది.. కూటమి సర్కారు చక్కదిద్దింది

తనకల్లు : తనకల్లు, నల్లచెరువు మండలాలకు ప్రధాన నీటి వనరులైన చెన్నరాయస్వామిగుడి (సీజీ ప్రాజెక్టు)ని వైకాపా ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సీజీ ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 34 లక్షల నిధులు మంజూరు చేయడంతో పలు మరమ్మతు పనులు ఊపందుకున్నాయి. కుడి, ఎడమ సాగునీటి కాలువల్లో పది కిలోమీటర్ల మేర ఏపుగా పెరిగిన ముళ్ల



పొదలను తొలగించి శుభ్రం చేయించారు. గేట్లకు పాత గ్రీజ్‌ను తొలగించి కొత్తగా వేశారు. కొన్నేళ్లుగా పేరుకున్న విద్యుత్తు బకాయిలు, ప్రాజెక్టు మరమ్మతులకు ఈ నిధులు వెచ్చించనున్నట్లు ఇరిగేషన్ ఏఈ బయప్ప తెలిపారు. గత వైకాపా పాలనలో ఆయకట్టు రైతులే సాగునీటి కాలువలను శుభ్రం చేసుకునే పరిస్థితి ఉండేది. గేట్లు తదితర మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని అనేకమార్లు అధికారులు నివేదికలు పంపినా స్పందించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వెంటిలేటర్లపై పెద్దాసుపత్రులు



గుత్తి: గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లోని ఆసుపత్రులు పేరుకే పెద్దాసుపత్రులు. తాడిపత్రి, గుంతకల్లులో ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ రెండు పురపాలికల్లోని ఆసుపత్రుల్లో వంద పడకలున్నాయి. గుత్తిలో మాత్రమే 52 పడకలున్నాయి. ఇక్కడ మాత్రం పడకల సంఖ్య పెరగడం లేదు. కేవలం సీహెచ్‌సీగానే కొనసాగుతోంది. రోజు వారి ఓపీ వందల్లో ఉంటోంది. రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్యులు లేరు.

**వందేళ్లుగా.. చిన్న ఆసుపత్రిగానే..**

గుత్తిలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఈసీజీ, ఎక్స్‌రే, రక్తపరీక్షల విభాగాలు ఉన్నాయి. ఇక్కడ బ్రిటిష్ హయాంలోనే సర్ థామస్ మన్రో పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వందేళ్ల కిందట చిన్న డిస్పెన్సరీగా ఉన్న ఆసుపత్రి ఇప్పటికీ ఎదుగూ బొదుగులేకుండా ఉంది. నాడు-నేడు కింద గత ప్రభుత్వ హయాంలో రూ.2.50కోట్లతో ఓపీ బ్లాక్‌ను నిర్మించారు. ఇక్కడ రోగులు వేచి ఉండేందుకు తగినన్ని కుర్చీలు లేవు. వైద్యం కోసం గంటలు తరబడి నిరీక్షించాల్సి ఉంది.

**ఉన్న సిబ్బందితో.. ఇబ్బందిగా**

గుంతకల్లులోని ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. 24మంది వైద్యులకు గాను కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. అత్యవసర విభాగానికి కూడా వైద్యుల కొరత ఉంది. స్టాఫ్‌నర్సులు తగినంత లేరు. ఉన్నసిబ్బంది పనిభారంతో అవస్థ పడుతున్నారు. ఇక్కడ వంద పడకలున్నాయి. దుప్పట్లను సరఫరా చేయడం లేదు. అల్ట్రా సౌండ్ స్కానింగ్‌యంత్రం ఉన్నా మహిళలకు మాత్రమే వినియోగిస్తున్నారు.

**రూ.కోట్ల ఖర్చు.. పాతభవనాలే దిక్కు**

తాడిపత్రిలో గత ప్రభుత్వం రూ.24 కోట్లతో నాడు-నేడు కింద ఆసుపత్రి భవనాలను చేపట్టింది. ఇప్పటికీ పూర్తికాకపోవడంతో పాత భవనాలలోనే వైద్య సేవలందిస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి అయినా వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వైద్యుల కొరత ఉంది. ఉదయం,సాయంత్రం ఆసుపత్రికి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు.

**మెరుగైన సేవలు అందిస్తాం**

డాక్టర్ ఎల్లప్ప, వైద్యాధికారి ,గుత్తి

రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తాం. రోగులకు సౌకర్యాలు, వసతులు మెరుగుపరిచేందుకు రూ.1.24కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గుత్తి ఆసుపత్రిలో వైద్యసేవలను మరింతగా మెరుగుపరిస్తే ప్రభుత్వం సౌకర్యాలు, వసతులు పెంచనుంది. 2014లోనే గుత్తి ఆసుపత్రిని వంద పడకలకు పెంచినా అప్పట్లో ఎవరూ పట్టించుకోకపోవడంతో రద్దు చేశారు.

## సొమ్ము పోయే.. ఇళ్లు రాకపాయే.. టిడ్కో కష్టాలు అన్నీ ఇన్నీ కావు



హిందూపురం : జగన్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు సామాన్యులకు కలిగించిన కష్టాలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. వారి వేదన అరణ్య రోదనగానే మిగులుతోంది. పేదల సొంతింటి కలను నిజం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం 2017లో టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇంటి నిర్మాణానికి వారి వాటా సొమ్ముగా 300 చదరపు అడుగుల ఇంటికి రూ.500, 365 చదరపు అడుగులకు రూ.50వేలు, 430 చదరపు అడుగులకు రూ.లక్ష చెల్లించాలని కోరింది. పేదలు ఒకేసారి చెల్లించలేరని భావించి విడుతల వారీగా రూ.12,500, రూ.25వేల చొప్పున చెల్లించడానికి అవకాశం కల్పించింది. ప్రభుత్వ వాటా, లబ్ధిదారులు చెల్లించిన సొమ్ముతో కలిపి జిల్లాలో హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి పట్టణాల్లో వేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న సమయంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

**వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపేసి..**టిడ్కో ఇళ్లను వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపేసింది. లబ్ధిదారుల కు వారు చెల్లించిన సొమ్మును వాపసు ఇస్తామని, జగనన్న కాలనీల్లో ఉచితంగా స్థలాన్ని ఇచ్చి ఇళ్లు ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ప్రకటించింది. అయితే ఐదేళ్లు పాలన పూర్తయినా వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. వారు చెల్లించిన సొమ్ము వాపసు ఇవ్వలేదు. జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి చేతులు దులుపుకొంది.

**పదివేల మందికి రూ.3.74 కోట్లు**

జిల్లాలోని నాలుగు పట్టణాలకు సంబంధించి 10 వేల మంది లబ్ధిదారులు తమ వాటా సొమ్ముగా రూ.3.74 కోట్ల సొమ్మును 2017 సంవత్సరంలో చెల్లించారు. అప్పు చేసి చెల్లించి వడ్డీలు కడుతున్నారు. జగన్ ప్రభుత్వం నిర్వాకం కారణంగా పేదలు అప్పుల పాలయ్యారు. ఆదుకోవాల్సిన కూటమి అదిగో ఇదిగో అంటూ పొద్దు పుచ్చుతోంది.

**వివరాలు సేకరిస్తున్నాం** మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

టిడ్కో ఇళ్లకు తమ వాటా సొమ్ము చెల్లించిన వారికి బకాయిలు ఉన్న మాట నిజమే. వారి వివరాలు, చెల్లించిన సొమ్ము ఎంత, ఎవరెవరికి జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు ఇచ్చారు తదితర వివరాలను సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి మున్సిపాలిటీలకు ఆదేశాలు వచ్చాయి. దీంతో వివరాల సేకరణ చేస్తున్నాం. త్వరలో బకాయిలు చెల్లించే అవకాశం ఉంది.

## ఆలయాల ముట్టడి.. ఎలా చోరుల కట్టడి?

అనంతపురం : ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో రక్షణ కొరవడింది. భద్రతా లోపాలను అనుకూలంగా మలుచుకుంటున్న దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం ముసలమ్మ దేవాలయంలో హుండీలను పగలగొట్టి రూ.రెండు లక్షలుపైగా దోచుకెళ్లారు. కొన్నిరోజుల తర్వాత దొంగలు ఆలయం వద్ద నగదు పడేసి వెళ్లడం చర్చనీయాంశమైంది.

ఉమ్మడి జిల్లాలోని ఆలయాల నుంచి ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. రక్షణ చర్యలు తీసుకోవడంలేదు. భక్తుల తాకిడి అధికంగా ఉండే పుణ్యక్షేత్రాల్లోనూ సీసీ కెమెరాలు పనిచేయకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కుందిర్పి మండలం కరిగానిపల్లి సమీపాన శశిమాకులమ్మ దేవాలయంలో ఈనెల 7న అర్ధరాత్రి దొంగలుపడి 3 తులాల బంగారు మాంగళ్యం గొలుసు, ఆరు తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. ఎర్రగుంట మారెమ్మ ఆలయంలో ఈనెల 9న దొంగలు ఐదు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు.

దుండగులు చోరీలకు లక్ష్యంగా చేసుకుంటున్న ఆలయాలు గ్రామ శివారు ప్రాంతాల్లో ఉంటున్నా కొన్ని మాత్రం దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. నిఘా లేకపోవడం, అర్చకులు స్థానికంగా లేకపోవడం దొంగలకు కలిసివస్తోంది. జులై 27న కంబదూరు మండల పరిధి తిమ్మాపురం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దుండగులు హుండీ ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు.

**నలభై గుడుల్లోనే..**

ఉమ్మడి జిల్లాలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రధాన ఆలయాలన్నింటిలో సీసీ కెమెరాలు, ప్రత్యేక నిఘా ఉండేవి. 170 ఆలయాల్లో సీసీ కెమెరాలను అప్పట్లో ఏర్పాటు చేశారు. తర్వాత వైకాపా ప్రభుత్వం



గాలికొదిలేయడంతో ప్రస్తుతం కేవలం నలభై ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని పురాతన ఆలయాల్లో గుప్త నిధుల తవ్వకాలు రహస్యంగా జరుగుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా కేసులు నమోదవుతున్నా.. నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. మడకశిర, పెనుకొండ, ఉరవకొండ, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, హిందూపురం, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లోని పాత దేవాలయాలను లక్ష్యంగా చేసుకుంటున్న దుండగులు గుప్తనిధుల కోసం ఆలయాలను ధ్వంసం చేస్తున్నారు. పలుచోట్ల విగ్రహాలను ఎత్తుకెళ్తున్నారు.

**భద్రతా చర్యలు చేపట్టాం..**

పి.జగదీశ్, ఎస్పీ, అనంతపురం

ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఉండాలి. ఇప్పటికే కొన్ని ఆలయాల్లో మరమ్మతులు చేయించాం. పనిచేయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

## ఉర్దూవిద్యకు గ్రహణం

ఆళ్లగడ్డ : మైనార్టీల విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలు అగుపించడం లేదు. మైనార్టీ విద్యార్థులకు విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం సంవృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2018లో 'ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమ్' పేరిట పథకాన్ని ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో ఆరు మండలాలు ఈ పథకం కింద ఎంపికవ్వగా వాటిలో రెండు మండలాలు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనే ఉండడం విశేషం. మైనార్టీలు అధికంగా ఉన్న శిరివెళ్ల, చాగలమర్రి మండలాలు ఈ పథకం కింద ఎంపికయ్యాయి. క్షేత్ర స్థాయిలో పనులు పూర్తికాక మైనార్టీ విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి.

**వైకాపా హయాంలో నిర్లక్ష్యం**

మైనార్టీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పీఎం జన వికాస్ కార్యక్రమ్ కింద శిరివెళ్ల, చాగలమర్రి మండలాల్లో రూ.6 కోట్ల నిధులతో ఐటీఐ, ఉర్దూ ఉన్నత పాఠశాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. చాగలమర్రి మండలం పెద్దవంగలి వద్ద రూ.3.99 కోట్లతో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులకు ఇప్పటి వరకు రూ.2.5కోట్ల పనులు పూర్తికాగా, మిగిలిన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కేవలం భవన నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఈ ప్రాంతంలో పది పూర్తి చేసిన మైనార్టీ విద్యార్థులకు



ఐటీఐ కళాశాల ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుంది.

శిరివెళ్లలో రూ.1.99కోట్లతో ఉర్దూ మాధ్యమ ఉన్నత పాఠశాల నిర్మాణం చేయాల్సి ఉన్నా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. నిధులను సద్వినియోగం చేసి మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

**మిథ్యగా కళాశాల విద్య**

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మైనార్టీ జనాభా 80వేల దాకా ఉంది. ఇక్కడ ఉర్దూ మాధ్యమంలో కళాశాల విద్యకు అవకాశమే లేని పరిస్థితి నెలకొంది. ఉర్దూ మాధ్యమంలో పది వరకు చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీడి యట్ చదవాలంటే నంద్యాలకు వెళ్లాల్సిందే. 30 నుంచి 70 కి.మీ. రాకపోకలు సాగించే పరిస్థితి ఉండడంతో చాలా మంది ఉర్దూ మాధ్యమ విద్యార్థులు పదితోనే చదువు ఆపేస్తు న్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

## స్త్రీనిధి.. పేదింటి పెన్నిధి!

ఆకివీడు : ఆకివీడుకు చెందిన లక్ష్మి తన కుమారుడిని విశాఖపట్నంలోని ఒక యూనివర్సిటీలో చదివిస్తున్నారు. దానికయ్యే ఖర్చుల కోసం గతంలో వెలుగు అధికారులను రుణం ఇప్పించాలని కోరగా అటువంటి అవకాశం లేదని చెప్పడంతో బయట రూ.50వేలు అధిక వడ్డీకు రుణం తీసుకుని అవసరాలు తీర్చారు. అప్పట్నుంచి నెలనెలా వడ్డీ కడుతూ వస్తున్నారు. పిల్లల చదువుల నిమిత్తం ఇకపై అధిక వడ్డీలకు బయట అప్పులు చేయనవసరం లేకుండా పావలా వడ్డీకే స్త్రీనిధి రుణం ఇవ్వనుండటంతో ఆ రుణం తీసుకుని బయట అప్పు తీర్చేయాలని లక్ష్మి భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తుంది. ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి పథకాలను ప్రకటించడం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలవనుంది.వీటిని వచ్చే నెలలో అమల్లోకి తీసుకురానుంది. జిల్లాలో పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వివాహాల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారికి ఆయా పథకాలు భరోసా కల్పించనున్నాయి.

**30 వేల సంఘాలకు లబ్ధి**

జిల్లాలో 30,120 స్వయం సహాయక సంఘాలుండగా 3 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఏటా రూ.వెయ్యికోట్లకు పైబడి రుణ లక్ష్యం ఉంటుంది. అత్యధికంగా యలమంచిలి, పాలకోడేరు, మొగల్తూరు మండలాల్లో మహిళలు సరాసరిన రూ.90 కోట్ల చొప్పున బ్యాంకు రుణాలు పొందుతున్నారు. ఇకపై వీరందరికీ చదువుకునే పిల్లలున్నా వివాహాలు కుదిరిన సంతానమున్న స్త్రీనిధి నుంచి అదనపు రుణాలు అందనున్నాయి.

ఈ ఏడాది రుణ లక్ష్యం- రూ.220.39 కోట్లు, ఇంత వరకు ఇచ్చింది- రూ.80.16 కోట్లు, లబ్ధిదారుల సంఖ్య- 9,086

**ఇదే తొలిసారి** గతంలో బ్యాంకు రుణాలకు బ్యాంకులు సాధారణ వడ్డీ వసూలు చేసినా ప్రభుత్వం పావలా వడ్డీ, సున్నా వడ్డీ వర్తింపజేసి రాయితీ చెక్కులను 6 నెలలకోసారి అందించేవారు. స్త్రీనిధి రుణాలకు మాత్రం పావలా వడ్డీ వర్తింపజేయడం ఇదే ప్రథమం. రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు పావలా వడ్డీ అంటే పేద కుటుంబాలకు చాలా ఊరట లభిస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీనిపై స్త్రీనిధి జిల్లా ఇన్‌ఛార్జి ఏజీఎం రమణమ్మ స్పందిస్తూ పూర్తి మార్గదర్శకాలు వచ్చాక అవసరం ఉన్న ప్రతి మహిళకు పావలా వడ్డీపై రుణాలు అందిస్తామన్నారు.

## ఈ గోడకు దయ ఎక్కువ

బొబ్బిలి : అది పేదల అవసరాలు తీర్చుతున్న దయగల గోడ.. ఒక్క రూపాయి తీసుకోకుండా సేవలు అందిస్తోంది. ఈ గోడ బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి కూడలిలో ఉంది. సాధారణంగా ఉద్యోగులు, సంపన్న వర్గాల వారు ఇళ్లలో పాత బడిన వస్తువులు, సైజు తేడాఉన్న దుస్తులు.. తదితరాలను విసిరేస్తుంటారు. బొబ్బిలి పట్టణవాసులు మాత్రం అలాంటి వాటిని'దయగల గోడ' వద్ద ఉంచుతారు. వాటిని పేదలు ఉచితంగా తీసుకెళ్తున్నారు.నాలుగేళ్ల క్రితం పాత బొబ్బిలికి చెందిన ఉపాధ్యాయుడు ఎం.విజయ మోహనరావు బస్టాండు పక్కన దీనిని ఏర్పాటు చేశారు. 'అవసరం లేని వస్తువులు ఇక్కడ పెట్టండి.. అవసరమైన వాటిని తీసుకెళ్లండి' అని అవగాహన కల్పించే విధంగా రాశారు. ఈ ప్రయత్నం మంచి ఫలితాలనిస్తోంది. చాలా మంది ద్విచక్ర వాహనాలు, కార్లలో వచ్చి అక్కడ వస్తువులు ఉంచేస్తున్నారు. అలా దినసరి కూలీలు, కార్మికులు, ఎలాంటి భరోసా లేని వారికి కల్పతరువుగా మారింది.రోజుకు 100 నుంచి 120 రకాల దుస్తులు, పదుల సంఖ్యలో చెప్పులు, బ్యాగులు, వంట సామగ్రి, అరుదుగా ఎలక్ట్రానిక్ వస్తువులు వస్తున్నాయి. విజయమోహనరావు స్నేహితులు కృష్ణదాసు, ఎస్.వి.రమణమూర్తి కొన్నిసార్లు వాటిని సమీప గిరిజన గ్రామాల్లోకి తీసుకెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఒకరికి వృథా అయినది.. మరొకరి అవసరంగా మారుతుందని, ఆ ఉద్దేశంతోనే దయగల గోడను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

## సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న రుక్మిణీ వసంత్!

అదృష్టం అనేది ఎప్పుడు ఎవరి తలుపు ఎలా తడుతుందో చెప్పడం అసాధ్యం. అందుకే ఆ అదృష్టం పట్టినప్పుడే సద్వినియోగం చేసుకోవాలని పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. ఈ క్రమంలోనే తన అద్భుతమైన నటనతో ఏకంగా వరుసగా పాన్ ఇండియా చిత్రాలలో అవకాశాలు అందుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది రుక్మిణీ వసంత్. 2024లో 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఇటీవల రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన 'కాంతార' సీక్వెల్ 'కాంతార చాప్టర్ 1' లో హీరోయిన్ గా అవకాశం అందుకొని భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా తన అందంతోనే కాదు నటనతో అందరినీ అబ్బురపరిచిన ఈమె.. కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి కంటే కూడా అద్భుతంగా నటించి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమా ఇచ్చిన క్రేజ్ తో ఈమె లెవెల్ భారీగా పెరిగిపోయింది అనడంలో సందేహం లేదు. ఇందులో సాంప్రదాయంగా మహారాణి కనకావతీ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. అయితే అలాంటి ఈమె తాజాగా సోషల్ మీడియాలో యాక్టివ్ అయిపోయిందని చెప్పవచ్చు. అందులో భాగంగానే ఇంస్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేయగా అందులో అందరి దృష్టిని ఆకర్షించింది అని చెప్పవచ్చు.



అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా పూజా కన్నన్ డిజైన్ చేసిన పర్పుల్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో మరొకసారి మెస్మరైజ్ చేసింది. దీనికి కాంబినేషన్లో కలంకారీ తో డిజైన్ చేసిన పైటతో తన మేకోవర్ను ఫుల్ ఫిల్ చేసింది. పగడాలు పొదిగిన సింపుల్ జువెలరీ తో తన అందాన్ని మరింత రెట్టింపు చేసిందని చెప్పవచ్చు. మొత్తానికైతే పర్పుల్ కలర్ లెహంగాలో చాలా సాంప్రదాయంగా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రుక్మిణి వసంత్ సినిమాల విషయానికి వస్తే.. రక్షిత్ శెట్టి హీరోగా హేమంత్ ఎం రావు దర్శకత్వంలో వచ్చిన 'సప్త సాగరాలు దాటి' అనే చిత్రంతో లైమ్ లైట్ లోకి వచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఇకపోతే తమిళంలో ఎస్ అనే చిత్రంలో నటించిన ఈమె.. ఆ తర్వాత ఏ. ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా నటించిన మదరాసి సినిమాలో హీరోయిన్గా నటించింది. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ అనుకున్నంత స్థాయిలో సక్సెస్ కాలేదు. ప్రస్తుతం మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 1994 డిసెంబర్ 10న కర్ణాటకలోని బెంగళూరులో కన్నడ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్. భారతదేశ అత్యున్నత శాంతి కాల సైనిక అలంకరణ అయిన అశోక చక్ర కర్ణాటక రాష్ట్రం నుండి పొందిన మొదటి వ్యక్తిగా పేరు దక్కించుకున్నారు.

## పెళ్లి విషయంలో ఓపెన్ అయిన ముద్దుగుమ్మ

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం పూర్తి చేసుకుంది. 2015 సంవత్సరంలో మలయాళం మూవీ ప్రేమమ్తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసింది. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడు మలయాళ సినిమాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు. కానీ లక్కీగా ఈ అమ్మడికి మొదటగా తమిళ్లో కోడి అనే సినిమాలో ఛాన్స్ దక్కింది. ఆ సినిమా తర్వాత తెలుగులో అ ఆ, ప్రేమమ్ సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. టాలీవుడ్లో ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే మంచి స్టార్డం దక్కించుకుంది. అ ఆ సినిమాలో అనుపమ



నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో అంతా ఆమెను అభిమానించడం మొదలు పెట్టారు, ఆ తర్వాత ప్రేమమ్ సినిమా ఆమె స్థాయిని మరింతగా పెంచేసింది.

**ప్రేమమ్తో టాలీవుడ్లో ఎంట్రీ...** తెలుగులో ఈమె 2017లో చేసిన శతమానం భవతి సూపర్ హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసే అవకాశం రాలేదు. ఇప్పటికీ టాలీవుడ్, కోలీవుడ్, మలయాళం ఇలా అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంది. దక్షిణాదిన అన్ని భాషల్లో నటించిన హీరోయిన్గా అనుపమ పరమేశ్వరన్ నిలిచింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు సైతం ఈమెకు ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల ఈమె పరదా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో మంచి కాన్సెప్ట్ను చూపించినా కమర్షియల్గా నిరాశ పరిచింది. అయినా కూడా ఈ అమ్మడి క్రేజ్ తగ్గలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఒకటి రెండు షూటింగ్ దశలో ఉంటే కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్లుగా సమాచారం అందుతోంది.

**అనుపమ పరమేశ్వరన్ పెళ్లి విషయంలో...** ఈ ఏడాది ఏకంగా ఆరు సినిమాలతో వచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన పెళ్లి విషయమై ఓపెన్ అయింది. మూడు పదుల వయసుకు చేరువ అవుతున్న నేపథ్యంలో అనుపమ పరమేశ్వరన్ పెళ్లి ఎప్పుడు అంటూ చాలా మంది అడుగుతూ ఉన్నారు. ఆ మధ్య అనుపమ పరమేశ్వరన్ ప్రేమలో ఉందనే వార్తలు తెగ వచ్చాయి. కానీ అవి పుకార్లే అని ఆ తర్వాత క్లారిటీ వచ్చింది. అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక చిట్ చాట్ సందర్భంగా ప్రేమ వివాహం గురించి స్పందించి అందరిని సర్ప్రైజ్ చేసింది. ప్రేమలో లేదని అంతా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ అమ్మడు తాను ప్రేమ వివాహం చేసుకుంటాను అని చెప్పడం ద్వారా కచ్చితంగా ఈమె ప్రేమలో ఉందని కొత్త ప్రచారం మొదలు అయింది. అయితే ఆమె మాత్రం ప్రేమ ఉన్నట్లు మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.




## పెళ్లైన తర్వాత తొలి రిలీజ్ అఖిల్ కి కలిసొచ్చేనా?



అక్కినేని వారసుడు అఖిల్ కెరీర్ లో సరైన సక్సస్ ఏది అంటే ఇంత వరకూ చెప్పుకునే చిత్రం ఒకే ఒక్కటి. అదే 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్లర్'. ఈ సినిమా మినహా చేసిన సినిమాలన్నీ వృద్ధా ప్రయత్నాలుగానే కనిపిస్తాయి. కొన్ని చిత్రాలు యావరేజ్ గా ఆడినప్పటికీ అక్కినేని రేంజ్ చిత్రాలు కావవి. 'ఏజెంట్' తో యాక్షన్ స్టార్ అవుతాడు అనుకున్నారు. కానీ ఆ సినిమా పరాజయం అఖిల్ ను అంతకంతకు కిందకు లాగేసింది. ఇలా ఇన్ని పరాజయాలు అఖిల్ వేగాన్ని కూడా తగ్గించాయి. నాటి నుంచి కథలు..దర్శకుల విషయంలో సెలక్టివ్ గా ఉండటం మొదలు పెట్టాడు.

**వాళ్లందరికీ ఇది షాక్:** మునుపటిలా తొందరపడి ఏ సినిమాకు ఒకే చెప్పడం లేదు. అవసరమైతే ఇంట్లో వారి సలహాలు తీసుకుంటున్నాడు. తన నిర్ణయాలపై నే కాకుండా? పెద్దవారిని కూడా సంప్రదించి అందరికీ ఒకే అనుకుంటనే ముందుకెళ్లడం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే అఖిల్ పెళ్లి కూడా జరిగింది. పెద్దలు చూసిన అమ్మాయినే అఖిల్ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అఖిల్ ఇండస్ట్రీకి వచ్చిన వేగం చూసి ప్రేమలో పడి ఆ తరహా వివాహనికే ఆసక్తి చూపిస్తాడనే విశ్లేషణలు ఆరంభంలో వ్యక్తమయ్యాయి. కానీ వారందరికీ షాక్ ఇచ్చి డాడ్ చూసిన సంబంధాన్నే చేసుకున్నాడు.

**రాయలసీమ నేపథ్యమే కొత్తగా:** వివాహమైతే జీవితంలో కొన్ని కొన్ని మార్పులు వస్తాయంటారు. మరి అఖిల్ విషయంలో ఎలాంటి ఛేంజెస్ వస్తాయో చూడాలి. ప్రస్తుతం అఖిల్ 'లెనిన్' అనే సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. 'ఏజెంట్' ప్లాప్ తర్వాత కమిట్ అయిన చిత్రమిది. అలాగే పెళ్లైన తర్వాత రిలీజ్ అవుతున్న తొలి చిత్రం కూడా ఇదే. దీంతో 'లెనిన్' సక్సస్ పై అక్కినేని కుటుంబమే కాదు ఆయన అభిమానులు కూడా చాలా ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాతో అఖిల్ పెద్ద విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. %-%లెనిన్%-% కథ కూడా రొటీన్ కు భిన్నమైన చిత్రమేమి కాదు.

**వివాహం తో కొత్త ప్రయాణం:** రాయలసీమ బ్యాక్ డ్రాప్ స్టోరీ. ఓ కుటుంబ నేపథ్యంలో సాగే కథనే కొత్తగా చెప్పబోతున్నారు. సీమ యువకుడి పాత్రలో అఖిల్ నటించడం అన్నది ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. %-%లెనిన్%-% కూడా వచ్చే ఏడాది రిలీజ్ అయ్యే సినిమాగానే కనిపిస్తోంది. సెట్స్ కు వెళ్లి కొన్ని నెలలు గడుస్తున్నా? షూటింగ్ నెమ్మదిగా జరుగుతోంది. ఇదే సమయంలో అఖిల్ పెళ్లి కూడా చేసుకోవడంతో మరింత గ్యాప్ ఏర్పడింది. వివాహం..హానీమూన్ అంటూ సెలవులు తీసుకున్నాడు. ప్రస్తుతం మాత్రం సెట్స్ కు హాజరవుతున్నాడు అనుకోండి.

## రెబల్ రాజా సాబ్.. కొత్త ట్రెండ్ సెట్ చేస్తాడా..?



రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ మారుతి డైరెక్షన్ లో తెరకెకుతున్న విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమాలో ప్రభాస్ తో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.

2026 సంక్రాంతి రేసులో దిగుతున్న రాజా సాబ్ సినిమా ట్రైలర్ ఆల్రెడీ రిలీజైంది. సినిమా కోసం మరో ట్రైలర్ ని రెడీ చేస్తున్నాడట డైరెక్టర్ మారుతి. ఐతే రాజా సాబ్ రెండో ట్రైలర్ సినిమాలో సీన్స్ తో కాకుండా కాన్సెప్ట్ వీడియో చేస్తున్నారట.

**సినిమాకు శాంపిల్ గా ఎలా ఉంటుందో..** కల్కి 2898 %ూణ% సినిమా కోసం నాగ్ అశ్విన్ ఎలాగైతే పాత్రలను పరిచయం చేస్తూ ఎలా అయితే ఒక సీరీస్ రిలీజ్ చేశాడో ఇప్పుడు మారుతి కూడా సినిమాలో లేని సీన్స్ తో.. ప్రత్యేకంగా ఒక స్పెషల్ ట్రైలర్ రెడీ చేస్తారట. ఇందుకోసం సెపరేట్ షూటింగ్ కూడా చేస్తున్నారని తెలుస్తుంది. ఇది క్లిక్ అయితే మాత్రం ఇక మీదట అందరు ఇదే ఫార్ములా ఫాలో అయ్యే ఛాన్స్ ఉంటుంది. అసలైతే సినిమా ట్రైలర్ అంటే సినిమాకు శాంపిల్ గా ఎలా ఉంటుందో అని చెప్పే ప్రయత్నం చేస్తారు. కానీ రాజా సాబ్ టీం మాత్రం సినిమా కాన్సెప్ట్ ని డిఫరెంట్ గా ప్రమోట్ చేయబోతున్నారట. తప్పకుండా ఈ అటెంప్ట్ సంథింగ్ డిఫరెంట్ గా ఉండే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. రాజా సాబ్ కోసం మారుతి రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నట్టు తెలుస్తుంది.

**రాజా సాబ్ ఫ్రాంచైజీగా..** ఈ సినిమాతో సక్సెస్ అందుకుని ప్రభాస్ తో మరో సినిమా అది రాజా సాబ్ ఫ్రాంచైజీగా తీయాలనే ప్లానింగ్ లో ఉన్నాడు మారుతి. పీపుల్ మీడియా మాత్రం మారుతికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. సినిమా బాగా వచ్చేందుకు ఎంత బడ్జెట్ అయినా పెట్టేందుకు రెడీ అనేస్తున్నారు. సో రాజా సాబ్ తో మారుతి కూడా పాన్ ఇండియా డైరెక్టర్స్ లిస్ట్ లో జాయిన్ అవుతున్నాడన్నమాట. సంక్రాంతికి వస్తున్న రాజా సాబ్ భారీ టార్గెట్ తో దిగుతుంది. రాజా సాబ్ సినిమాలో థమన్ మ్యూజిక్ కూడా మేజర్ హైలెట్ అయ్యేలా ఉంటుందట. సినిమా కాన్సెప్ట్ కు థమన్ బిజిఎం మరింత క్రేజీగా ఉంటుందని తెలుస్తుంది. మారుతి ప్రభాస్ కాంబినేషన్ లో వస్తున్న రాజా సాబ్ నిజంగానే రెబల్ ఫ్యాన్స్ కి ఫీస్ట్ ఇస్తుందా లేదా అన్నది సంక్రాంతి రిలీజ్ దాకా వెయిట్ చేయాల్సిందే. రాజా సాబ్ రెండో ట్రైలర్ పై సోషల్ మీడియాలో డిస్కషన్ మొదలైంది. సినిమాలో లేని సీన్స్ తో ట్రైలర్ అంటే ఆడియన్స్ లో కూడా క్యూరియాసిటీ పెరిగింది. మరి మారుతి ఈ అటెంప్ట్ ని ఎలా తీసుకొస్తారన్నది చూడాలి.

## ఆశా మేరీపై ఎన్నో ఆశలు!

కొన్ని సినిమాల్లో హీరో హీరోయిన్ల క్యారెక్టర్ల కంటే కూడా ఇంకొందరు చేసే పాత్రలే సినిమాపై ఆసక్తిని పెంచుతాయి. ఇప్పుడలాంటి సిట్యుయేషన్సే ఏర్పడ్డాయి. ప్రియదర్శి, ఆనంది ప్రధాన పాత్రల్లో వస్తోన్న ప్రేమంటే సినిమాలో నటి, యాంకర్ సుమ కీలక పాత్రలో కనిపించనున్నారు. కామెడీ ప్రధానంగా వస్తోన్న ఈ మూవీలో సుమ క్యారెక్టర్ నవ్వుల్ని పూయించడమే కాకుండా ఆడియన్స్ ను అలరించడం ఖాయమనే అనిపిస్తోంది.

**ఎంతమంది వచ్చినా ఆమె ప్లేస్ మారలేదు...** తెలుగు ఆడియన్స్ అందరికీ సుమ పరిచయస్తురాలే. కేవలం యాంకర్ గా మాత్రమే కాకుండా సినిమాల్లో తన కామెడీ టైమింగ్ తో అభిమానులను అలరిస్తూ వస్తున్నారు సుమ. ఇండస్ట్రీలోకి ఎంతోమంది కొత్త యాంకర్లు వస్తున్నప్పటికీ, సుమ స్థానం మాత్రం చెక్కు చెదరలేదు. ఇప్పటికీ పెద్ద సినిమాల ఈవెంట్ అంటే దానికి హోస్ట్ గా సుమ నే ఉంటారు. తన కామెడీ టైమింగ్ తో ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేస్తూ ఎంతో హుందాగా ఈవెంట్స్ ను హోస్ట్ చేస్తుంటారు సుమ.

**జయమ్మ పంచాయితీలో ఆఖరిగా కనిపించిన సుమ...** అలాంటి సుమ ఆఖరిగా జయమ్మ పంచాయితీ అనే సినిమాలో నటించారు ఆ సినిమా ఆడకపోయినా, సుమ తన యాక్టింగ్ తో ఆడియన్స్ ను ఆకట్టుకున్నారు. ఆ సినిమాలో ఎంతో నేచురల్ ఎమోషన్స్ తో సుమ నటించిన తీరు, దానికి కామెడీని జోడించిన విధానం అందరినీ ఎట్రాక్ట్ చేసింది. ఇప్పుడు సుమ, నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతూ వస్తోన్న ప్రేమంటే



అనే రొమాంటిక్ థ్రిల్లర్ లో కీలక పాత్రలో కనిపించనున్నారు.

**పోలీస్ పాత్రలో సుమ..** మొదటి నుంచే ఈ సినిమాకు మంచి బజ్ ఉంది. సినిమా ముహూర్తానికి రానా క్లాప్ కొట్టడం, సందీప్ రెడ్డి వంగా కెమెరా స్విచ్చాన్ చేయడంతో పూజా కార్యక్రమాల నుంచే ప్రేమంటే అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే ఈ సినిమాలో సుమ ఆశా మేరీ అనే పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ లో సుమ పోలీస్ యూనీఫాంలో అందరి దృష్టినీ ఆకర్షించారు.

**సినిమాలో హైలైట్ గా సుమ సీన్స్..** అయితే ఈ సినిమాలో సుమ క్యారెక్టర్ పోలీస్ అయినప్పటికీ ఆమె తన వృత్తి రీత్యా పెద్దగా స్ట్రిక్ట్ ఆఫీసరేమీ కాదు. పోలీసు క్యారెక్టర్ లో కూడా సుమ కామెడీ చేస్తూ కనిపించనున్నారని ఆల్రెడీ రిలీజైన కంటెంట్ చూస్తుంటే క్లారిటీ వస్తోంది. పోలీస్ ఆఫీసర్ పాత్రలో సుమ ఎలాంటి కామెడీ చేసి అలరించనున్నారో అని చూడ్డానికి ఆడియన్స్ ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారు. సినిమాలో ప్రియదర్శి, ఆనంది లీడ్ రోల్స్ చేసినప్పటికీ ప్రేమంటే లో సుమ నటించిన కొన్ని సీన్స్ సినిమా మొత్తానికే హైలైట్ గా నిలిచాయని, ఆమె పాత్రపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు చిత్ర మేకర్స్. మరి ఆశా మేరీ ఆడియన్స్ ను ఏ మేర అలరించి, ఆకట్టుకుంటుందో చూడాలి.

## ది గర్ల్ ఫ్రెండ్... అత్యధిక రేటుతో రికార్డ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఈ ఏడాది ఇప్పటి వరకు ఛావా, సికిందర్, కుబేరా, థామా సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఛావా సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. సల్మాన్ ఖాన్తో నటించిన సికిందర్ సినిమా డిజాస్టర్గా నిలిచింది. అయితే ధనుష్ తో కలిసి నటించిన కుబేరా సినిమా మాత్రం వంద కోట్లకు మించి వసూళ్లు రాబట్టి హిట్ చిత్రాల జాబితాలో నిలిచింది. థామా సినిమా మిశ్రమ స్పందన దక్కించుకుంది. అయితే ప్రతి సినిమా కూడా రష్మిక మందన్న స్థాయిని పెంచుతూనే వచ్చింది. ఆకట్టుకునే అందం తో పాటు తన నటనతో సినిమాల స్థాయిని పెంచుతూ ఉన్న రష్మిక మందన్న తన మోస్ట్ అవైటెడ్ లేడీ ఓరియంటెడ్ సినిమాను ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ అయింది.

**రష్మిక మందన్న హీరోయిన్గా ది గర్ల్ ఫ్రెండ్...** రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది.



టీజర్ విడుదల సమయంలోనే మ్యాటర్ ఉన్న సినిమా అనిపించింది. ఇప్పుడు ట్రైలర్ చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ సినిమా విడుదల తేదీ ఎప్పుడు అని చెక్ చేస్తున్నారు. రష్మిక మందన్న తన నటన విశ్వరూపం చూపించినట్లుగా నటించిందని ట్రైలర్ చూస్తే అనిపిస్తుంది. ట్రైలర్ కట్ తో సినిమాపై అంచనాలు, ఆసక్తి పెంచారు. నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రేక్షకులు సినిమా కోసం ఎదురు చూడటం, థియేట్రికల్ రిలీజ్ కి ఉన్న బజ్ నేపథ్యంలో ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ నెట్ఫ్లిక్స్ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. పలు ఓటీటీ సంస్థలు ముందుకు వచ్చినప్పటికీ నెట్ఫ్లిక్స్ వారు ఈ సినిమాను భారీ మొత్తాన్ని చెల్లించి దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

**రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో..** ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు గాను నెట్ఫ్లిక్స్ ఇండియా వారు దాదాపుగా రూ.14 కోట్ల పెట్టినట్లు తెలుస్తోంది. ఒక లేడీ ఓరియంటెడ్ మూవీకి ఈ మొత్తం ఖచ్చితంగా ఎక్కువగా చెబుతున్నారు. మీడియం రేంజ్ బడ్జెట్ మూవీకి ఈ స్థాయి బిజినెస్ జరగడం రికార్డ్ అంటున్నారు. తప్పకుండా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే విశ్వాసం ను వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో కొందరు ఈ సినిమా థియేట్రికల్ రన్ విషయంలో దెబ్బ తీసినా కచ్చితంగా ఓటీటీలో సూపర్ హిట్గా నిలిచే కంటెంట్ అంటున్నారు. రష్మిక మందన్న కోసం అయినా సినిమాను ఓటీటీ లో చూసేందుకు ప్రేక్షకులు నెట్ఫ్లిక్స్ లో లాగిన్ అవుతారు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అందుకే ముందు చూపుతో నెట్ఫ్లిక్స్ ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536